



సూదుల్లాంటి సూర్యకిరణాలు భూమిని గుచ్చుకొంటున్నాయి. అప్పటివరకూ ముతక దుప్పటిలాగా, ఆ పరిసరాల్ని కప్పుకునివున్న మంచు కరిగి, చిన్న చిన్న బిందువులుగా మారుతూ వుంది. అప్పుడప్పుడే ఆ ఆస్పత్రిలోని గదులు కడిగారేమో, లోషన్ వాసన ఆ ఉదయపు గాలిలో కలిసి, సుళ్ళు తిరుగుతూ పైకి తేలి, ఆ ఆస్పత్రి ఉనికిని అందరికీ తెలియజెప్పుతూంది. నర్సుల జోళ్ళచప్పుడూ, బైట చెట్లమీద పక్షులు చేస్తున్న కిలకిలారావాలూ తప్ప, అక్కడ అదోరకమైన గంభీరతతో కూడుకొన్న నిశ్శబ్దం ఆవరించి వుంది.

బెంగుళూరు నగరం చివరగా వుందా ప్రైవేట్ హాస్పిటల్. చుట్టుపక్కల గ్రామాలవాళ్ళకి సహాయకారిగా వసతిగా వుంటుందని, సిటీకి దూరంగా కట్టారు.

మెడికల్ సూపరింటెండెంట్ క్వార్టర్స్ మాత్రం ఆస్పత్రి కాంపౌండ్‌లోనే వుంది. తతిమ్మా డాక్టర్ల క్వార్టర్స్ ఆస్పత్రికి కొద్దిదూరంలో, అక్కడక్కడా కట్టారు. నర్సులు వుండటానికి రెండంతస్థుల మేడ. దాని చుట్టూ చిన్న ప్రహరీ గోడ కట్టారు. ఈ క్వార్టర్స్ ఆస్పత్రికి సుమారుగా ఒక ఫర్లాంగు దూరంలో వున్నాయి.

ఆస్పత్రి తయారైనాక ఎక్కడెక్కడి గ్రామాలనుండో రాసాగారు పేషెంట్లు. రానురాను, వారి సంఖ్య పెరిగిపోవటంవల్ల అక్కడున్న ముగ్గురు డాక్టర్లకీ, నర్సులకీ వూపిరి సలపనంత పని ఏర్పడింది. వచ్చే పేషెంట్లలో స్త్రీలే ఎక్కువగా వుండేవారు. కాన్పులనీ, గర్భస్రావాలనీ, రాత్రీ పగలనక వచ్చేవారు. వాటిలో కొన్ని అత్యంత క్లిష్టమైన కేసులూ, ఆపరేషన్లు చెయ్యాల్సినవీ కూడా వుండేవి. అందుకే కొద్దిరోజులు పోయాక గైనకాలజిస్టు కావాలంటూ పేపర్లో ప్రకటించారు. వచ్చిన అప్లికేషన్సన్నింటినీ చూసి, యింటర్వ్యూ జరిపి, చివరికి వెల్లూరులో తర్ఫీదు పొందిన ఒక డాక్టర్‌ని సెలెక్ట్ చేశారు మేనేజిమెంట్ కమిటీవారు. డిగ్రీలతోబాటు, అనుభవంకూడా వుండటంవల్ల అతడినే మెడికల్ సూపరింటెండెంట్‌గా నియమించారు. అతడి పేరు డాక్టర్ వినయ్‌కుమార్,

హాస్పిటల్లో నర్సింగ్ సూపరింటెండెంట్ గదిప్రక్కనే యింకోగది వుంది. హాస్పిటల్‌దాకా చీరకట్టుకొచ్చి ఆ తర్వాత ఆ గదిలో యూనిఫారం మార్చుకొంటారు చాలా మంది నర్సులు.

ఆ రోజు...అప్పటికే అందరూ యూనిఫారాలు తొడుక్కుని డ్యూటీలోకి వెళ్ళిపోయారు, ఒక్క దీప తప్ప... ఆలస్యంగా వచ్చిందేమో ; గబగబా డ్రెస్ మార్చుకుంటోంది ఆ గదిలో. ఏదో పనిమీద అటు వెళ్తూ నాలుగో సారి తొంగిచూసింది కుసుమ లోపలికి, తలుపు మెల్లగా ఒక చేత్తో తోస్తూ. "హమ్మయ్య ! వచ్చావా యింతకీ ? ఇంకా రాలేదేమానని ఒకటే గాబరా పడిపోయా నింతవరకూ. ఏం యివాళ యింత ఆలస్యంగా వచ్చావు దీపా ఏనాడూ లేనిది?" అంది కుసుమ ఆదుర్దాగా. ఆదరా, బాదరా, పరుగెట్టుకొచ్చిందేమో, వగరుస్తూంది దీప. జుట్టుకూడా గాలికి కొద్దిగా చెదిరింది. "పద...పద...తర్వాత మాట్లాడుకుందాం. ఇప్పటికే యిరవై నిమిషాలు...వూహూ సరిగ్గా అరగంట లేటయింది" అంటూ ఆఖరి హుక్ పెట్టేసుకుని బైటికొచ్చింది దీప.

"ఇదుగో మాట ! ఇవాళే నీ ఖర్మాని కన్నట్టుగా కొత్త సూపరింటెండెంట్ వచ్చారు. వెళ్ళి దర్శనం చేసుకో" అంటూ ఆ కాస్త సమాచారం అందించి మరీ వెళ్ళింది కుసుమ.

ఆ విషయం విన్నదే ఒక్కసారిగా ఎక్కడలేని నిస్సత్తువ ఆవరించింది దీపని. అయినా శక్తినంతా కూడగట్టుని పరుగులాంటి నడకతో వెళ్ళి, తలవంచుకుని ప్రిస్క్రిప్షన్ రాసిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్ ఎదుట నుంచొని తడబడుతూన్నట్టుగా "గుడ్ మార్నింగ్ డాక్టర్" అంది అతి మెల్లగా, అతడి ఏకాగ్రతకి భంగం కలిగించకూడదన్న ఉద్దేశంతో.

రాయటం ముగించి,స్వరం వినిపించినవైపు తలెత్తి చూశాడతను. పాలూ, పసుపూ కలిపితే వచ్చేరంగు. కాస్త సన్నగా, ఎత్తుగా గంభీరంగా వున్న విగ్రహం. వైద్య శాస్త్రంలో అతడికున్న విజ్ఞానం, అనుభవం ఎంత అపారమైనవో, అతడి మొహంలోని కాంతి, ఠీవి చెప్తున్నాయి. నీతి, నిజాయితీ వున్న వ్యక్తులందరిలాగానే అతడి కళ్ళు కూడా తీక్షణంగా వున్నాయి. అంతవరకూ పేషెంట్లతో ప్రసన్నంగా మాట్లాడుతూన్న అతడు దీపని ఓ రెప్పపాటు కాలం తీక్షణంగా చూశాడు. అతడి వదనం కఠినంగా మారిపోయింది. డ్యూటీని నిర్లక్ష్యంచేసి యిలా గుడ్‌మార్నింగుల్తో, సారీలతో సరిపెట్టుకోజూచే రకాలంటే నాకు పరమఅసహ్యం అన్నట్టు మరో నిమిషంపాటు తీక్షణంగా చూశాయాతడి కళ్ళు ఆమెని. ఆ తర్వాత అధికారం ధ్వనిస్తూన్న కంఠంతో "యస్" అని ఒక పేషెంటుని చేత్తో చూపించి ఆమె తాలూకు చీటీని దీప కిచ్చాడు.

పేషెంట్‌ని బల్లమీద పడుకోబెట్టి 'ఫాల్స్ పెయిన్స్' అవునో కాదో తెలుసుకోవటానికి ఎనీమా యిస్తోంది దీప. చేతులు తమ పని తాము చేసుకుపోతున్నా మనసుమాత్రం పరిపరి విధాల ఆలోచిస్తూంది. తను థియేటర్ ట్రైనింగ్ అయిన నర్స్‌గనుక, అందరికన్నా ఎక్కువ ఆత్రంగా గైనకాలజిస్ట్‌కోసం ఎదురుచూసింది. చెయ్యవలసిందీ, నేర్చుకోతగినదీ చాలా వుంటుందని ఎన్నెన్నో వూహించుకొంది.అయినా యిదేమిటి తన దురదృష్టం కాకపోతే ఏరోజూ లేనిది తనీవాళే ఆలస్యంగా రావటం ; అతడికి మొదట్లోనే తనమీద దురభిప్రాయం కలగటం...ఛీ...ఛీ...ఎంత తిరస్కారంగా చూశాడు తనకేసి ? జీవితంలో ఈ రోజింత దుర్దినం ? ఇలా సాగిపోతున్నాయి దీప ఆలోచనలు. ఆ తర్వాత చాలాసేపటికి తన భయాల్ని తల్చుకుని సిగ్గుపడింది. ఇలాంటి చిన్న చిన్న విషయాలని గూర్చి అనవసరంగా బాధపడి, నిరాశ చెందటం తన ఆశయాలకే విరుద్ధం. సమస్యలకి ఎదురొడ్డి నిలవాలి. జీవితంతో పోరాడి ముందుకుసాగాలి. ఇది తన స్థిర నిశ్చయం. ఇక దీనికి తిరుగులేదు. అనుకొంటూ తనకి తనే ధైర్యం చెప్పుకొంది.

అంతకు క్రితంరోజు ఏదో పనిమీద వచ్చాడు ఆ వూరు దీప పెదనాన్న. సాయంత్రం పనిముగించుకుని పదీ క్వార్టర్స్‌ని వెతుక్కుంటూ వచ్చాడు. పెదనాన్నని చూడగానే దీప మొహం సంతోషంతో వికసించింది. అతడామెకు బంధువే కాకుండా హితైషీ, అత్యంత ఆప్తుడుకూడా.

దగ్గరకు వచ్చిన దీప చెయ్యిపట్టుకుని ఎదుటవున్న మరో కుర్చీలో కూర్చోబెడుతూ "ఎలా వున్నావు తల్లీ ; చిక్కినట్టు కన్పిస్తున్నావేమ్మా ?" అన్నాడు ఆదరంగా ముసలాయన. "బాగున్నాను పెదనాన్నా ; నువ్వెలా వున్నావు ? అమ్మా, నాన్నా, తమ్ముడూ, చెల్లీ, అందరూ కులాసాయేనా" అడిగింది. ఇంటిసంగతులూ, ఊరి విశేషాలూ అన్నింటిగురించీ వరుసగా చెప్పుకొచ్చి ఆఖరుగా ఎంతో నచ్చచెప్తున్నట్టుగా అన్నాడు. "చూడమ్మా దీపా ! మీ నాన్నకి మీ ఆడపిల్లల భవిష్యత్తుగూర్చి కించిత్ ఆలోచనైనా లేదు. మరి ఆడదైన మీ అమ్మ అలా ఎలాగ వుండగలుగుతుందీ. పైగా నువ్వు ఉద్యోగమంటూ యింత దూరం వచ్చినప్పటినుండీ మా అందరికీ నిన్ను గూర్చిన ఆందోళనే. ఇంకెంతకాలం యిలా కన్యగా వుండిపోతావు

తల్లీ?ఇప్పుడు నేనీ వూరురావటంకూడా నీ వుద్దేశం తెలుసుకుని పోదామనే. ముఖ్యంగా చెప్పటం ఏమంటే కాకినాడనుండో సంబంధం వచ్చింది. నిన్ను చూస్తానన్నారు వాళ్ళు. ఒక వేళ యిది నిశ్చయమైతే యిల్లు అమ్మేసి, పదివేల కట్నంతో ఈ వేసవిలో నీ పెళ్ళి జరిపించేస్తామంటోంది మీ అమ్మ. మరి నిన్ను చూసుకోవటానికి రమ్మనమని వాళ్ళకి ఎప్పుడు వ్రాయమన్నావు ?"

నెమ్మదిగా నవ్వుతూ "యిప్పుడేగా వుద్యోగంలో చేరాను ? అప్పుడే ఏంతొందర" అంది.

ఈ పెళ్ళికి ఎగిరి గంతేసి ఒప్పుకొంటుందనుకున్న పట్టాభిరామయ్యకి దీప జవాబు వినగానే మనసుకి ఎంతో కష్టం కలిగింది. అయినా నచ్చజెప్తున్నట్టుగా "దీపా ! నువ్వింకా చిన్నపిల్లలాగా ప్రవర్తించటం ఏం బాగా లేదమ్మా. అనుభవంలోనూ, వయసులోనూ, నీకన్నా పెద్ద వాళ్ళం. ఇదింతా ఎందుకు చెప్తున్నాననుకొన్నావు ? నీవు సుఖంగా వుండాలని, నీ భవిష్యత్తు భద్రంగా వుండాలనీ కాదూ ? ఏదో కొంత చదువుకోగానే మేం పెద్దలం చేసే దంతా తప్పని కొట్టిపారెయ్యటం...ఊహూ...యిది నీకు తగదమ్మా, మళ్ళీ ఒకసారి సావకాశంగా ఆలోచించు'' అన్నాడు.

''నిజమేపెదనాన్నా;మీకన్నామామంచికోరేవారెవరున్నారు? కానీ మీ ఆలోచనల్లో మాత్రం మార్పు రావాలి. ఆ మార్పు యిప్పుడప్పుడే రానట్టయితే, అది మా యువతరమే బాధ్యత వహించి సాధిస్తుంది. మంచి గతమున కొంచెమేగా''?

''నా కా నమ్మకం లేదు దీపా ! ఆవేశపు పొంగు మీది. దాన్ని ఆరంభ శూరత్వం అంటిపెట్టుకొనే వుంటుంది. ముందుకి సాగడానికి ఓపిక ఎంతో వుండదు మీకు. వెనక్కి మళ్ళటానికి నామోషీ...గమ్యంలేని బాటమీది ప్రయాణం ఎన్నిచిక్కులు తెచ్చిపెడుతుందో ఏంతెలుసు నీకు ? ఇంతకీ ఏం చెప్పమన్నావు మీ అమ్మకి ?

గంభీరస్వరంతో అంది, "వివాహం అన్నది మనిషికి, లేదా నాలాగా ఉద్యోగం చేసుకొంటూ వున్న ఆడపిల్లకి గాలి, నీరు, ఆహారం అంత అవసరమా? అమ్మా, నాన్నా, పిల్లలూ, తిండికి, బట్టకీ యిబ్బందులు పడినరోజున తప్ప కుండా యిల్లు అమ్మేసెయ్యండి. అంతేకానీ నన్నో యింటికి తరలించటానికి మాత్రం కాదు. వీళ్ళందరి నోటిదగ్గర ముద్ద లాక్కుని నేను సుఖపడగలననే అనుకొంటున్నావా ? వద్దు పెదనాన్నా ; నే నొక్కదాన్ని ఏమైపోయినా సరే, నలుగురు నామూలంగా సుఖపడతారంటే నేనామార్గమేఎన్ను కుంటాను.అంతకు మించిన తృప్తి ఏదీ నా కివ్వలేదు.ఇప్పట్లో నన్ను పెళ్ళికి మీరెవ్వరూ ఒత్తిడి చెయ్యకండి పెదనాన్నా. నన్ను క్షమించు నీ మనసు నొప్పిస్తే.'

నాలుగైదు నిమిషాలసే పలాగే దీప మొహంలోకి కన్నార్పకుండా చూస్తుండిపోయాడు పట్టాభిరామయ్య. చెమరుస్తూన్న కళ్ళతో "నీ యిష్టం తల్లీ. ఈ యుగంలో వేలాది తలిదండ్రులు సమస్యల తాకిడికి హఠాత్తుగా కళ్ళు తెరిచిన సమయమిది. మా కాలం కనీసం అరశతాబ్దం వెనక్కి జరిగి వున్నట్టయితే, మా అందరికీ ఈ అశాంతి, నిస్సహాయత తప్పేవి. ఏంచేస్తాం ? నలుగురూ అనుభ విస్తూన్న బాధే యిది. అందరితో బాటూ అనుభవించక తప్పదుకదా ?''

"ఏం చెయ్యగలం, అని నీరసపడిపోతే లాభంలేదు పెదనాన్నా? ''ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దేన్ క్యూర్'' కాబట్టి ఈ సమస్యకి తాత్కాలిక నివారణ పనికిరాదు. వీటి అంతు తేల్చుకోవాలి" అంది.

ఆ మాటల్లో అసంబద్ధమైందేదీ కన్పించలేదు. తప్ప కుండా, ఈ పిల్ల తన ఆశయాల్ని సాధించి తీరుతుందన్న విశ్వాసం అతడి హృదయాంతరాళాల్లో ఒక్క క్షణంసేపు మెరిసింది, తళుక్కుమని.

వాత్సల్యంగా దీప తలని చేత్తో నిమురుతూ "నిన్ను నేను అర్థంచేసుకొన్నట్టు మీ అమ్మ చేసుకొంటుందను కున్నావా అమ్మా ? ఆవిడ పట్టుదల నీకు తెలియందికాదు. అయినా నచ్చజెప్పటానికి ప్రయత్నిస్తాను. ఇక వెళ్తాను తల్లీ నీ ఆరోగ్యం జాగ్రత్త.నా ఆశీస్సులెప్పుడూ నీ కుంటాయి" అంటూ లేచి నిలబడ్డాడు.వెళ్తూన్న అతడివైపే కళ్ళప్పగించి చూస్తూండిపోయింది చాలాసేపటికివరకూ.''

* * *

మాధవయ్య, వెంకటలక్ష్మమ్మ గారల తొలిసంతానం దీప. దీప దీపాల వేళ ఆమె జన్మించటంచేత మాధవయ్య ''దీపాంజలి'' అన్నపేరుని ఆమె పుట్టిన వెంటనే నిశ్చయం చేశాడు. రెండవది యశోద. ఆ తర్వాతవాడు గోపి. కాంపౌండర్ ఉద్యోగం చేస్తూన్న మాధవయ్యకి నెలజీతం తీసుకొచ్చి భార్యచేతిలో పొయ్యటంతప్ప యింకో సంగతి పట్టేదికాదు. భగవంతుడిమీద భారంవేసి నిశ్చింతగా బ్రతి కేసే అమాయకుల్లో అతనొకడు. ఎవరినీ నొప్పించే స్వభావం కాదతడిది. ఉన్నదాంతో సంతృప్తిచెందే మన స్తత్వం. కానీ వెంకటలక్ష్మమ్మ స్వభావం మాత్రం అత డికి పూర్తిగా విరుద్ధం. ఇంటివద్దకూడా మందులు,మాకులు, యివ్వటం మొదలుపెడ్తే జనం రావటం మొదలుపెట్టి, ఆ తర్వాత చుట్టుపక్కల పల్లెలవాళ్ళుకూడా రావటం సాగి

స్తారని, అప్పుడు సిరి తమ యింటికి పరుగులమీద వస్తుందని నిత్యం భర్తని పోరేది. మందులన్నీ మీ అధీనం లోనే వుంటాయికదా, ఏదో ఆ డాక్టర్‌కింత ముట్టజెప్పి, ఆ స్టోర్ కీపర్ వాటా వాడికిచ్చేస్తే, మందులే బంగారమవుతా యండీ! ఆ తర్వాత పది కాకుంటే పాతిక వేలిచ్చి కూతుళ్లకి పెళ్లిళ్ల చేసెయ్యోచ్చు" అంటే మాధవయ్య "అలాగే ప్రాక్టీస్ పెడతాలే. కానీ యిప్పుడప్పుడే కాదు... రిటైరయ్యాక" అనేవాడు నవ్వుతూ.

దీప స్కూల్ ఫైనల్ పాసయ్యాక, యిక పైకి చదివించొద్దని, పెళ్లి చేసెయ్యమని పట్టుబట్టింది వెంకటలక్ష్మమ్మ. చేసేదేమీ లేక 'వూ' అన్నాడు కానీ మాధవయ్యకీ తెలుసు దీపని కాలు, చెయ్యి, మతి, సరిగ్గా వుండి నాలుగురాళ్లు న్యాయంగా సంపాదిస్తున్నవాడికిచ్చి పెళ్లంటూ జరిపించటం తన నుదుట భగవంతుడు రాసిపెట్టలేదని.

ఉన్న వూళ్లోనే కాలేజీ. ఖర్చు ఎక్కువుండదు. పైగా మెరిట్ స్కాలర్‌షిప్ తప్పకుండా వస్తుంది. చదువు కొంటానని దీప ఎంత పోరినా లాభంలేకపోయింది. మాధవయ్య నిట్టూర్పులతో, వెంకటలక్ష్మమ్మ నిష్ఠూరాలతో యింకో ఏడాది గడిచిపోయింది.

తనని నర్సు ట్రెయినింగ్‌కు పంపించమని ఓరోజు సాయంకాలం తండ్రిని అడిగింది దీప. మాధవయ్య ఏమీ చెప్పలేకపోయాడు. భార్యతో నెమ్మదిగా చెప్పాడు ఆ విషయం. మహాలక్ష్మమ్మ మండిపడింది.ససేమిరా వీల్లేదంది.

ఈ గొడవ జరిగిన మూడోరోజు ప్రక్క వూళ్లోనే వున్న పెదనాన్నకి ఉత్తరం రాసింది దీప.

ఆ తర్వాత వారంరోజులకి పట్టాభిరామయ్య వచ్చాడు. మొగుడు ఏమీ చేతకానివాడనీ, అతడికి ఆలోచించటం అంతకన్నా తెలియదనీ అనుకొనే వెంకటలక్ష్మమ్మకి బావ గారంటే మాత్రం ఎనలేని శ్రద్ధా, గురి. రాత్రి భోజనా లయ్యాక ఏ ఉపోద్ఘాతమూ లేకుండానే పట్టాభిరామయ్య, "చూడు లక్ష్మమ్మా; ఈ యేడాదెంత ప్రయత్నించినా పెద్దమ్మాయి మెడలో ఆ మూడు ముళ్లు వేయించలేక పోయాం. భగవంతు డేముహూర్తంలో దానికి కల్యాణం నిశ్చయించాడో అప్పుడే జరుగుతుంది. అంతవరకూ యింట్లో వృధాగా కూర్చొనే బదులు ఆ నర్సు ట్రెయినింగ్ చదువుతేనేం ? వృత్తులన్నీ దేశ సౌభాగ్యం కోసం, మానవ కల్యాణంకోసం కాదూ? అంటూ ప్రక్కకి తిరిగి "ఒరేయ్! మాధవా; మనవూళ్లో దేవేంద్రశెట్టి లేడూ; అతడి రెండో కొడుకు ఆ మధ్య అమెరికా వెళ్లి వచ్చాడురా. అతడున్న హాస్టల్‌కి రోజూ ఓ ఆవిడ కార్లో వచ్చేదిట. మొదట్లో ఎవరో అనుకొన్నాడట కానీ తర్వాత తెలిసిందట. ఆవిడ అక్కడికి బాత్‌రూమూలూ, అవీ తుడవటాని కొస్తుందని, ఆవిడ పని ముగించుకుని బైటికి రాగానే అక్కడి విద్యార్థులు సరదాగా ఆవిడని టీ త్రాగటానికంటూ తమతో తీసుకెళ్లే వారట. పాకీపని చేస్తూందని, ఆమెది నీచమైన వృత్తని వారే గనుక అనుకొని వున్నట్టయితే, అలా ఆవిడని ప్రక్కన కూర్చోబెట్టుకుని తినగలిగేవారా ? భావ పరిధి విస్తృతం అయిననాడు, యిలాటివన్నీ అత్యల్పంగా గోచరిస్తాయి. అంతే" అన్నాడు.

మాధవయ్య మాత్రం ఏమీ మాట్లాడకుండా అన్నగారు చెప్తున్నది ఆశ్చర్యంగా వింటూ ఉండిపోయాడు. ఏ దేవతలు కరుణించారోగాని "మీ యిష్టం! మీరందరూ అవునంటూంటే నేనొక్కదాన్నీ కాదంటే మాత్రం చెల్లుతుందా? అలాగే కానివ్వండి" అనేసి చరచరా లోపలి కెళ్లిపోయింది వెంకట లక్ష్మమ్మ. భార్య లోపలికి వెళ్లిందే అన్నగారి వంక కృతజ్ఞతగా చూస్తూ తేలిగ్గా నిట్టూర్చాడు మాధవయ్య.

నర్స్ ట్రెయినింగ్ అవుతూన్న కాలంలో ఏ పూట యింటి కొచ్చినా, చెల్లెలు యశోదని దగ్గర కూర్చోబెట్టుకొని ఎన్నో విషయాలు చెప్తూండేది దీప. "హాస్పిటల్ అనగానే మొదటిగా మనకి గుర్తొచ్చేవి లోషన్ వాసన, సూదులు, మందులు, దర్జాగా వార్డ్సులో తిరిగే డాక్టర్లూను. కానీ అది మరో ప్రపంచం. ఇక్కడికన్నా అక్కడ బాధ, నిరాశ, భూతద్దంలో వస్తువుల్లాగా వుంటాయి యశూ ! రేపు అన్నది కొందరికి ఆశల కవాటాలు తెరిస్తే, మరి కొందరికి, చీకటి తెరలని కప్పుతుంది. ఆ కాస్త ప్రపంచానికి పేషెంట్ల దృష్టిలో సామ్రాట్టూ, దేవుడు కూడా డాక్టరే. వారి దృష్టిలో అతడికి సాధ్యం కానిదంటూ ఏదీలేదు. అందుకే తమవారిని తీసుకొచ్చి డాక్టర్ చేతికప్పగించగానే ఎంతో నిశ్చింత వాళ్లకి. కానీ మెరిసేదంతా బంగారం ఎలా అవుతుంది ?"

దీప యిలా చెప్పుకుపోతూంటే కళ్లింతింత చేసుకుని, తదేకంగా ఆమెనే చూస్తూ వింటూవుండేది యశోద.

కాలం ముందుకి సాగిపోతూ వయసుని మాత్రమే కాక, జ్ఞానం, విజ్ఞానంతోబాటు అనుభవాన్ని కూడా జత కలుపుతుంది జీవితాలకి. దీప కోర్సు పూర్తయింది. యశోద కూడా ఆ సంవత్సరం మంచి మార్కులతో స్కూల్ ఫైనల్ పాసైంది.

పల్లెజీవితం పిల్లకాలువలాటిదైతే జలపాతం లాంటిది పట్టణం నాగరకత. పూటకో రకం చీర సింగారించే

వయ్యారి మనసులాంటి, నిలకడలేని స్థితి ఎటు చూసినా. బెంగుళూరు నగరంలోని కడుగుపెట్టిన దీపకి అక్కడి వేషం, మనుషుల పరుగూ చూస్తూంటే కొత్తలో ఎంతో తమాషాగా అన్పించేది. చెప్పాపెట్టాకుండా కురిసే వర్షం, మంచు, చలీ ఎక్కడ చూసినా పేరు తెలీని విరగబూసి వున్న చెట్లు, యివన్నీ చూస్తుంటే ఎంతో కొత్తగా, గమ్మత్తుగా వుండేది. భాషకూడా క్రొత్త. అయినా చాలా మందికి తెలుగు వచ్చు. అదోరకం యాసతో మాట్లాడుతూంటే కొత్తలో సరిగా అర్థం కాకున్నా ఆ తర్వాత నెమ్మదిగా అలవాటు కావచ్చింది దీపకి.

బెంగుళూరు వచ్చిన మూడోరోజున దీప తండ్రికీ, యశోదకీ రెండు ఉత్తరాలు రాసింది. తండ్రికి తాను కులాసాగానే వున్నట్టూ, యిబ్బందులేవీ లేవనీ, అక్కడ చాలా బావుందనీ, తన గురించి ఎటువంటి దిగులూ పెట్టుకోవద్దని తల్లికి చెప్పమని రాసింది. రెండో వుత్తరం యశోదకి దీక్షగా, ఎంతో శ్రద్ధగా, ఆలోచించి మరీ రాసింది.

ప్రియమైన యశూ!

నువ్వు, గోపీ కులాసా అని తలుస్తాను. నేను బాగానే వున్నాను. గోపీ బాగా చదువుకొంటున్నాడనుకొంటాను.

నేను జాయినింగయిన ఆస్పత్రికన్నా యిదిచాలా పెద్దది. సిటీకి చాలా దూరంగావుంది. ఇక్కడికి వచ్చేవారిలో చాలా భాగం పల్లెప్రజలే. ఇళ్ళలో వైద్యాలు మానేసి, ఆస్పత్రికి రావటానికి యిప్పుడిప్పుడే అలవాటుపడుతున్నారు వీళ్ళంతా. పైగా యిదివర కిక్కడ ఒక క్వాక్ (నాటువైద్యుడు) వుండేవాడట. అతడిక్కడ నాలుగురోడ్ల కూడలివద్ద, చెట్టుక్రింద బాగ్ పట్టుకుని వుండేవాడట. ఎవరికే జబ్బొచ్చినా, యిక్కడికి పరుగెట్టుకొచ్చేవారట.ఇక అతడు ఎప్పుడూ సిరంజ్‌తో సిద్ధంగావుండి. పేషెంటు రాగానే తలనొప్పికీ, కడుపు నొప్పికీ, జ్వరానికీ, అన్నింటికీ పనిచేసే తన "సర్వరోగ నివారిణి"ని అమాంతం గుచ్చేసేవాడట పేషెంటు పాంట్ గానీ, షర్ట్‌గానీ విప్పకుండానే! పాపం ఎని ఏబ్సెస్‌లు అయ్యేవో భగవంతుడికే తెలుసు. ఈ హాస్పిటల్ అంటూ వచ్చాక ఆ డాక్టర్‌గారి ప్రాక్టీస్ బాగా పడిపోయింది. పాపం!

ఈ ఆస్పత్రి కాంపౌండ్ నిండుగా ఎన్నో పూలమొక్కలు. అరచెయ్యంత పూలుపూసే గులాబిమొక్కలు, సంపెంగ చెట్లూ, ఎన్నో వున్నాయి. ఎంత మనోహరంగా వుంటుందనీ వీటి వాసన! ఆస్పత్రికీ, మా క్వార్టర్స్‌కీ ఎక్కువ దూరంలేకున్నా ఉదయంపూట చూస్తే హాస్పిటల్ అసలు కన్పించదు. ఆఖరికి ఓ పదిగజాల దూరంలో ఏముందో కూడా తెలుసుకోవటం కష్టం. ఎందుకంటే, తెల్లగా, ఆవిరిలాగా మంచుకురుస్తూ వుంటుంది. కానీ కాస్త ఎండ ఎక్కేసరికి ఈ మంచంతా ఒక్కసారిగా మాయం అయిపోతుంది. చలికూడా బాగా ఎక్కువ యిక్కడ.

నేను వచ్చేటప్పుడు అందరితోపాటు నువ్వుకూడా కళ్ళనీళ్ళు పెట్టుకొన్నావు; నేను దూరం అవుతున్నాననేగా? జీవితంలో ఎన్నో క్లిష్టపరిస్థితులూ, నష్టపోయే సమయాలూ ఎదురవుతూంటాయి. అప్పటికి దాచుకోవాలి నీ కన్నీళ్ళు. నాకోసం, మనవాళ్ళకోసం. కాకుండా, నీకేమీకానివాళ్ళ కోసం...వాళ్ళ కష్టాల్ని, బాధల్ని, చూసి దుఃఖిస్తే ఆరోజు నేను నిజంగా సంతోషిస్తాను గర్విస్తాను. అది నేర్చుకోవాలి నువ్వు ముందు.

ఇలా యిల్లు వొదిలిపెట్టిరావటంకూడా ఒకవిధంగా మంచిదే అయింది. ఇలాంటి విషయాలు అమ్మ నీతో చెప్పనివ్వదు నన్ను. కానీ యిప్పుడు ఉత్తరాల్లో నీ కన్ని విషయాలూ రాయగలుగుతున్నాను. ఉత్తరం రాయి.

ప్రేమతో,

అక్కయ్య.

*　　*　　*

నర్సుల క్వార్టర్స్ రెండంతస్థులమేడ. అంతా ప్రశాంతంగా వున్నా డైనింగ్‌హాల్ మాత్రం సర్దుతూన్న పళ్ళాల చప్పుళ్ళతో, మాటల్తో, నవ్వుల్తో నిండిపోయింది. వంటవాళ్ళు ఒకచేత్తో అన్నం బక్కెటూ, యింకో చేత్తో గరిటా, పట్టుకొని యువతలకి రాగానే, ఎక్కడివాళ్ళక్కడ సర్దుకుని, బుద్ధిగా కూర్చోవటంతో అల్లరి ఒక్కమారుగా తగ్గిపోయింది. డ్యూటీకి వెళ్ళాల్సినవాళ్ళు గబగబా అన్నం నోట్లో కుక్కుకుంటూంటే, ఆ పూట "ఆఫ్" వున్నవాళ్ళు కబుర్లు చెప్పుకొంటూ, మధ్య మధ్యలో పొలమారుతూవుంటే ఒక్క గుక్క నీళ్ళు తాగుతూ, నవ్వుకొంటూ తాపీగా తింటున్నారు. దీపమాత్రం ఎటో చూస్తూ, అన్నం కెలకసాగింది. గుమ్మందగ్గర చారుగిన్నె పట్టుకుని నుంచున్న వంటతను శివయ్య దగ్గరగా వచ్చి "ఏమ్మా! రోజూ చూస్తూనేవున్నా; నువ్వన్నం సరిగ్గా తినటమేలేదు. ఇంటిమీద బెంగపెట్టుకొన్నావా? లేక యిక్కడి వంటలు నీకు సయించటంలేదా? చెప్పమ్మా!" అంటూ ఎంతో ఆదరంగా వచ్చీ రాని తెలుగులో అడిగాడు.

సిగ్గుపడిపోతూ, ''అబ్బే! అదేంలేదు. మీలాగా కూరల్లో, చారులో మేం బెల్లం వేసుకోముగా? మావి కాస్త ఘాటుగా వుంటాయి. అందుకే రుచి అదోలా వుంటంవల్ల సరిగ్గా తినలేకపోతున్నాను. ఫర్వాలేదులే నాలుగు రోజులుపోతే అదే అలవాటవుతుంది'' అంది.

"ఓ అదాసంగతి 'మరీ'! (మరీ అంటే "బిడ్డా" అని అర్థం కన్నడంలో) అవుతే వూరగాయ యింకొంచెం పట్టు కొస్తానుండు. కలుపుకు తిందువుగాని." అంటూ గబాగబా వెళ్ళి నాలుగు నిమ్మబద్దలు, వూట, కంచంలోకి వేస్తూ "తిను తల్లీ; రాత్రింబగళ్ళు పనిచేసే మీరు కడుపునిండుగా తినకపోతే ఎలాగమ్మా! తిను, తిను" అంటూ అక్కడే నుంచున్నాడు. అతడి ఆప్యాయత చూస్తూంటే ఒక్కసారిగా దీప మనసు ఆర్ద్రమైపోయింది. ఇక ఆ రోజునుండీ దీప తిండిని ఓ కంట కనిపెడుతూనే వుండేవాడు శివయ్య దూరంగా నుంచొని. అన్నం తిన్న తర్వాత వాష్‌బేసిన్‌లో చెయ్యి కడుక్కుంటూ "నా డ్యూటీ చేసేశాను" అన్నట్టు అతడి కేసి చూసి సన్నగా నవ్వేది దీప, ఆ రోజునుండీ.

నైట్ డ్యూటీ అయినా డే డ్యూటీ అయినా సాయంత్రాలు ఆరుగంటల తర్వాత కొంతసేపు ఖాళీగానే వుంటుందందరికీ. స్నానాలు చేసొచ్చి హాల్లో కబుర్లాడుతూనో, లేక పుస్తకాలు చదువుకొంటూనో వుంటారు కొంతమంది. వరండా ఎదుట చక్కటి లాన్. ఆ లాన్‌కి అంచులాగా పాయిన్‌సెట్టియా, బోగన్‌విల్లా ఎరుపు, పసుపు కేన్నాస్, కాంపౌండ్‌గేట్‌కి యిరువైపులా విరగపూసిన కెంపు సంపెంగచెట్లు, తమ పరిమళాన్ని నలువైపులా వెదజల్లుతూ అందరికీ ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తూవుంటాయి. హాల్లో లోపల గుమ్మం పక్కని ఓ పెద్ద నిలువుటద్దం. బంగారు రంగున్న ఫ్రేములో బిగింపబడి వుంది. మామూలుగా ఎవరూ దాని జోలికి వెళ్లరు కానీ డ్యూటీకి గానీ, షాపింగ్‌కి కానీ వెళ్తున్నప్పుడు మాత్రం ఓ అయిదు నిముషాలైనా దాని ఎదుట నుంచోకపోతే వాళ్లకి తోచదు.

ఓ రోజు సాయంత్రం గదిలో కూర్చొని యశోదవద్ద నుండి వచ్చిన ఉత్తరాన్ని చదువుకొంటూంది దీప. అంతలో ఎక్కడినుంచో గదిలోకి దూసుకొచ్చి దీప మంచంమీద కూలబడి, పడీ పడీ నవ్వసాగింది కుసుమ. తలెత్తి చూసిన దీపకి సంగతేమిటో అర్థంకాక, ఉత్తరాన్ని మడిచి దిండు క్రిందపెట్టి, కుసుమ ఎదురుగా వచ్చి చేతులు కట్టుకుని నుంచుని ప్రశ్నార్థకంగా చూసింది.

కొంగు నోటికడ్డం పెట్టుకుని నవ్వాపుకొంటూ "త్వరగా ఉత్తరం చదవటం పూర్తిచెయ్యి. నీకో తమాషా చూపిస్తాను" అంది.

"అప్పుడే రెండుసార్లు చదవటంఅయిందిలే. ఇకచదవక్కర్లేదు. ఇంతకీ ఏమిటా తమాషా?"

"రా, చూద్దువుగాని. చెప్తే అర్థంకాదు" అంటూ దీప జబ్బపట్టుకుని హాల్లోకి లాక్కుపోయింది కుసుమ.

అక్కడ ఏమీ కన్పించకపోవటంతో, వెనుదిరిగిన దీపని చేత్తో ఆపి, గట్టిగా ఏం మాట్లాడవద్దన్నట్టు నోటిమీద చూపుడువ్రేలుంచి, యింకోచేత్తో చూపించిం దక్కడి దృశ్యాన్ని.

నిలువుటద్దం ఎదుట బక్కపల్చగా, నల్లగా పైకి పొడుచుకు వచ్చినట్లున్న దవడ ఎముకల్తో, అందవికారంగా వున్న ఓ అమ్మాయి (నర్స్) నుంచొని ఎంతో శ్రద్ధగా ముస్తాబవుతోంది. ముంగురుల్ని జాగ్రత్తగా దువ్వెనతో నుదుటిమీదకి లాగి, పాపిడి కిరువైపులా జుట్టుని రెండు చేతుల్తో నెమ్మదిగా పైకి, క్రిందకి జార్చి వొదులు చేసింది. ఆ తర్వాత చీర కుచ్చెళ్లు చక్కగా సర్ది, ఆ మడతలు పక్కకి తొలగిపోకుండా పిన్ను గుచ్చింది. ఆ తర్వాత పమిటని భుజం మీదుగా జార్చి, అంచుని భుజంమీద వొత్తిపెట్టి అక్కడో పిన్ను గుచ్చింది. కొద్దిగా పక్కకి తిరిగి ఓరగా తన ప్రతిబింబం వంక చూసుకొంటూ బ్రేసియర్ జాకెట్ క్రింద నుండి తొంగి చూడటంలేదని నిర్ధారణయ్యాక, మళ్ళీ ఎదుటికి తిరిగి కుచ్చెళ్లు పాదాల్ని తాకుతున్నాయో లేదోనని ఓ మారు వొంగి చూసి, పెదిమలు విచ్చీ విచ్చనట్టు పల్చగా నవ్వింది!

ఇక రా; చాలు! అన్నట్టు కుసుమవైపు చూసి యివతలి కొచ్చేసింది దీప విసురుగా. కుసుమ కూడా దీప వెనకాలే పిల్లిలా అడుగులేస్తూ గదిలోకి రాగానే యింకోసారి పగలబడి నవ్వేస్తూ, "చూశావా, దీపా! ఎంత హడావిడిగా ముస్తాబవుతోందో ఎక్కడికో బ్యూటీ కంటెస్ట్‌కి వెళ్తూన్నదాని లాగా? రోజూ యిదే వరస యికనుండీ అమ్మగారు యివ్వాళ మధ్యాహ్నమే వచ్చిందట వూరినుండి. ఇక మనకు కావలసినంత కాలక్షేపం."

"ఇక్కడే వర్క్ చేస్తుందా తను?"

"ఆ! ఏన్యువల్ లీవ్‌లో వెళ్ళిందిలే. ఒకసారేం జరిగిందంటే...ఎక్కడా మొదట పనిదొరక్క యిక్కడో నాలుగు నెలలు పనిచేశాడులే ఓ పెంకి, డాక్టరు. ఒకరోజు ఈవిడని వార్డ్‌లో చూసాడట. ఏడిపిద్దామని బుద్ధిపుట్టింది కాబోలు వార్డ్‌లో ఈవిడ ఎదుట నుంచుని "అయ్యబాబోయ్. డెవిల్," అని గట్టిగా కేకేసి క్రింద పడిపోయ్యాడట! ఇది చూసి అక్కడివాళ్లు మొదట బిత్తరపోయినా ఆ తర్వాత తెలిసిందట అతను తమాషా చేస్తున్నాడని... ఆ తర్వాత అందరూ పొట్ట చెక్కలయ్యేలా నవ్వారట. ఇక ఆ రోజు మొదలు అందరూ ఈవిడని "లీల" అని పిలవటం మానేసి ముద్దుగా "డెవిల్" అని పిలవటం మొదలుపెట్టారు. పిచ్చి మొహం! చాలా అందగత్తెనని అనుకొంటుంది కాబోలు, గంటల

తరబడి సింగారం అద్దం ఎదుట! ఆవిడకి ముస్తాబుమీద ఎంత శ్రద్ధంటే, యితరులు తన వెనుకే నుంచొని నవ్వుతూన్నా కళ్లకి కనబడనంత... ఆగింది కుసుమ హఠాత్తుగా.

“డే ఆఫ్” లో వుందేమో అందుకే సన్నజాజులు పెట్టుకొంది దీప ఆ పూట. వాడిపోయిన పువ్వుల్ని జాగ్రత్తగా జడలోనుండి యివతలికి తీస్తూ నెమ్మదిగా తలెత్తి “నిజంగానే మీ అందరికీ అంత నవ్వొస్తూందా కుసుమా, ఆ అమ్మాయిని చూస్తూంటే?” అంది.

“మరి నవ్వకేం చేస్తాం యిలాటి వాళ్లని చూసి!” అంది వింతగా చూస్తూ కుసుమ.

జడలోనివీ, క్రిందరాలినవీ పూలన్నీ ఏరి ఓ పాత కవరులో పోసి చెత్తబుట్టలోనికి విసిరేస్తూ, గంభీరంగా స్థిరంగా అంది, “నవ్వాలి కుసుమా; బాగా నవ్వాలి జీవితంలో, చేతనైతే యిరవైనాలుగ్గంటలూ నవ్వుతూనే వుండాలి! కానీ... అది ఎదుటివాళ్లని సంతోషపెట్టటానికీ, వాళ్లకి మంచి జరిగిన సమయాల్లోనూ; యింకా... మనలోని లోపాల్ని, బలహీనతలని చూసుకొనీను. అంతేకానీ యిలాంటి దురదృష్టవంతుల్ని చూసి మాత్రం కాదు. ఆ హక్కు నీకూ, నాకూ, మరెవ్వరికీ, ఆఖరుకి అలాటివాళ్లని సృష్టించిన ఆ భగవంతుడికి కూడా లేదు!”

ఒక్కొక్క మాటే వింటూన్న కుసుమ మొహంలోని నవ్వు క్రమంగా అదృశ్యమైపోయింది. కొద్ది నిమిషాలలాగే కళ్లు విప్పార్చుకుని దీపవంకే చూస్తూండిపోయింది. ఆ తర్వాత అతి మెల్లగా పశ్చాత్తాపం నిండిన స్వరంతో “సారీ; దీపా! ఏనాడూ నేనీవిధంగా ఆలోచించలేదు. అందరిలాగే మాట్లాడటం, చెయ్యటం తప్ప. యింకో విధంగా ఆలోచించటం తెలీని నన్ను, నీ మాటలు ఈ క్షణంలో ఎంత మార్చివేశాయో తెలుసా? మన యిద్దరి చదువు, వయస్సు, యించుమించు సమానమే అయినా నీ వ్యక్తిత్వం ఎంత గొప్పది! నీ ఆలోచన లెంత వున్నంతగా వున్నాయి! నీతో స్నేహం చెయ్యటం కూడా ఒక వరమే; అది నా అదృష్టంగా భావిస్తున్నాను” అంది.

అంతవరకూ సీరియస్‌గా వున్న దీప ఫక్కుమని నవ్వేస్తూ “చాలించు తల్లీ నీ వుపన్యాసం! వినటానికి బాగానే వుంది నువ్వు పొగిడేస్తూంటే. కానీ డ్యూటీకి టైమవుతోంది! కాబట్టి మిగతా వుపన్యాసం వచ్చే సంచికలో...” అంటూ టవల్ భుజాన వేసుకుని మొహం కడుక్కోవటానికి వెళ్లింది.

* * *

డాక్టర్ వినయ్‌కుమార్‌ది సర్జరీలో అందెవేసిన చెయ్యి. వృత్తిపట్ల అతడికి ఎనలేని ఆసక్తి, గౌరవభావం వున్నాయి. హాస్పిటల్‌లో అడుగు పెట్టాక అతడికి ఆకలి, దప్పిక యివేవీ గుర్తుకిరావు. తన్ను తాను మర్చిపోయి డ్యూటీలో లీనం అయిపోతాడు. మామూలురోజుకీ, సెలవురోజుకీ, రాత్రికీ, పగలుకీ కూడా తేడా తెలియదతడికి. అందుకే అతడీ ఆస్పత్రిలో అడుగు మోపిందే ఆపరేషన్ల సంఖ్య పెరిగింది. ఎవరినోట్టంట చూసినా డాక్టర్ కుమార్ పేరు మ్రోగిపోవటం మొదలుపెట్టింది. క్రమంగా సిటీనుండి కూడా ఆయనవద్దకి కన్సల్టేషన్‌కోసం, ఆపరేషన్లకోసం జనం రాసాగారు. ముఖ్యంగా అతడి హస్తవాసి చాలా మంచిదనీ, అతడి చేతుల్తో “డి అండ్ సి” చేయించుకొంటే కడుపు తప్పకుండా పండుతుందనే ఆశతో వచ్చేవారు చాలామంది. అతడు వచ్చిన ఓ ఆరు నెలలకి ఒక సంఘటన జరిగింది. ఓ మధ్యాహ్నంపూట తన కన్సల్టింగ్‌రూంలో కూర్చొని క్లర్కు సాయంతో ఎక్కౌంట్స్ తనిఖీ చేస్తున్నాడు డాక్టర్ కుమార్. అంతలో బాయ్ వచ్చి చెప్పాడు ఎవరో ఒకావిడ ఆయనకోసం వచ్చిందని. “పంపించు లోపలికి” అన్నాడు యధాలాపంగా. స్వింగ్‌డోర్‌ని లోపలికి తోస్తూ నెమ్మదిగా, బెరుగ్గా, అడుగుపెట్టిందో యువతి. అందమూ అమాయకత్వమూ రెండూ పోటీపడుతున్నాయామె మొహంలో. ఖరీదైన బెనారస్ చీర ధరించింది. పమిట భుజంచుట్టూ లాక్కున్నా, ఆమె వొంటిమీదున్న నగలు, సగం సగం కన్పిస్తూ తళుక్కుమంటున్నాయి! ఒక్క క్షణంసేపు ఆమెని చూసినా గొప్పింటి ఆడబడుచని యిట్టే తెలిసిపోతుంది. లోనికి రాగానే ఆమె చప్పునవంగి డాక్టర్ కుమార్ పాదాల్ని అతిసున్నితంగా స్పృశించి, కళ్ళకద్దుకుంది.

ఈ చర్యకి నిజంగానే మతిపోయినట్టనిపించింది డాక్టర్ కుమార్‌కి. గబుక్కున పాదాలు వెనక్కి లాక్కుంటూ “ఏమిటమ్మాయిది? నో...నో...” అన్నాడు అదుర్దాగా, యింకేమనాలో తెలీక.

అతడికి దగ్గరగా, ఎదుటే నుంచుని, అతడి మొహంలోకి ఎంతో భక్తిగా, గౌరవంగా చూస్తూ, రెండుచేతులూ జోడించి, “డాక్టర్! మీరు...మీరు నాకెంతో ఉపకారం చేశారు. ఏం చేసినా మీ ఋణం తీర్చుకోలేను” అంది మృదుస్వరంతో.

“నేనా? ఉపకారమా? అసలు మిమ్మల్ని ఎప్పుడూ చూసినట్టుకూడా నాకు గుర్తులేదే?” అన్నాడు ఆశ్చర్యంగా.

“నిజమే! నేను మీకు గుర్తువుండే అవకాశంలేదు. కారణం నేనిదివరకిలా రాలేదు. చాలా మామూలుగా, సాధారణ స్త్రీలా వచ్చి మీచేత వైద్యం చేయించుకొన్నాను. కారణం

మాది పేరు ప్రతిష్టలు పుష్కలంగా వున్న కుటుంబం. పెళ్ళయి పదిహేనేళ్ళయినా సంతానం లేకపోయింది. పేరు మోసిన స్పెషలిస్టులచేత నాకు పరీక్షలూ, ఆపరేషన్లూ చేయించారు. తిరగని వూరూ, మొక్కని దేవుడంటూ లేడు. భగవంతుడు మా కన్నియిచ్చినా, ఈ వెలితిమాత్రం తీరనిది గానే వుండిపోయింది. మా అత్తగారు నన్ను సాధించని రోజంటూలేదు. ఆ తర్వాత కొంతకాలానికి ఆవిడకీ విసుగెత్తి, యిక నాజోలికిరావటం మానేసి, రెండోపెళ్ళి చేసుకోమని మావారిని పోరటం ప్రారంభించింది. అప్పటికే నేను మానసికంగా బాగా కృంగిపోయాను. నిద్రాహారాలు మాని రోజంతా ఏడుస్తుండేదాన్ని. ఎటూ దిక్కుతోచని ఆ పరిస్థితుల్లో మీగురించి మా పనిమనిషి చెప్పింది. అయినా మా అత్తగారిని మీవద్దకు నన్ను తీసుకెళ్ళమని అడగలేకపోయాను. కారణం ఆవిడ ఒప్పుకోదు మొదటిదిగా. పైగా సూటీపోటీమాటలని హేళనచేస్తుంది. అందుకే సాహసించి యింట్లోఎవరికీతెలియనివ్వకుండాఒక్కదానిటాక్సీలో మీవద్దకి వచ్చాను. మీరు నన్నారోజు పరీక్షచేసి, నాలో లోపల ఏమీ లేదనీ, ఆపరేషన్ చేస్తే ఫలితం వుండొచ్చనీ, ఎంతో ధైర్యం చెప్పారు. మీరామాత్రం భరోసా యివ్వగానే పొంగిపోయా న్నేను. మీ మాటలు చల్లగా, అమృతంలాగా న్పించాయి. మీ అంత స్నేహంగా. ఆదరంగా, ధైర్య వచనాలు చెప్పే డాక్టర్ని నేనింతవరకూ యిన్ని వూళ్ళు తిరిగినా ఎక్కడా చూడలేదు. చివరికి ఆపరేషన్‌కోసం వచ్చినప్పుడు కూడా ఒంటరిగానే వచ్చాను. డాక్టర్ ! ఇప్పుడు నాకు మూడోనెల ! ఆరిపోనున్న నా జీవితంలో మళ్ళీ మీ మూలంగానే వెలుగువచ్చింది. మీరు నిజంగా దేవుడిలాటివారు...డాక్టర్ ఓ నిమిషం అలా బైటికి రాగలరా ? మా వారూ, మా అత్తగారు మీ దర్శనం చేసుకోవాలంటున్నారు" అంది ఆమె.

ఆమె చెప్తూన్నదంతా ఆశ్చర్యంగా వింటూన్న డాక్టర్ కుమార్ చటుక్కున ఆశ్చర్యంలోనుండి తేరుకుంటూ "పదమ్మా" అన్నాడు.

వాళ్ళిద్దరూ యివతలికి రాగానే ఖరీదైన సూటులో ఠీవిగా వున్న ఆమెభర్త చప్పున లేచినుంచొని డాక్టర్ వైపు స్నేహపూర్వకంగా చెయ్యిచాచి "ఐ యాం రవిమోహన్" అని తనిని తాను పరిచయం చేసుకుని ఆ తర్వాత తల్లిని కూడా పరిచయం చేశాడు. వాళ్ళందరినీ ఆదరంగా తన కన్సల్టింగ్ రూంలోకి పిల్చుకెళ్ళి కూర్చోబెట్టాడు డాక్టర్ కుమార్.

ఓ నిమిషం అయ్యాక రవిమోహన్ "డాక్టర్! మిమ్మల్ని ప్రత్యేకంగా థాంక్ చెయ్యటానికి మేమందరం వచ్చాం. ఎంతో ఉపకారంచేశారు మా కుటుంబానికి. మీకేం యిచ్చినా ఋణంతీరదు. ఎన్ని వూళ్ళు తిరిగినా, ఎంతమంది డాక్టర్లని సంప్రదించినా ప్రయోజనం లేకపోయింది. చివరికి మీ హస్తవాసి చాలా గొప్పదవటంవల్ల నా భార్య ఈనాడు గర్భవతి అయింది."

"నో! నో! మిస్టర్ రవిమోహన్ ; హస్తవాసంటూ ఏమీ వుందనుకోను నేను. నేనూ అందరిలాంటి డాక్టర్నే. చిత్తశుద్ధి అంటూ వుంటే మనం చేసేపని తప్పకుండా సత్ఫలితాన్నిస్తుంది. అంతే !" అన్నాడు డాక్టర్ కుమార్ చాలా మామూలుగా.

అతడి నిరాడంబరతకి ఆ ముగ్గురూ ఎంతో ముగ్ధులయ్యారు. అంతలో రవిమోహన్ లేచి నుంచొని "డాక్టర్ మీ అమూల్యమైన సమయాన్ని వృధాచెయ్యటం నా కిష్టంలేదు. మేం వెళ్ళిపోయేముందు ఓ చిన్న కోరిక ; మా అందరి సంతోషంకోసం మీరీ చిన్న బహుమతిని స్వీకరించాలి. ప్లీజ్ ! అంటూ ఓ చిన్న అట్టపెట్టెని డాక్టర్ కుమార్ చేతిలో వుంచాడు.

యధాలాపంగా ఏమందులపెట్టెనో తీసిచూసినట్టు దాన్ని తెరిచి చూసాడు. ఎర్రటి మొఖమల్ లైనింగ్ వున్న ఆ చిన్న పెట్టెలో, కాంతులీనుతూన్న ఖరీదైన వజ్రపుటుంగరం తళుక్కుమంది ! కానీ అతడిమొహంలో ఎలాటి భావమూ కన్పించలేదు. వెంటనే మూసేస్తూ, రవిమోహన్ భుజంమీద చెయ్యివుంచి ఆప్యాయంగా తడ్తూ "మీ అభిమానానికి మించిన కానుక యింకేంవుంది. దట్స్ యనఫ్ ఫర్ మీ. ఇదుగో ఈ వుంగరాన్ని మీకు పుట్టబొయ్యే బాబుకి పెట్టినే నిచ్చానని చెప్పండి. థాంక్యూ ఆల్ వెరీమచ్" అన్నాడు. డాక్టర్ కుమార్.

* * *

హాల్లో ద్వారాలపైన తామర మొగ్గల ఆకారంలోవున్న అందమైన బల్బులు, చెరోవైపున వెలుగుతున్నాయి. చీకటితోబాటు చలికూడా నిమిషనిమిషానికి ఎక్కువవుతూంది. ఆపూట ఆఫ్‌వున్న నర్సులు కొందరు తమ గదుల్లో రగ్గులు కప్పుకుని వెచ్చగా పడుకున్నారు. ఇంకా నిద్రలు రానివారు నలుగురైదుగు రొకచోట చేరి సరదాగా పేక ఆడుకొంటున్నారు. పెందరాళే నిద్రపోవటం అలవాటులేని దీప, తన మొట్టమొదటి జీతంలో తనకోసం అంటూ కొనుక్కున్న వస్తువు– మారీ కొరెల్లీ రాసిన పుస్తకం "థెల్మా" తెచ్చుకుని పేము కుర్చీలో కూర్చుంది. రాత్రి తొమ్మిదిన్నరవుతూంది. అప్పుడప్పుడూ కొరడాతో చరిచి

నట్టు చలిగాలి రివ్వున వచ్చి శరీరాన్ని తాకుతూంది. లేచి వెళ్లి కిటికీ రెక్కవేసి వచ్చి కూర్చుంది. మళ్లీ ఆమె కళ్లు పుస్తకంలోని లైన్లవెంట పరుగెత్తసాగాయి.

అంతలో నెమ్మదిగా ఎవరో తలుపుమీద టకటక మని కొడుతూన్న చప్పుడు విన్పించింది. లేచి వెళ్లి మూసిన కిటికీకున్న గాజుపలకలోనుండి గుమ్మంవైపు చూసిన దీపకి ఎఱ్ఱటి పైటచెంగు కన్పించింది. ఎవరో యిక్కడివాళ్లే అయివుంటారని నిర్ధారించుకుని, నెమ్మదిగా తలుపు తీసింది. మెల్లగా పిల్లిలా అడుగులేస్తూ లోపలికి ప్రవేశించింది లీల! చల్లగాలి విసురుతోబాటు లీల వొంటిమీదనుండి అత్తరు పరిమళం అలలుగా తేలి దీప నాసికాపుటాల్ని సోకింది ఒక్క క్షణంసేపు దీప కళ్లు లీలని పరీక్షగా చూసాయి... జడలో అప్పుడే విచ్చుకొంటూన్న జాజిపూలమాల నుదుట ముత్యం అతికించిన ప్లాస్టిక్ బొట్టు, మెళ్లో ఒంటిపేట గొలుసు... వీటన్నిటిముందు వెలవెలాపోతున్న మొహం... కళ్లలో సంకోచం, భయం... మళ్లీ ఒకసారి తలెత్తి ఆ కళ్లలోకి చూసి స్నేహపూర్వకంగా నవ్వి, భుజంమీద చెయ్యివేసి యివతలకి లాగి, అంతవరకూ కొరికేస్తున్న చలిగాలిని లోనికి రానివ్వకుండా తలుపు రెక్కలు రెండూ దగ్గరకి లాగి గడియపెట్టింది. ఆ తర్వాత తలతిప్పి చూసే సరికి నెమ్మదిగా, చప్పుడు కాకుండా నడిచివెళ్తూ, గొంతుని బాగా తగ్గించి "థాంక్యూ" అంది లీల!

ఉదయం ఎనిమిదిగంటలవటాని కింకా పదినిమిషాలుంది. అప్పుడే విచ్చుకున్న లిల్లీపువ్వంత స్వచ్ఛంగావుంది హాస్పిటల్. దేవలోకంనుండి దిగివచ్చిన దేవతల్లాగా మెరిసి పోతున్నారు తెల్లటి బట్టల్లో నర్సులు. ఎటెండెన్స్ వేయించుకుని, తమ తమ డ్యూటీల ప్రకారం వెళ్తున్నారు వాళ్లందరూ. ఒక నర్స్ సిరెంజ్‌లూ, తతిమ్మా పరికరాలూ స్టెరిలైజ్ చేసి పక్కన పెట్టూంటే, యింకా కొంతమంది ఫార్మసీ సెక్షన్‌లో ఐ. వి. గ్లూకోస్, ఐ. వి. సెలైన్, డిస్టిల్డ్ వాటర్, సీసాలనీ చక్రాలున్న తోపుడు బండిలో వుంచి మరో గదిలోనికి చేరవేస్తున్నారు. థియేటర్ నర్సులు ఆ రోజున్న ఆపరేషన్ల లిస్ట్ ప్రకారం, పరికరాలన్నీ అమరుస్తూ, సర్దుతూ, హడావిడిగా తిరుగుతున్నారు. ఎక్కడ చూసినా, ఎవరూ ఒక్క నిమిషంకూడా వృధా పోనివ్వకుండా, ఎంతో శ్రద్ధతో, క్రమబద్ధంగా పని చేస్తూవున్నారు.

ఇంకా సేపటికి ఆపరేషన్ థియేటర్‌లో హడావిడి ఎక్కువైంది. ఆ పూట ఆపరేషన్‌కి అసిస్ట్ చెయ్యబొయ్యే డాక్టర్లొక రొకరే వచ్చి, చేతులు కడుక్కుని, గ్లోవ్స్ తొడుక్కుంటున్నారు.

అంతలో ఓ పేషెంట్‌ని స్ట్రెచర్‌మీద తీసుకొచ్చారు. ఆమెని చూసిన వెంటనే గుర్తుపట్టింది దీప. ఆమె పేరు అరవింద. ఓ వారం క్రిందటే డాక్టర్ కుమార్ ఆమెని పరీక్షిస్తుంటే ప్రక్కనే వుంది తాను. అంతంత మాత్రమే రక్తం వున్న ఆమె మొహంలో దైన్యంతో కూడిన ఓ రకమైన అందం వుంది. టేబిల్‌మీద పడుకుని, డాక్టర్ చెయ్యబోయే పరీక్షకోసం తనని సిద్ధంచేస్తూన్న దీపని చూసి సన్నగా నవ్విందామె, పలకరింపుగా. ఎంతోమంది పేషెంట్లు తెలిసివున్నా నర్సులని పట్టించుకోరు. అంటీ ముట్టనట్టుగా ప్రవర్తిస్తారు. గొప్పింటి స్త్రీలైతే కన్నెత్తి కూడా చూడరు. కానీ యివాళ అరవింద అంత స్నేహపూర్వకంగా నవ్వటం చూస్తే దీపకి ఎంతో సంతోషం కలిగింది. ఆమె మొహంమీదకి జారివున్న ముంగురుల్ని నెమ్మదిగా వెనక్కితోస్తూ "సన్నగా, పొడుగ్గా, ఎంతందంగా వున్నాయండీ మీ వ్రేళ్లు? పెయింట్ చేస్తారా మీరు?" అనడిగింది.

ఆ ప్రశ్న విన్నదే గాఢంగా నిట్టూరుస్తూ "ఆ! ఎప్పుడో కాలేజీ చదివే రోజుల్లో పెయింట్ చేసేదాన్ని, అంతే." అంది రెండు చేతుల్నీ కలిపి గుండెమీద వుంచుకొంటూ.

"అలాగా!" అంది దీప పల్చగా నవ్వుతూ.

స్వింగ్‌డోర్‌ని తోసుకొని లోపలికొచ్చాడు డాక్టర్ కుమార్. బల్లమీద పడుకున్న ఆమెని చూడగానే అతడి మొహం ప్రపుల్లమైంది. "సారీ! అరవిందా; కొద్దిగా లేటయింది" అని ఆమె పొట్టని అక్కడక్కడా నొక్కుతూ ఆ స్పర్శలో లోపలి అంగాల్లోని తేడాల్నీ, లోపాల్నీ గ్రహించటానికి ఏకాగ్రతతో ప్రయత్నించసాగాడు. ఓ అయిదు నిమిషాలు గడిచాక "సిస్టర్! స్పెకులమ్" అనడిగాడు. అందించింది దీప. అతి జాగ్రతగా దాన్నమర్చి మళ్లీ పరీక్షించాడు కొద్దినిమిషాలసేపు. ఆ తర్వాత అతడికి తెలీకుండానే బరువైన నిట్టూర్పొకటి వెలువడింది. స్పెకులమ్ తీసేస్తూ ''లే! అరవిందా, అయిపోయింది'' అని గ్లోవ్స్ విప్పేసి తన రూంలో కెళ్లిపోయాడు. ఆ తర్వాత కొంతసేపు డాక్టర్ కుమార్‌తో మాట్లాడి, వెళ్లి కారులో కూర్చుంది అరవింద. ఆమె భర్త శ్రీరాం మాత్రం ఏదో మాట్లాడుతూ, ప్రశ్నలడుగుతూ వున్నాడు డాక్టర్ కుమార్‌ని చాలా సేపటివరకూ. ''నువ్వు బ్లీడింగ్ అని అన్నప్పుడే నేను అనుమానించాను శ్రీరాం. అరవింద గర్భకోశం టూ వీక్స్ (ఎనిమిది వారాల) పరిమాణంలో వుంది. పైగా వుండాల్సినంత మెత్తగా లేదు. గట్టిగా, బిగదీసుకున్నట్టుగా వుంది. స్పష్టంగా తెలుస్తోంది లోపలున్న ఫైబ్రాయిడ్.

వచ్చే నెల డి అండ్ సి చేసి ఆ తర్వాత "హిస్టరెక్టమీ" చేస్తాను. డి అండ్ సి లో ఆ ఫైబ్రాయిడ్ పరిమాణం, పొజిషన్ కూడా తెలుస్తాయి. కానీ నువ్వీ వివరాలేమీ అరవిందతో చెప్పకు. గాభరాపడుతుందేమో!''

"అది మేజర్ ఆపరేషనా కుమార్? అరవింద తట్టుకో గలదంటావా?"

''ఆ! మేజర్ ఆపరేషనే. నలభై అయిదు నిమిషాలసేపు పట్టుంది. మరేం ఫర్వాలేదు. ఇక్కడ క్వాలిఫైడ్ అనస్తటిస్ట్ వున్నాడు. బ్లడ్‌బాంక్ కూడా వుంది. నువ్వేం వరీ కాకు" అన్నాడు.

ఇవాళ ఆమెకి ఆపరేషన్. స్ట్రెచర్ మీదనుండి టేబిల్ మీదకి మార్చగానే, ఆమె అక్కడే వున్న వాళ్లందర్నీ పెద్ద పెద్దవిగా నున్న ఆ లైట్లనీ, కళ్లప్పగించి చూస్తోంది. దీప, మాస్క్ కట్టుకోబోతున్నదల్లా ఆమె దగ్గరగా వచ్చి, నుంచొని అతి మెల్లని స్వరాన ''మరేం ఫర్వాలేదు" అంది, ధైర్యం చెబుతూన్నట్టుగా.

ఒక్కో వ్యక్తిని చూడగానే వెంటనే పరిచయం చేసుకోవాలనీ, స్నేహం పెంచుకోవాలనీ అనిపిస్తుంది. ఈ భావన ఎందుకు కలుగుతుందనేది తర్కానికందని ఎన్నో విషయాల్లో ఒకటి. దీపని మొట్టమొదటిసారిగా చూసినప్పుడు అరవిందకి కూడా సరిగ్గా అలాంటి భావనే కలిగింది. మళ్లీ ఈ రోజు యిక్కడ తిరిగి దీపని చూస్తుంటే, ఆమె మాటలు వింటూంటే ఎంతో ఉపశమనం కలిగినట్టుగా అనిపించసాగింది. అంతవరకూ వడలిపోయినట్టున్న ఆమె మొహం ఒక్కసారిగా స్నేహదీప్తితో ప్రకాశవంతం అయింది. ఆ పెదిమలు విడీవిడనట్టు, పల్చగా నవ్వింది. ఆ నవ్వు వెనుక "నువ్వున్నావు; నాకిక ఫర్వాలేదు" అన్న ధైర్యం వుంది.

అనస్తటిస్ట్ యిచ్చిన నైట్రస్ ఆక్సైడ్ మిశ్రమం ఆమె వూపిరితిత్తుల్లోకి ప్రవేశించగానే కౌంట్ చేస్తున్న అరవింద పెదిమలు కదలటం ఆగిపోయాయి. కళ్ల రెప్పలు మూతపడ్డాయి. బాధని మర్చిపోయి ప్రశాంతంగా నిద్రపోతూన్నట్టుంది అరవింద. బ్లడ్‌ప్రెషర్ చూస్తున్నాడొక డాక్టర్. గబగబా యినిసిషన్ చేసి, ఆపరేషన్ మొదలు పెట్టాడు డాక్టర్ కుమార్. దీప అతడి పక్కనే నుంచుని, అన్నీ అందిస్తూంది. దృష్టినంతా చేసూన్న పనిమీద కేంద్రీకరించటం వల్లనేమో అతడి కళ్లు తీక్షణంగా మెరుస్తున్నాయి. నుదుట పట్టిన చెమటబిందువు లా లైట్లకాంతిలో విచిత్రంగా మెరవసాగాయి. పరికరాల చప్పుడు తప్పితే అక్కడంతా నిశ్శబ్దంగావుంది. కొద్దిసేపయాక 'సీ' అంటూ రక్తం ముద్దల్లా వున్నదాన్ని తీసి ట్రేలో పడేశాడు.

వొంగి దానివంకే పరీక్షగా చూడసాగింది దీప. "అబ్బా! యింత పెద్ద గడ్డ అంత చిన్న గర్భకోశంలో వుందా ? ఎంత బాధననుభవించిందో పాపం! అయినా... యిక శారీరక బాధ తగ్గిపోయినా మానసికమైన బాధ మొదలవుతుంది కాబోలు. ఏ మూలనైనా మిణుమిణుకుమనే ఆశాకిరణం యింతకు మునుపున్నా అది కాస్తా యిప్పుడు పూర్తిగా ఆరిపోయింది. కారణం యిక ఆమె ఏ నాటికీ తల్లికాలేదు. శాశ్వతంగా ఆ హక్కుని పోగొట్టుకొంది...ప్చ్ !" అని ఆలోచిస్తూ అరవింద గూర్చి అంతరంగంలో బాధపడుతున్న దీపకి డాక్టర్ కుమార్ ''గాజ్'' అని రెండోసారి అడగటం కూడా విన్పించలేదు. మూడోసారి యిహ ఆలస్యాన్ని భరించలేనట్టుగా "సిస్టర్ పాస్ అన్ ది గాజ్'' అన్నాడు కాస్త కటువుగా! హఠాత్తుగా అతడి స్వరం వినటంతో వులిక్కిపడి. తెలివి తెచ్చుకుని గాజ్ తీసివ్వబోయింది. ఆపరేషన్‌కి అసిస్ట్ చేసూన్న డాక్టర్, అనవసరంగా ఆలస్యం అయిపోతూందని తనూ తీసివ్వబోయాడు. ఆ కంగారులో ఆ ముక్క యిద్దరి చేతికీ దొరకక్క క్రింద పడిపోయింది. ఈ అనుకోని పరిణామానికి ఒక్కసారిగా దీప నవనాడులూ క్రుంగిపోయాయి. తన అజాగ్రత్తకి తిట్టుకొంటూ, భయం, భయంగా డాక్టర్ కుమార్ వంక చూసింది. తననే తీక్షణంగా, కోపంగా చూస్తున్నాయా కళ్లు... ఒక్కసారిగా శరీరమంతా వణుకుపుట్టుకు రావటంతో, ఆ చూపుల్ని భరించలేక, తలవంచుకుని బొమ్మలా నుంచుండిపోయింది. కోపాన్ని అణచుకోవటానికన్నట్టతడు వంగివున్న వాడల్లా హఠాత్తుగా నిటారుగా నుంచుని, ఓ క్షణం పోయాక మళ్లీ వంగి, గబగబా ఆపరేషన్ పూర్తిచేశాడు.

* * *

రోజులు దొర్లిపోతున్నాయి. హాస్పిటల్ పేరు ప్రతిష్టలు నలువైపులా మారుమోగసాగాయి. అక్కడ పని నియమబద్ధంగా సాగేది. ఎవరైనా పొరబాట్లు చేస్తే కోప్పడకుండా స్నేహితుడిలాగా మందలించి, సలహానిచ్చేవాడు డాక్టర్ కుమార్. అందుకే అక్కడి వారందరికీ అతడంటే ఎనలేని భక్తి గౌరవాలేకాక అతడి క్రింద పనిచెయ్యటం కూడా ఓ గర్వకారణంగా వుండేది.

అక్కడి వాతావరణానికి, పనికి, క్రమంగా అలవాటుపడ్డా, ఆ తిండిని చూస్తుంటే మాత్రం ఏదో శిక్ష ననుభవించటానికే యిక్కడికి వచ్చినట్టనిపించేది దీపకి. ఇదంతా వొదిలేసి యింటికి పారిపోతేనో అన్పించేదొక్కోసారి. ఆ తర్వాత తీరిగ్గా కూర్చుని ఆలోచిస్తూంటే కర్తవ్యం గుర్తుకి

వచ్చి, ఆ ఆలోచనలకి సిగ్గుపడేది. జీవితమంటే రుచులేనా కేవలం? అంతకు మించిన విషయాల్లేవూ? కేవలం తిండి, నిద్ర, పెళ్లి, వీటికోసమేనా మనం ఈ భూమ్మీద పుట్టింది. వీటన్నిటినీ మించిన ఆశయాల సాధనలో ఎంతో ఆనందం, తృప్తి వున్నాయి. ఆ పోరాటంలో ఎంతో థ్రిల్ వుంది" అంటూ ఆలోచించేది.

ఓసారి అర్జెంటుగా ఏదో పరికరం కావలిసొచ్చింది. ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లి అలమారా తీసి వెతక సాగింది దీప. అలా అన్ని అరలూ లాగి చూస్తూంటే క్రింది అరలోనున్న ఒ. టి. యిన్స్ట్రుమెంట్స్ ఆమె దృష్టి నాకర్షించాయి. వాటిలో రెండు మూడు అప్పుడప్పుడే తుప్పుపడుతూ, అక్కడక్కడా ఎర్రటి మచ్చల్తో అసహ్యంగా వున్నాయి. గబుక్కున వాటినన్నిటినీ బైటికి లాగి, నాప్‌కిన్‌తో బాగా తుడిచి మళ్లీ సర్దింది. "అయ్యో! యిదేమిటి యిలా అయిపోయింది. కారణం ఏమై వుంటుందా అని, అలాగే తెరిచివుంచిన అల్మారా తలుపుని పట్టుకుని ఆలోచించసాగింది దీప. ఓ నాలుగయిదు నిమిషాలు గడి చాక వెంటనే ఆమె వూహకి తట్టింది దాని కారణం. గబ గబా తలుపు మూసేస్తూ, డాక్టర్ కుమార్‌తో ఈ విషయం చెప్పాలని నాలుగడుగులు వేసి, మళ్లీ హఠాత్తుగా ఆగి పోయింది... తను వెళ్లి చెప్తుందీ విషయం... విన్న తక్ష ణమే తనకేసి తిరస్కారంగా చూస్తాడు. దీనిక్కారణం నువ్వే నన్న అర్థం వచ్చేలా! ఏమిటి చెయ్యటం? ఇప్పుడీ విష యాన్ని దాచిపెట్టినా, తర్వాతైనా తెలుస్తుందతడికి. అప్పుడు అసలు తప్పించుకోవటానికి వీల్లేదు. ఇదేమిటి తన ఖర్మకొద్దీ, అతడి ఎదుట ప్రతిసారీ ఏదో పొరబాటు జరిగి నిష్కారణంగా తను దోషిలా నిలబడవలసి వస్తోంది! ఇక అతడికి తనమీద సదభిప్రాయం కలగాలంటే మాత్రం అవకాశం ఏదీ? అయ్యో భగవంతుడా అని ఓ అయిదు నిమి షాలసేపు మథనపడి, చివరికి వెళ్లి చెప్పటానికే నిశ్చ యించుకొంది.

సాయంత్రం అయిదుగంటలవుతూంది. పేషెంట్ల రద్దీ బాగా తగ్గిపోయింది. అప్పుడే రౌండ్స్ ముగించుకొచ్చి, తన సీట్లో కూర్చొని, మెడికల్ జర్నల్ తిరగేస్తున్నాడు డాక్టర్ కుమార్.

స్వింగ్‌డోర్‌ని నెమ్మదిగా తోసి, నిశ్శబ్దంగా వెళ్లి నుంచుని అతి మెల్లని స్వరాన "డాక్టర్" అంది దీప. పుస్తకం చదవటంలో లీనమైపోయిన అతడు తలెత్తకుండానే "యస్" అని మళ్లీ చదవటంలో మునిగిపోయాడు.

ఓ రెండు నిమిషాలాగి, భయ సందేహాలతో కొట్టు కుంటూన్న గుండెని దిటవుపర్చుకొంటూ కాస్త గట్టిగా "డాక్టర్" అంది మళ్లీ.

రెండో పిలుపుకి ఈ లోకంలోకొచ్చిన డాక్టర్ కుమార్ "అయాం సారీ" అంటూ పుస్తకం మూసేసి తలెత్తి చూసి "ఓ...యూ??" అన్నాడు ఆశ్చర్యంగా. అంతవరకూ ప్రసన్నంగా వున్న అతడి మొహం దీపని చూడగానే ఎర్ర బడింది. తీక్షణంగా చూశాడు ఏం పని యిక్కడ నీ కన్నట్టుగా.

అంతవరకూ ఏ మూలో నక్కివున్న ధైర్యం, అతడి వైఖరి చూడగానే చక్కాపారిపోయింది దీప గుండెలో నుంచి. టేబిల్ అంచుని గట్టిగా పట్టుకుంటూ "డాక్టర్! నే నివాళే చూశాను. ఒ. టి. యిన్స్ట్రుమెంట్స్‌లో కొన్ని తుప్పుపడుతున్నాయి" అంది గబగబా కంఠతా పట్టిన పాఠం అప్పజెప్తున్నట్టు.

ఈ మాట విన్నదే మండిపడతాడనుకుంది దీప. కాని అలాంటిదేం జరగలేదు. పుస్తకాన్ని టేబిల్‌మీద పెట్టేస్తూ "అవును మరి; వాటి బాధ్యతవున్న మనుషులు పగటిపూటే కలలు కంటూంటే, యిక అవి తుప్పుపట్టక ఏంచేస్తాయి మరి?" అన్నాడు తాపీగా!

ఇలాటి జవాబు అతడినుంచి వస్తుందని ముందుగానే వూహించినా, ఆ మాట. అతడన్న తీరు, వినగానే ఆమె మనసు కలుక్కుమంది. అయినా వెంటనే తమాయించు కొంటూ నిబ్బరంగా తలెత్తి "యిది...యిది నావల్ల మాత్రం జరిగింది కాదు" అంది సౌమ్యంగా.

కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ "అలాగా? మరి ఎవరి వల్ల జరిగిందో చెప్తే వింటాను" అన్నాడు ముద్దాయిని ప్రశ్నిస్తున్న తీరులో.

ఆ ప్రశ్నకి వెంటనే జవాబివ్వకుండా తల వంచుకుని "ఆ రోజు......థియేటర్లో నావల్ల చాలా పొరబాటు జరిగి పోయింది డాక్టర్! మనసులో ఏదో ఆలోచిస్తూండిపోయాను. ఆ సమయంలో అలా చెయ్యడం చాలా తప్పే. పనిమీది అశ్రద్ధతో మాత్రం నే నావిధంగా చెయ్యలేదు. క్షమించండి. ఇంతాలస్యంగా చెప్తున్నందుకు ఏమీ అనుకోకండి" అంది అర్థింపుగా.

ఆ కంఠంలోని తీరుకి ఒక్కసారిగా చలించిపోయా డతడు. రెండునిముషా లలాగే పరీక్షగా ఆమె మొహంలోకి చూశాడు. ఎంతో నిజాయితీ, పట్టుదలా, నిగ్రహమూ కన్పించాయి. అంతవరకూ అతడి మొహంలో వున్న కఠి నత్వం క్రమంగా మాయమైంది.

"పోనివ్వండి. 'బెటర్ లేట్ దేన్ నెవర్' ఆ, యింతకీ

ఆ యిన్స్ట్రుమెంట్స్ సంగతేమిటో చెప్తున్నారు--? ఎంతో మృదువుగా మారిపోయిందాతడి స్వరం ఈ కొద్ది క్షణాల్లోనే.

ఆ కంఠంలోని మృదుత్వానికి ఒక్కసారిగా ఆశ్చర్య పోతూ, తలెత్తి అతడి మొహంలోనికి చూస్తూ అంది! "పంపు నీళ్లు సంపోవటం లేదని స్టెరిలైజేషన్‌కి నూతినీళ్లు వాడుతున్నాం ఈ మధ్య. అవి వుప్పునీళ్ళవటంవల్ల యిన్స్ట్రుమెంట్స్ తుప్పుపడుతున్నాయి. ఇకనుండైనా ఆ నీళ్ళు వాడటం మానేస్తే ఫర్వాలేదు. లేకుంటే అన్నీ పాడై పోయే ప్రమాదం వుంది" అంది.

ఆశ్చర్యంతో అతడి కళ్ళు విప్పారాయి. ప్రశంసాపూర్వకంగా చూస్తూ, "సిస్టర్ మీ వూహ కరెక్టే. ఈ విషయం నా కిదివరకూ తట్టనేలేదు. వెంటనే కార్పొరేషన్‌కి అప్లికేషన్ పెడదాం మనకి యింకా ఎక్కువ నీళ్ళు కావాలని. వీలైనంత త్వరలో యిది జరిగేలా చూస్తాను" అన్నాడు. ఈ మాటలు అతడి నోటంట విన్నదే దీప హృదయం దూదిపింజలా తేలికైంది. ఒకసారి మళ్ళీ అతడికేసి చూసి "యిక వెళ్తాను డాక్టర్" అని బైటికి నడిచింది. వెళ్లిపోతున్న ఆమెవంకే కొద్ది క్షణాలు చూసి "అయ్యో, అనవసరంగా ఈమెని అపార్థంచేసుకుని కఠినంగా ప్రవర్తించానే" అని మనసులోనే బాధపడ్డాడు.

*　　　*　　　*

ఆ రోజు సంక్రాంతి. ఉదయాన్నే తలంటిపోసుకుంది దీప. ఇల్లూ, యింట్లోని అందరూ వరుసగా గుర్తుకిరాసాగారు. 'తప్పకుండా అమ్మ నన్నీరోజు తల్చుకుని బాధపడ్తుంది ఏం తిన్నానో, ఏమోనని. ఉత్తరం రాయాలి యిక్కడ క్షేమంగానే వున్నట్టు' అనుకొంటూ వాచీకేసి చూసుకొంది. డ్యూటీకింకా అరగంట టైం వుంది. తీరిగ్గా అన్ని సంగతులూ రాసి, అస్పత్రి గేటుదగ్గరే వున్న పోస్టుడబ్బాలో వుత్తరం వేసి వెళ్ళింది డ్యూటీకి.

పండుగ కావటాన జనం ఎక్కువగా లేరు. కొంత తెరిపిగావుందీ రోజు. చాలా రోజులుగా, పాత రబ్బర్ షీట్స్ తీసేసి కొత్తవి కత్తిరించి వెయ్యాలనుకొంటూనే వున్నా పని వత్తిడిలో యింతవరకూ కుదర్లేదు. ఇవాళైనా చేద్దాం అనుకొంటూ కత్తెర పట్టుకుని లినెన్ రూంలోకి వెళ్ళి ఒక్కొక్కటి కత్తిరించసాగింది. అన్నీ కత్తిరించటం పూర్తయ్యేసరికి చేతులు లాగటం మొదలుపెట్టాయి. బాగా దాహం వెయ్యసాగింది. అవన్నీ వరుసగా అల్మారాలో పేర్చి, యివతలకి రాబోతూ గుమ్మంబైటికి ఒక్క అడుగేసింది. సరిగ్గా అదే సమయాని కింకో వ్యక్తి హఠాత్తుగా లోనికి రావటంతో, తూలి, ముందుకి వొరిగింది. అంతలో ఆ వ్యక్తి కుడిచెయ్యి, దీప నడుముని బలంగా పట్టుకుని ముందుకి పడిపోకుండా ఆపింది! ఈ హఠాత్సంఘటనకి ఆశ్చర్య పోతూ, ఆ వ్యక్తి ఎవరా అని తలెత్తి చూసింది. తెల్లటి టెరికాటన్ పాంటూ, తెల్లటి షర్ట్ తొడుక్కుని, లేత నీలం రంగు టై కట్టుకున్న ఆ వ్యక్తి తలుపు రెక్కపైన ఒక చేతిని ఆన్చి, తననే తదేకంగా చూస్తున్నాడు. అతడి పెదిమలు సన్నటి నవ్వుతో విచ్చుకున్నా కళ్ళు మాత్రం దీపని గుచ్చి, గుచ్చి చూస్తున్నాయి.

తడబడుతూ దీప "ఐ యాం సారీ" అంది.

చూపులు మరల్చుకోకుండానే "ఐ యాం డాక్టర్ జయరాం," అన్నాడు దర్పం వుట్టిపడుతూన్న స్వరంతో.

ఇంకేమీ మాట్లాడకుండా చటుక్కున తల వంచుకుని గబగబా వెళ్లిపోయిందక్కడనుండి దీప. అక్కడే స్థాణువులా నుంచుని ఆమె వెళ్లిన వైపలాగే చూస్తుండిపోయాడు, చాలా సేపటివరకూ అతడు.

*　　　*　　　*

పాలిపోయి, పడిలిపోయినట్టున్న ఆమె మొహంలోనికి పరీక్షగా చూస్తూ '$B_{12}$' లోడ్ చేసిన సిరంజ్‌ని చేతిలో పట్టుకుని "వూ; చెయ్యి చాపు అరవిందా" అన్నాడు డాక్టర్ కుమార్. బొమ్మలాగా చెయ్యి చాపి యింజెక్షన్ తీసుకొంది. ఖాళీ సిరంజ్‌ని పక్కన పెడ్తూ, "ఓ నిమిషం కూర్చో, నీతో మాట్లాడాలి' అన్నాడు.

ఏమిటన్నట్లు చూసిందామె.

సీరియస్‌గా మారిపోయిందాతడి మొహం. "చూడు అరవిందా; ఎంత బలహీనంగా వున్నావో నువ్వు! నీ ఒంట్లో రక్తం బాగా తక్కువగా వుంది. నీ పెదిమెలు, గోళ్ళు, కళ్ళక్రింది భాగాలు ఎలా పాలిపోయి వున్నాయో ఏనాడైనా గమనించావా? ఇదివరకు వారానికోసారన్నా వచ్చి యింజెక్షన్ తీసుకుని వెళ్ళేదానివి. ఇప్పుడదీ లేదు. సరిగ్గా మూడు వారాలైంది నువ్విక్కడికొచ్చి. ఈ రోజైనా శ్రీరాం బలవంతంమీదే వచ్చావు; అవునా? ఇకమీదట యిలాగ చేశావంటే, నేనే ప్రతిరోజూ పని మానుకుని, మీ యింటికొచ్చి యిచ్చి వెళ్ళాల్సి వస్తుంది యింజెక్షన్లు, ఎంత టైం వేస్టయినా సరే" అన్నాడు నిష్ఠూరంగా.

"అహా! వొద్దు కుమార్! ఆ పనిమాత్రం చెయ్యకు. నా కోసం నీ పని మానేసుకుని మాత్రం రాకు. మా ఆయనా అంతే; ముఖ్యమైన పనులెన్ని వున్నా లెక్కచెయ్యకుండా, నాకేదో ధైర్యం చెప్పాలన్నట్టు గంటలతరబడీ కూర్చొంటారు నా దగ్గరే ఈ కబుర్లూ, ఆ కబుర్లూ చెప్తూ. ఇక

నువ్వుకూడా వస్తావా? మీలాటివాళ్ళ దినచర్యలో ప్రతి గంటకీ ఎంతో విశిష్టతా, విలువా వున్నాయి. అలాంటి సమయాన్ని నాకోసం వృధాచెయ్యటం నేను సహించలేను" ఈ చివరి వాక్యం అంటూంటే ఆమె కంఠం దుఃఖంతో రుద్ధమైంది.

మందులు, మాకులకన్నా ఒక్క మంచి మాట ఒక్కో సమయంలో వూహించని, అద్భుతమైన ఫలితాల నిస్తుంది. అందుకే డాక్టరన్న తర్వాత రోగి దేహస్థితి క్రమం తప్పి నప్పుడే కాకుండా, మానసిక పరిస్థితిని కూడా గుర్తించి తదనుగుణంగా చికిత్స చేస్తే అదే సరైన వైద్య విధానమని పించుకొంటుందన్న సిద్ధాంతంలో, అచంచల విశ్వాసం వున్నవాడవటంచేత, గొంతు నిండుగా ఆప్యాయత నింపుకొని "సృష్టిలో అందరి పాత్రా ఒకటే. ఇందులో హెచ్చు తగ్గులంటూ లేవు. ప్రతి మనిషి పుట్టుకా ఏదో ఒక ప్రయోజనాన్నుద్దేశించే వుంటుంది. నీలోని చైతన్యాన్ని నువ్వే అణచి వెయ్యాలనుకోవటం క్షమించరాని నేరం అరవిందా" అన్నాడు.

వెంటనే అంది: "అది మిగతావాళ్ళ విషయంలో కావచ్చు కుమార్. కానీ నా జీవితం చెల్లని నాణెం లాంటిది. ఇంత జరిగినా యింకా నేనెందుకు జీవించివున్నానో, అందరికీ నా మొహం ఎలా చూపగలుగుతున్నానో నాకే తెలియటం లేదు," అంది.

ఇలా మొండిగా వాదించే పేషెంట్లతో ఎలా మెలగాలో బాగా తెలుసు డాక్టర్ కుమార్‌కి. మాటకి మాట వెంట వెంటనే అందిస్తున్నా పట్టు వదిలిపెట్టదల్చుకోలేదు. అతడి బుర్రలోకి మెరుపులాంటి ఆలోచన రాగా కళ్ళు కొంటెగా మెరిశాయి. నిష్టూరం ధ్వనిస్తున్న స్వరంతో "అరవిందా! ఈ మధ్య నీకు మేమంటే బొత్తిగా శ్రద్ధలేకుండా పోతూంది. ఇంకొన్ని రోజులుపోతే అసలు గుర్తుకూడా వుండమేమో! ప్చ్! ఏం చేస్తాం?" అన్నాడు.

"చాల్చాల్లే ఏమిటా మాటలు? ఇంతకీ నేనేం చేశాననీ?"

"మొన్న మీ గేదె ఈనిందటగా; జున్నంటే నాకెంత యిష్టమో నీకు తెలుసుకదా? తెలిసీ నాకు పంపించలేదంటే నేనే మనుకోవాలి మరి? నో ... ఐ కెన్ నెవర్ ఫర్‌గివ్ యూ" అన్నాడు, సీరియస్‌గానే.

అతడి మాటలు పూర్తవకుండానే నొచ్చుకుంటూ అంది, "సారీ; కుమార్! అసలు నాకా విషయం గుర్తే రాలేదు సుమా. ఏమిటో నా కీ మధ్య దేనిమీదా శ్రద్ధవుండటంలేదు. ఇప్పుడు చూశావు కదూ; నీవు చెప్పేదాకా నా కీ సంగతి గుర్తే రాలేదు. నీ విషయంలో నే నేదైనా మర్చిపోతే అది నిజంగానే క్షమించరాని నేరం. ఇదుగో ... యిప్పుడే.... యింటికి వెళ్ళిన తక్షణం డ్రైవర్ చేత పంపిస్తాను."

"కూర్చోవమ్మా తల్లీ! మరీ అంత ఉద్రేకపడిపోతే ఎలాగ? ఆ! అన్నట్టు పాలు పంపించకు. అరుణకి సరిగ్గా రాదు జున్ను వండటం. నువ్వే వండి పంపించాలి; తెలిసిందా?" అన్నాడు.

* * *

చిన్నా, పెద్దా, అందరి పేషెంట్ల కళ్లూ డాక్టర్ కుమార్ కోసం, అతడి వాత్సల్యపూరితమైన చిరునవ్వుకోసం, అతడి చల్లటి స్పర్శకోసం ఎదురుచూసేవి. కారణం అతడు వారి పాలిట పెన్నిధి ... ఆరాధ్యదైవం ... వారి బాధనంతటినీ తన చేత్తో సమూలాగ్రంగా తీసివెయ్యగలిగిన ఒకానొక అపూర్వవ్యక్తి. అతడిని చూసిందే వారి కళ్ళు కాంతితో వెలిగేవి. శరీరంలో ఎక్కడనుంచో కొత్తగా శక్తి పుట్టుకువచ్చేది, హృదయం ఆరాధనాభావంతో బరువెక్కేది. ఇవన్నీ అతడికి బయటి ప్రపంచంలో లభించే ఆదరాభిమానాలు. కానీ దీపం క్రిందే చీకటి వుంటుంది! అది సహజం కూడాను. ఇదివరకేదైనా అతడి మనసుకి శాంతి అన్నది వున్నా, అది కాస్తా యిక్కడికి పచ్చాక పూర్తిగా హరించుకుపోయింది.

ప్రొద్దుటినుండీ విరామం లేకుండా పనిచేసి, మనసూ, శరీరం అలిసిపోగా, నెమ్మదిగా నడుచుకొంట్టూ వచ్చి కాంపౌండ్ గేట్ తీసి, లోపలికి అడుగుపెట్టాడు. తలుపు తాళం పెట్టివుండటం కన్పించింది. జేబులోంచి డూప్లికేట్ తాళంచెవితో తలుపు తీసుకుని లోపలికెళ్తే, టీపాయ్‌మీద అరుణ రాసిపెట్టిన చీటీ కన్పించింది. తాను సినిమాకు వెళ్తున్నాననీ, ఫ్లాస్కులో పోసి వుంచిన టీ తాగమనీ, తను రావటం ఆలస్యం అవుతుంది కనుక రాత్రి భోజనం కూడా తననే వడ్డించుకు తినమనీ వుందందులో. బూట్లు విప్పేసి, మొహం కడుక్కుని వచ్చి టీ త్రాగాడు. అలసటతోబాటు విసుగ్గాకూడా వుందాతడికి. ఏంచెయ్యాలో తోచక చేతి కందిన మేగజైన్ తీసుకుని, కాంపౌండ్‌లో బోగన్‌విల్లా పక్కని కుర్చీవేసుకుని పేజీలు తిరగెయ్య సాగాడు. చీకట్లు ముసురుకోవటం మూలాన అక్షరాలు కన్పించడం కష్టంగా వుంటే, లేచి వెళ్ళి యింట్లో వరండాలో లైట్లువేసి వచ్చి మళ్ళీ అక్కడే కూర్చున్నాడు. ఇక చదవబుద్ధెయ్యలేదు. ఇంటికొచ్చేవరకూ కరకరమంటూన్న ఆకలి ఎప్పుడో మాయం అయింది. వాచీ చూసుకున్నాడు.

ఏడున్నర కావస్తోంటే లోపలికి వెళ్ళి, ప్లేటు లాక్కుని, తనే వడ్డించుకుని తినసాగాడు. అలా ఒంటరిగా, ఖైదీలాగా, చల్లారిన మెతుకులు తినటం, ఏదో శిక్షననుభవిస్తున్నట్టుగా అన్పించింది మనసుకి. అంతే; మరునిమిషమే చెయ్యి కడిగేసుకుని, మళ్ళీ బైటికి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. అంతవరకూ వరండాలో ముడుచుకుని పడుకునివున్న కుక్కపిల్ల అతడి దగ్గరికి తోకాడించుకొంటూ వచ్చి ప్రేమగా, కాళ్ళని నాకసాగింది. వెనక్కి వాలి కూర్చుని వున్నతడు వంగి, ఆదరంగా దాన్నెత్తుకుని ఒళ్ళో వుంచుకున్నాడు.

గంట పదిన్నరవుతూండగా వచ్చిం దరుణ. ఆవిడ వెంట అతడు లోపలి కెళ్లకుండా, అలాగే అక్కడే కూర్చుండిపోయాడు. ఆ తర్వాత కొంతసేపటికి భోజనం ముగించి పిల్చించి అరుణ, "ఓవల్టిన్ కలిపాను; రండి !" అంటూ. నెమ్మదిగా లేచి వెళ్ళి ఓవల్టిన్ తాగి పక్కమీద పడుకున్నాడు నిశ్శబ్దంగా. తలుపులన్నీ గడియపెట్టేసి, తన మంచంమీద పడుకుని పిక్చర్ విశేషాలు ఉత్సాహంగా చెప్పసాగింది అరుణ.

మాటా పలుకూ లేకుండా పడుకుని వున్నాడతను.

మధ్యలో హఠాత్తుగా చెప్పటం ఆపి, "ఏమిటి నేను చెప్తున్నది వింటున్నారా ? లేక నిద్రపోతున్నారా ?" అంది.

"వూ హూ" అన్నాడు.

"ఏమిటి వూ హూ ? నిద్రా ? లేక వినటమా" అంది మళ్ళీ. "ఏమీలేదు అరుణా; విసిగించకు నన్ను" అన్నాడు.

"మిమ్మల్నేం విసిగించా న్నేను ? చెప్పండి; ఏమిటదోలా వున్నారు; వచ్చినప్పటినుంచి చూస్తున్నాను" అంది.

"చెప్పమన్నావా ? సరే విను !" అంటూ అరుణవైపు పూర్తిగా తిరిగి ఆమెనే నిశితంగా చూస్తూ అన్నాడు– "ఎవరి పర్మిషన్ తీసుకుని హాస్పిటల్ వాన్ తీసుకుని అందులో సినిమా కెళ్ళావు ? చెప్పు ?" అన్నాడు.

అంతవరకూ ఆశ్చర్యంగా అతడినే గమనిస్తూన్న అరుణ ఈ ప్రశ్న విన్నదే తేలికపడ్డ మనసుతో, నవ్వేస్తూ "అదేమిటండీ; ఆ వాన్ వున్నది మీ ఇన్‌చార్జిలోనే కదా ! ఇహ అడిగినా ఒకటే...లేకున్నా..."

మధ్యలోనే ఆమె మాటల్ని ఖండిస్తూ "అరుణా ! సినిమాకి వాన్లో వెళ్లటానికి నే ననుమతిస్తానని ఎలా ఊహించావు ? దీనికి నేను ఎన్నటికీ ఒప్పుకోనని నీకు బాగా తెలుసు. అయినా వెళ్లావు ! నేనంటే నీకు కించిత్ గౌరవమైనా వున్నట్టయితే సువ్విపని చేసేదానివే కాదు. అంతేనా ?" కఠినంగా వుందాతడి స్వరం.

"నేనేం రోజూ వెళ్తున్నానా వాన్‌లో ? ఎప్పుడో ఒక రోజు సరదాపడి వెళ్తే దానికింత రాద్ధాంతం చేస్తారేం ? ఆస్పత్రికోసం యింత శ్రమపడుతున్నారు కదా; మరి మీరు పొందుతున్న లాభంమాత్రం ఏమిటి ? ఎప్పుడో యిలా మనం వాడుకున్నా, ఎవరూ మనల్ని ఏమీ అనరు. మీవన్నీ అనవసరం భయాలు కానీ" అంది కొట్టిపారేస్తూ.

"అరుణా ! 'పరిచర్య' అంటూ చేస్తున్నప్పుడు అందులో లాభనష్టాల ప్రసక్తిలేదు. ఇది నా వృత్తికి సంబంధించిన విషయం. ఇంతకీ వాన్ వున్నది హాస్పిటల్ ముఖ్యమైన పనులకోసం. అంతే కానీ స్టాఫ్ గానీ, వాళ్ళ కుటుంబాలు కానీ, సినిమాలకీ, షికార్లకీ తిరగటానికి మాత్రం కాదు. గుర్తుంచుకో ఈ విషయం" అన్నాడు, స్థిరంగా.

చాలాసేపటిదాకా ఏ సమాధానమూ రాలేదు అరుణ వద్దనుండి. ఆ తర్వాత కొద్దినిమిషాలకి, నెమ్మదిగా వెక్కి వెక్కి ఏడవటం విన్పించింది. దీర్ఘంగా నిట్టూర్చి, అటు తిరిగి పడుకున్నాడు డాక్టర్ కుమార్.

* * *

డాక్టర్ కుమార్ ఆ రోజు సాయంత్రం ఇంటి కెళ్ళబోతూండగా బయట కారాగిన చప్పుడైంది.

"ఎవరా" అని కిటికీలోంచి తొంగిచూసేటంతలో శ్రీరాం లోపలి కొచ్చాడు. అతడిని చూడగానే సంభ్రమంగా కుర్చీలోంచి లేచి "హల్లో ! రా; రా; ఎన్నాళ్లకి దర్శనం" అంటూ భుజంమీద తట్టి, కూర్చోబెట్టాడు.

మారు పలక్కుండా కుర్చీలో కూర్చుండిపోయాడు శ్రీరాం. చల్లటి సాయంత్రంవేళ, ఎంతో ఆహ్లాదకరంగా వుంది ఎంచక్కా మీటింగ్ మానేసి, శ్రీరాంతో కబుర్లు చెప్పుకుంటూ సాయంత్రమంతా కులాసాగా గడిపేద్దా మనిపించింది, ఓ క్షణం డాక్టర్ కుమార్‌కి. వెంటనే బాయ్‌ని కేకేసి ఫ్లాస్క్‌లో హోటల్‌నుండి కాఫీ పట్టమన్నాడు.

"అహా ! వద్దు కుమార్ కాఫీ ... అదీ యిప్పుడు" అన్నాడు శ్రీరాం.

"అదేమిటి ! ఎందుకోయ్ కాఫీ వొద్దంటున్నావు ? ఇంకా గంట ఆరు కూడా కాలేదు" అన్నాడు.

"వూ హూ; నేనిప్పుడు కాఫీ తాగే మూడ్‌లో లేను" అన్నాడు ముక్తసరిగా.

ఆ మాట విన్నదే ఆశ్చర్యంగా అతడి మొహంలోకి

చూసి, "ఏం రామూ ! ఒంట్లో బాగా లేదా ? ఎందుకలా వున్నావు ? ఇంతకీ ఏం జరిగింది" అన్నాడు ఆదుర్దాగా.

చాలా సేపటివరకూ అతడినుండి ఎటువంటి సమాధానమూ రాలేదు. మనసులో చెలరేగుతూన్న సంఘర్షణకి ప్రతిరూపంగా అతడి చేతులు అవిరామంగా టేబిల్ మీదున్న పేపర్ వెయిట్‌ని అటూ, ఇటూ తిప్పసాగాయి.

ఇంకా అతడి మొహంలోకే దీక్షగా చూస్తూ సమాధానం కోసం ఎదురుచూడసాగాడు డాక్టర్ కుమార్.

నిదానంగా, బరువుగా ధ్వనిస్తూన్న కంఠంతో చెప్ప సాగాడు శ్రీరాం. "మొన్ననే వచ్చాను నేను కాంప్ నుండి, మూడు వారాల తర్వాత. వెళ్ళినప్పటికీ, తిరిగి వచ్చినప్పటికీ, యింటి వాతావరణంలో ఎంత తేడా ! లోపలి కడుగు పెట్టగానే ఏదో పాడుబడ్డ కోటలోని కడుగుపెడుతున్న భావం కలిగింది. కారణం యిల్లంతా నిశ్శబ్దంగా, కళాహీనంగా కన్పించింది. నేను ఊరినుండి రాగానే సంభ్రమంగా ఎదురువచ్చే అరవింద ఎక్కడా కనిపించలేదు. రెండు, మూడుసార్లు పిలిచినా జవాబు లేదు. నేనే వెతుక్కుంటూ వెళ్లేసరికి, తన గదిలో ఒంటరిగా, నిర్లిప్తంగా, విరాగిణిలాగా కూర్చుని, నా ఉనికినే గుర్తించని స్థితిలో వుంది అరవింద. తన నలా చూసిందే స్తంభించిపోయా న్నేను ! ఈ రెండురోజులూ శత విధాలా ప్రయత్నించాను తనని మామూలు స్థితికి తీసుకు రావాలని. కాని నా చేతకాలేదు కుమార్ ! నిద్రాహారాలు మానేసి అలా గంటల తరబడీ కూర్చుని, శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తూంటుంది. ఇక యిలాగే వదిలేశామంటే అరవింద మానసికంగా పూర్తిగా క్రుంగిపోయి "రెక్" అయ్యే ప్రమాదం వుంది. ఏం చెయ్యమన్నావు కుమార్ ? చెప్పు; నీ సలహాకోసమే వచ్చానిప్పుడు" అన్నాడు.

శ్రీరాం చెప్తున్నదంతా ఒక్క అక్షరం కూడా పోనివ్వకుండా శ్రద్ధగా, ఆత్రతగా వింటూన్న డాక్టర్ కుమార్ అతడు చెప్పటం ఆపెయ్యగానే, వెనక్కి వాలి, కుర్చీకి తల ఆన్చి కళ్ళుమూసుకుని కూర్చున్నాడు. నిమిషాలు దొర్ల సాగాయి. ఇద్దరిలో ఎవరూ పెదవి మెదపలేదు. అక్కడి వాతావరణం టెన్షన్‌తో నిండి, బిగుసుకుపోయినట్టుగా వుంది. ఆలోచిస్తున్న సమస్యకి పరిష్కారమార్గం కన్పించిందేమో క్రమంగా డాక్టర్ కుమార్ మొహంలో విచారం మాయమై, ప్రసన్నత ఆవరించింది. హఠాత్తుగా కళ్ళు తెరిచి ఏదో చెప్పబోతున్నంతలో కాఫీ పట్టుకుని బాయ్ వచ్చాడు.

రెండు కప్పుల్లోకి కాఫీ వంచి ఒకటి శ్రీరాం కిస్తూ "తీసుకో రామూ; నేనో నిశ్చయాని కొచ్చాను. తప్పకుండా అరవింద మామూలు మనిషవుతుంది. నువ్వేమీ దిగులు పెట్టుకోకు" అన్నాడు.

* * *

ఆ రోజు "డే ఆఫ్" దీపకి. తలంటి పోసుకుందేమో జుట్టునుండి శీకాయి, కచ్చూరాలు, వట్టివేళ్ల సన్నటి పరిమళం వస్తోంది. ఎండలో నుంచుని, జుట్టుని పాయలు పాయలుగా విడదీసి, వ్రేళ్లతో చిక్కు తీసుకోసాగింది. ఉదయపు ఎండైనా చురుక్కుమంటోంటే, యిహ అక్కడ ఎక్కువసేపు నుంచోలేక గదిలోకొచ్చి కూర్చుంది.

హఠాత్తుగా లీల వూడిపడింది.

"ఏంచేస్తున్నావు?పనేమీలేదు నా కీ పూట.ఏంతోచకపోతే అటూ, యిటూ తిరుగుతున్నా యిందాకట్నుంచీ. పలకరించి పోదామనొచ్చాను." అంటూదీప మంచంమీదకూర్చొని దిండుని ఒళ్ళోకి తీసుకుంది లీల. "చెయ్యటానికేముందీ? గదిలో అవీ యివీ సర్దుతున్నాను, అంతే" అంది దీప.

రెప్పలల్లార్చుతూ "దీపా ! నిన్నోవిషయం అడగాలనుకొంటున్నాను చాలారోజులనుండీ" అంది కుతూహలంగా.

"అదంత ముఖ్యమైన విషయమైతే-అడుగు" అంది దీప పొడిగా.

రహస్యం మాట్లాడుతున్నట్టు గొంతు తగ్గించి "నే నీ సంగతి ఎవరితోటీ చెప్పన్లే; భయపడకు ! ఎంతవరకొచ్చింది మీ వ్యవహారం?" అంది కుతూహలంగా.

"వ్యవహారం ఏమిటి ? దేన్ని గురించి అంటున్నావు లీలా?" అసహనంగా వుంది దీప గొంతు.

"ఓ యబ్బో! ఆ రోజు నేను చూడలేదనుకున్నావా? ఎంత రసవత్తర సన్నివేశం ! నువ్వు క్రిందకి వాలివుంటే డాక్టర్ జయరాం కుడిచెయ్యి నీ నడుంచుట్టూవేసి పడిపోకుండా నిన్నాపటం...అచ్చం ఆర్. కె. ఫిల్మ్స బానర్‌లాగా వుందా పోజు ! నా అదృష్టంకొద్దీ యిలాంటివి నా కళ్ళబడుతూంటాయి ఎప్పుడూ ; లేకుంటే అందరిలాగా నేనూ ఆ సీను మిస్సయివుండేదాన్ని. ఆ; సరే! ఇంతకీ ఏమంటున్నాడు మీ హీరో? వచ్చీ రాగానే పట్టేశాడే నిన్ను? అవున్లే. నన్నే వదల్లేదు మొదట్లో...ఇంత అందాలరాశిని ఆ గోపాలకృష్ణుడు..."

"స్టాపిట్ లీలా !" గది దద్దరిల్లేలా అరిచింది దీప !

అంతవరకూ కుతూహలంగా, ఆసక్తిగా దీపవంకే చూస్తూన్న లీల ఈ అరుపు విన్నదే షాక్ తిన్నట్టయి, గబుక్కున లేచి నుంచుంది. నెమ్మదిగా, శాంతంగా కన్పించే

దీప క్షణంలో యింత రౌద్రాకారం దాల్చగలదని ఏనాడూ వూహించలేదు లీల.

కోపంతో, ఆవేశంతో, దీప మొహం ఎర్రగా కంది పోయింది. దూరంగా నుంచుని వున్నదల్లా ఒక్కో అడుగే భారంగా, నిదానంగా వేస్తూ లీలకి ఎదురుగుండా వచ్చి నుంచొని, "లీలా! ఇలాటి అసభ్యపుమాటలు నా ఎదుట యిక ఎప్పుడూ మాట్లాడకు, తెలిసిందా ? నే నిక్కడికొచ్చింది వొళ్ళువంచి పనిచెయ్యటానికి మాత్రమే. గోరంతలు కొండంతలు చేసి మాట్లాడేవాళ్ళంటే నాకు గౌరవం లేదు. అసహ్యంకూడాను ! ఏంచూశావు నువ్వు ? ఎన్నెన్ని ఊహించావు?? ఛీ, ఛీ," అంది జుగుప్సగా.

ఇలాటి సమాధానానికి సిద్ధంగా లేదు లీల. అందుకే దెబ్బ తిన్న పులిలాగా రోషంతో రెచ్చిపోయి, "అవున్లే ! రహస్యంగా జరగాలనుకొన్నది నలుగురికంటా పడిందనేగా నీ బాధ ? నే నొక్కదాన్నే కాదు, డాక్టర్ కుమార్ కూడా అప్పుడక్కడే వున్నారు. అయినా చూశారు మీ యిద్దర్నీ ! సరే వస్తా" అంటూ విసవిసా నడిచి వెళ్ళిపోయింది.

ఈ ఆఖరు వాక్యం విన్నదే దీప నవనాడులు ఒక్కసారిగా క్రుంగిపోయాయి ! ఊపిరి పీల్చటానిక్కూడా శక్తిలేనట్టు మంచంమీద కూలబడిపోయింది. 'నిజమేనా లీల చెప్పిన సంగతి ? ఎంత అసహ్యించుకొని వుంటారో డాక్టర్ కుమార్ నన్ను ? నా నిర్దోషత్వం నిరూపించుకోటానికైనా మార్గమేదీ ? ఇక ఆయన నా మొహంలోనికి క్కూడా తలెత్తిచూడడు. ఏమిటి దారి భగవంతుడా' అనుకొంటూ చాలా సేపలాగే కూర్చుండిపోయింది.ఆమె ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి. ఉదయంనుండీ ఆమె నావరించివున్న ఉత్సాహం ఒక్కసారిగా మటుమాయ మయింది. గుండెల మీద టన్నులకొద్దీ బరువు ఆమెకి తెలీకుండానే ఎప్పుడో వచ్చి కూర్చొంది.

*  *  *

రాత్రి డ్యూటీకిగాను ఆస్పత్రి మెట్లెక్కి వస్తోంది దీప ఆ సాయంత్రం. "సిస్టర్"—వెనకనుండి విన్పించిందో స్వరం.

తల తిప్పిచూసింది దీప ; డాక్టర్ కుమార్ !

అడుగుతీసి అడుగువెయ్యబోతున్నదల్లా మంత్రించినట్టే ఆగిపోయి హీనస్వరంతో "యస్ డాక్టర్" అంది.

"మీతో ఒక విషయం మాట్లాడాలి. అయిదునిమిషాలు నా గదిలో కూర్చోండి. ఇప్పుడే వస్తాను" అని వెళ్ళిపోయాడు.

ఒక్కక్షణం దీప గుండె కొట్టుకోవటం మానేసింది. ఆ తర్వాత మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి గదిలోకూర్చుంది.

డాక్టర్ చెప్పిన అయిదునిమిషాలెప్పుడో గడిచిపోయాయి అతనింకా రాలేదు. మాటిమాటికీ గుమ్మంవైపు చూస్తూ చెమటతో తడిసిపోతున్న అరిచేతుల్ని కర్చీఫ్‌తో ఒత్తుకో సాగింది దీప.

స్వింగ్‌డోర్‌ని తెరుచుకుని "సారీ, ఆలస్యం అయింది" అంటూ లోపలికొచ్చి తన కుర్చీలో, దీప కెదురుగా కూర్చున్నాడు డాక్టర్ కుమార్.

ఎటో చూస్తూ చెప్పసాగాడు కుమార్. "సిస్టర్ ! నేను మీతో చెప్పాలన్నది అరవింద గూర్చి. ఆ ఆపరేషన్ అయ్యాక ఆమె మానసికంగా చాలా కృంగిపోయింది. మందులు, యింజెక్షన్లు తీసుకోటం మానేసి చాలారోజులైంది ఈ మధ్య నిద్రాహారాలుకూడా లేకుండా, గంటలతరబడీ తనగదిలో ఒంటరిగా కూర్చొని ఏదో ఆలోచిస్తూంటుందట. ఆమె నిలాగే వదిలేస్తే యిక ఉన్మాదిని కాపటాని కింకెంతో కాలం పట్టదు, మీకు వీలైతే ఒక సహాయంచేసి పెట్టాలి మాకు—శ్రీరాం, నేనూ మీకు ఎప్పటికీ కృతజ్ఞులుగా వుంటాం" అన్నాడు.

"చెప్పండి డాక్టర్" అంది.

"అరవిందకి మీరంటే ఎందుకో ఒక విధమైన అభిమానం. ఇక్కడికి వచ్చినప్పుడల్లా మీ గురించి అడిగి, మిమ్మల్ని పలకరించిగానీ వెళ్ళేదికాదు కదా! ఆమెకి మీ మీద గల అభిమానాన్ని పురస్కరించుకుని యిప్పుడు మీ రామెని మామూలు మనిషయ్యేలా చెయ్యాలి. ఆ చనువుతోటే ఆమెని మాటల్లోకి దించాలి.తనమీద తనకి శ్రద్ధ కలిగేలా చెయ్యాలి. జీవితంమీద ఆశ చిగురింపజెయ్యాలి. కానీ...సిస్టర్ ! మీ ఈ ప్రయత్నంలో నేను కల్పించుకోకపోవటమే మంచిదని తోస్తుంది నాకు. అందుకే దూరంగా వుండదల్చుకొన్నాను. మీరొక్కరే పోరాడాలి. ఇది నా అభ్యర్థన మాత్రమే. ఎందుకంటే వాళ్ళు నాకు బంధువులూ, పేషెంట్లే కాదు, అత్యంత ఆప్తులు కూడాను" అన్నాడు.

దీప ఆలోచనలో పడింది.

"మీరు బాగా ఆలోచించుకొనే చెప్పండి సిస్టర్ ! ఫర్వాలేదు" అన్నాడు డాక్టర్ కుమార్.

"ఇక ఆలోచించుకొంటూ కూర్చోవటానికి బొత్తిగా వ్యవధిలేదు డాక్టర్ ! పైగా యిదంత పెద్ద సమస్యకూడా కాదు.ఆమెని మళ్ళీ మామూలుమనిషిగా చేసి మీ కప్పగించే బాధ్యతని సంతోషంగా స్వీకరిస్తున్నాను," అంది స్థిరంగా.

"థాంక్యూ వెరిమచ్ సిస్టర్! కానీ యిది మీకు చాలా

శ్రమతోకూడిన పనవుతుందేమో! ఎందుకంటే మీరు డ్యూటీ అవర్స్‌లో వెళ్ళటానికి వీల్లేదు. 'ఆఫ్' వున్న సమయాల్లోనే అక్కడికి వెళ్ళిరావాల్సుంటుంది. అంటే మీరు కొంతకాలంపాటు విశ్రాంతన్నది లేకుండా పనిచెయ్యాలన్న మాట..."

"ఫర్వాలేదు డాక్టర్."

"మీకెప్పుడైనా, ఏదైనా యిబ్బంది ఎదురవుతే, నాతో నిస్సంకోచంగా చెప్పొచ్చు మీరు. మొహమాట పడకండి."

"అలాగే డాక్టర్" అంది.

"గుడ్‌నైట్."

"గుడ్‌నైట్ డాక్టర్," అని డోర్ తీసుకుని వెళ్ళిపోయిందామె.

* * *

లాంజ్ చేర్లో వెనక్కివాలి కూర్చొని, ఎదుటవున్న కిటికీలోనుండి బైటికి నిర్నిమేషంగా చూస్తోంది అరవింద. గుమ్మంలో నుంచున్న దీపకి ఆమె మొహం ఓ ప్రక్కనుండి మాత్రం కన్పిస్తోంది. తైల సంస్కారంలేని ఆమె జుట్టు; చిందరవందరగా చెదిరి మొహంమీదకి పడుతున్నా ఆ చికాకుని గుర్తించే స్థితిలో లేదామె. మొహం పాలిపోయి కళావిహీనంగా వుంది. నెమ్మదిగా దగ్గరికొచ్చి అరవింద భుజం మీద చెయ్యేసి, "ఏమండీ; నేను దీపని" అంది మృదువుగా.

కొద్ది క్షణాలకి తలత్రిప్పి "ఎవరూ" అంది నీరసంగా, అరవింద. "నేనేనండీ; మీ స్నేహితురాల్ని—దీపని! గుర్తుపట్టలేదా? మర్చిపోయారా అప్పుడే నన్ను" అంది నొచ్చుకుంటూన్నట్టు స్వరం మార్చి.

కనీసం తలకూడా తిప్పి చూడకుండా హీనస్వరంతో "దీపవా? రా! యిలా వచ్చి కూర్చో" అంది అరవింద.

అరవింద పరిస్థితిగూర్చి డాక్టర్ కుమార్ నాలుగు మాటల్లో చెప్తే ఏదో అనుకొంది కానీ, యింత స్వల్ప వ్యవధిలో విషాదం అన్నది మనిషినింత కృంగదీస్తుందనీ, దాని ముద్ర యింత బలంగా వుంటుందనీ వూహించలేదు దీప. అందుకే ఆమెని చూస్తున్నకొద్దీ హృదయం తరుక్కుపోసాగింది. పైకిమాత్రం ఏ భావమూ కన్పించనివ్వకుండా గొంతునిండుగా వుత్సాహం నింపుకుని, "రండి, మీకు జడవేస్తాను" అంది.

"వొద్దు...నన్నిలాగే వదిలెయ్.నాకేం అక్కర్లేదు" చిన్నపిల్లలాగా మారాంచేస్తూ అంది.

అరవింద గడ్డంపట్టుకుని"మీరు చాలా మంచివారుకదూ. పైగా నేనంటే మీకెంతో యిష్టం కూడాను. అందుకే నా మాట కాదనకండి" అని చిన్నగా నవ్వి, లేచి లోపలికి వెళ్ళి దువ్వెన, నూనెసీసా పట్టుకొస్తూ వంటమనిషితో చెప్పింది, ఒక గ్లాసు పాలూ, ఒక కప్పు కాఫీ పట్రమ్మని.

నెమ్మదిగా నూనె రాసి, జుట్టంతా పాయలుగా విడదీసి, వ్రేళ్ళతో సున్నితంగా చిక్కుతీసి, జడవెయ్యసాగింది దీప. ఇదంతా తనకి కాదన్నట్టుగా, ఎటో చూస్తూ కూర్చుంది అరవింద. అంతలో పనిమనిషి ట్రేలో పాలూ, కాఫీ పట్టుకు రాగా దీప అందిపుచ్చుకుని అరవింద నోటిదగ్గరగా పాల గ్లాసు పట్టుకుని "ప్లీజ్! తాగరూ" అంది గారంగా.

ఆ లాలననీ, ఆ గొంతులోని మార్దవాన్నీ కాదనలేక గటగటా త్రాగేసింది పాలు అరవింద. "గుడ్! అలా వుండాలి" అని, "అరవిందగారూ! నాకు డ్యూటీకి టైమవుతోంది. ఇక వెళ్ళాలి నేను. ఈసారి వచ్చినప్పుడు యింకా చాలాసేపు కూర్చుంటాను మీ దగ్గర. ఏం?" అని భుజంమీద ఆప్యాయంగా తట్టి వెళ్ళిపోయింది దీప.

* * *

ఉదయం నీరెండ వెచ్చవెచ్చగా వుంది.

హఠాత్తుగా వెనుకనుండి వచ్చి భుజంమీద చేతులేసి "అరవిందా! ఈ రోజు నేనెందుకొచ్చానో చెప్పుకోండి చూద్దాం!"అంది నవ్వుతో కవ్వింపుగా దీప.

నిస్తేజంగా ఓ నిమిషంపాటు చూసి, "ఆ! ఎందుకూ?" అంది.

"ఎందుకేమిటండీ బాబూ! మీరు పూర్తిగా మర్చిపోయినట్టున్నారు. ఇవ్వాళ మీ పుట్టినరోజండీ! మిమ్మల్ని విష్ చేసిపోదామని అంతదూరంనుండి పనిగట్టుకుని వస్తే మీరేమో నాతో సరిగ్గానన్నా మాట్లాడకుండా అలా కూర్చుండిపోయారు" అంది, తెచ్చిపెట్టుకున్న అలకతో.

"ఎవరి పుట్టినరోజు నాదా...?" అంది అరవింద.

"ఆ! అవునండీ మీదే! విష్ యూ మెనీ మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ద డే!" అని అరవింద గడ్డం మునివ్రేళ్లతో పట్టుకుని, ఆమె చెంపమీద అతి సున్నితంగా ముద్దు పెట్టుకుంది.

ఆ పెదిమల స్పర్శకి ఎక్కడో చలనం కలిగింది అరవిందలో. దీపని అలాగే రెప్పవాల్చకుండా చూస్తున్న ఆమె మొహంలో ఎక్కడినుండో ఓ పల్చటి నవ్వు వచ్చి ఒక్కక్షణంసేపు మెరిసింది.

నీళ్లలో మునిగిపొయ్యేవాడు గడ్డిపరకని కూడా గట్టిగా పట్టుకొన్నట్టు దీపకి ఆ కాస్త చిరునవ్వు చూడగానే ఎంతో భరోసా, ఉత్సాహమూ కలిగాయి. తన కుర్చీని ఆమెకి దగ్గరగా లాక్కుని నుదుటిమీద పడ్డ జుత్తుని ఆప్యాయంగా సవ

రిస్తూ "అరవిందా! ఇంతకీ పుట్టినరోజు బహుమతి ఏం తెచ్చానో అడగలేదేం?" అంది లాలనగా.

"నాకు బహుమతా? ఎందుకూ" అంది.

"ఆ! మీకే! ఇటు చూడండి" అంటూ మెరిసే కాగితంతో చుట్టి నీలంరంగు రిబ్బన్‌తో పెద్ద ముడివేయబడివున్న ఒక పెట్టె తీసి అరవింద చేతుల్లో వుంచింది.

ఏ చలనమూ లేకుండా చేతిలో పెట్టెని అలాగే చూస్తూ కూర్చుండిపోయింది అరవింద.

"విప్పి చూడండి! మీ కిష్టమైన వస్తువే పట్టుకొచ్చాను" అంది దీప, వూరిస్తూ.

నెమ్మదిగా, అతి మెల్లగా వూడదీయసాగింది రిబ్బన్నీ, పైన చుట్టివున్న కాగితాలనీ. ఆవిడ చిన్నపిల్లలాగా ఒక్కోటి విప్పి క్రింద పడేస్తూంటే దీప వాటినన్నిటినీ ఏరి, ప్రక్కనే వున్న టీపాయ్ మీద సర్దసాగింది. కానీ కళ్ళుమాత్రం ఆ ప్రెజెంట్‌ని చూశాక అరవింద హావభావాలెలా వుంటాయోనని ఆమెనే గమనిస్తున్నాయి. చివరికి పెట్టె విప్పింది అరవింద. అందులో ఖరీదైన పెయింటింగ్ బాక్స్, బ్రష్‌లూ వున్నాయి!

"నాకెందుకీ పెయింటింగ్ బాక్స్? ఏం చేసుకోను?" అంది అరవింద.

"చూశారా! మళ్ళీ నాకెందుకూ అంటున్నారు; నేనంటే మీకెంతో యిష్టం కదా; నా చిత్రం ఒకటి మీ చేత గీయించుకోవాలన్న ఆశతో పట్టుకొచ్చాను. ఏమండీ! గీస్తారు కదూ నా పోర్ట్రెయిట్!" అంది బ్రతిమాలుతూన్న ధోరణిలో.

"నే నిప్పుడు పెయింట్ చెయ్యటమా? ప్చ్! ఆ రోజులు గడిచిపోయాయి. ఇక యిప్పుడు గీసే ఓపికా, కోరికా, రెండూ లేవు. వెళ్ళి యింకెవరినైనా అడుగు దీపా" అంది అరవింద నీరసంగా.

వొదిలిపెట్ట దల్చుకోలేదు దీప. "వేరేచోట ఎక్కడ చేయించుకోగలనండీ బాబూ? ఈ జన్మలో నాకొచ్చే జీతమంతా ధారపోసినా ఆ మొత్తానికి గీసిపెట్టటానికెవరూ ఒప్పుకోరు. మరి మీరవుతే 'ఫ్రీ' గా గీసిపెడతారని ఆశతో యింత దూరం వచ్చాను" అంది.

"ఊహూ దీపా; నా చేతకాదు. క్షమించు నన్ను, నిన్ను నిరాశపరుస్తున్నందుకు."

"అయితే నిరాశతో నన్ను వెనక్కి వెళ్ళిపొమ్మంటారా? అలాగే వెళ్ళిపోతానులెండి. మళ్ళీ మీరెప్పుడైనా పిలిస్తే కూడా రాను. ఆనక మీరే విచారిస్తారు. ఎందుకు వేసివ్వక పోయానా ఆ చిత్రం అని. కానీ... అప్పుడు అంత ఆలస్యంగా మీరు మనసు మార్చుకునీ ప్రయోజనం వుండదు. అంతే!" అంది బుంగమూతిపెట్టి స్వరంలో వీలైనంత దైన్యం, నిరాశ ధ్వనింపజేస్తూ దీప.

నెమ్మదిగా కళ్లెత్తి దీప మొహంలోకి చూసింది అరవింద. ఆమె మొహంలో, కళ్లలో, ఏదో భావం కదులాడసాగింది. తర్వాత ఓ అయిదు నిమిషాలు పోయాక "సరే! వేస్తాన్లే; బాధపడకు. అయితే యిప్పట్లోమాత్రం కాదు. ఇంకా ఆరు నెలలో... ఏడాదో పోయాక. మొత్తానికి నీ పోర్ట్రెయిట్ అంటూ ఏదో ఒకటి," అంది దీప చేతిమీద తన చెయ్యివేసి ఓదారుస్తున్నట్టుగా.

చటుక్కున ముందుకి వంగి "నిజంగానే వేసిస్తారా! ప్రామిస్" అంది దీప చెయ్యి చాస్తూ.

"వూ" అంది అరవింద.

"సరే! మీకన్నీ సిద్ధంచేసి వెళ్తాను. మీ ఈ సెల్ ఎక్కడుందో చెప్పండి. శుభ్రంచేసి మీ గదిలో తెచ్చిపెట్టమని చెప్తాను మీ పనిమనిషితో. నాకు వీలయినప్పుడల్లా వస్తుంటాను సిట్టింగ్స్‌కి. కొద్ది కొద్దిగా మొదలుపెడుదురు గాని" అంది వుత్సాహంగా దీప.

బస్సెక్కి ఇంటికి వచ్చింది దీప. తండ్రినుండి వచ్చిన ఉత్తరం కన్పించింది. తీసి చదవసాగింది దీప.

"ప్రియమైన కుమార్తె దీపకి నాన్న దీవించి వ్రాయునది,

ముఖ్యంగా వ్రాయటం ఏమంటే నీకో సంబంధం వచ్చింది. నీ ఫోటో చూసి అబ్బాయి తలిదండ్రులు ఒప్పుకొన్నారు. అబ్బాయికి కట్నం అక్కర్లేదుట. పెళ్ళి మాత్రం జరిపిస్తే చాలన్నారు. అబ్బాయి బి.యే. పాసై బాంక్‌లో వుద్యోగం చేస్తున్నాడు. చాలా మంచి ఫుట్‌బాల్ ఆటగాడవటంచేత అతడికి పాసైందే వుద్యోగం యిచ్చారు బాంకివాళ్ళు.

డబ్బు కిబ్బందవుతుందేమోనని సంకోచించవద్దు. ప్రతి నెలా నువ్వు పంపుతూన్న డబ్బు కానీ ఖర్చుపెట్టకుండా మీ అమ్మ దాస్తోంది. ఏడాదికి పైగానే అవుతోంది నువ్వు వుద్యోగంలో చేరి. ప్రస్తుతానికి బాంక్‌లో మూడువేల దాకా వుంది సొమ్ము. కాబట్టి నువ్వు ఎటువంటి బెంగా పెట్టుకోక, వెంటనే సెలవుపెట్టి వస్తే, వాళ్ళు వచ్చి నిన్నోసారి చూసుకొంటారు. ఆ తర్వాత వేసవిలో లగ్నాలు పెట్టుకోవచ్చు. ఎప్పుడు వచ్చేదీ వ్రాయి.

ప్రేమతో,
నాన్న"

వెంటనే తండ్రికి ఉత్తరం వ్రాసింది దీప.

"ప్రియమైన నాన్నకి,

నీ ఉత్తరం యివాళే అందింది. నేను క్షేమంగానే వున్నాను. మీరందరూ క్షేమమని సంతోషం. ఈ జీవన

వీధానం, నే నెన్నుకొన్నదే కాబట్టి యిప్పుడు నాకెంతో తృప్తిగా, జీవితంలో ఎన్నడూ లేనంత సంతోషంగా వుంనాన్నా ! ఈ సంతృప్తినీ, ఆనందాన్నీ యిక దేనికోసమూ వదులుకోబుద్ధి కావటం లేదు.

సంబంధం గూర్చి వ్రాశావు. బాగానే వుంది. కానీ ఈ పరిస్థితుల్లో నువ్వింకా ఆలోచించాల్సిన 'విషయం ఒకటుంది నాన్నా ! నాకేం ? వుద్యోగంవుంది. పచ్చటి భవిష్యత్తువుంది. స్కూల్ ఫైనల్‌తో చదువు మానేసి యింట్లో వున్న చెల్లికివేం లేవుగా ? అందుకే వాళ్ళు సమ్మతిస్తే యశోదకే స్థిరం చెయ్యండి సంబంధాన్ని. ఆ డబ్బు నాదొక్కదానిదీ కాదు. అవసరమొస్తే ఖర్చుపెట్టుకోటానికి అందరికీ దానిమీద హక్కుంది.

ఈ పనికి అమ్మ ఒప్పుకోదని తెలుసు. అయినా మీరందరూ అమ్మని ఒప్పించి ఈ సంబంధం చెల్లికే నిశ్చయం చెయ్యాలి. ఇప్పుడే కాకున్నా యింకో రెండేళ్ళు పోయాక తమ్ముడుకూడా జీవితంలో స్థిరపడ్డాక, తప్పకుండా చేసుకొంటాను పెళ్ళి. ఇలా వ్రాస్తున్నందుకు నువ్వు మనసేమీ కష్టపెట్టుకోకు. నీ ఆశీస్సులే నన్నింతదాన్నిగా చేశాయి. అవే నా జీవితపథానిక్కూడా వెలుగునిస్తాయి. ఆ విశ్వాసం నాకుంది.

పెళ్ళి ముహూర్తం ఎప్పుడో నిశ్చయించాక రాస్తే వెంటనే సెలవుపెట్టి వస్తాను. అందరినీ అడిగానని చెప్పు.

ప్రేమతో దీప.

* * *

అరవిందని చూసిరావటానికని బయలుదేరింది దీప. లేత గులాబిరంగు షిఫాన్ చీర కట్టుకుని జడలో సంపెంగ పూలు, మైసూరు మల్లెలు కలిపి కట్టిన "గజ్‌రా" పెట్టుకొంది జడలో. అప్పుడప్పుడే విచ్చుకొంటున్న మల్లెలు, సంపెంగల్తో పోటీపడి, మరీ పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. దీపకూడా ఆ పూలంత స్వచ్ఛంగా సుకుమారంగా అప్పుడే విచ్చుకున్న గులాబీ అంత అందంగా వుంది, అప్పట్లో బస్ వచ్చే సూచనలేవీ కన్పించకపోవటంతో. తల వంచుకుని ఏదో ఆలోచిస్తూ నిదానంగా నడవసాగింది. అంతలో ఎక్కడినుండో వచ్చి ఓ కారు ఆమె ప్రక్కగా ఆగింది. అయినా దీప చూడలేదా కారుని.

డ్రైవ్ చేస్తూన్న జయరాం తలని కొద్దిగా బయటికి పెట్టి, "ఎక్కడికో బయలుదేరినట్టున్నావే ? షైరుకా ?" అన్నాడు నవ్వుతూ.

"అబ్బే! షికారుకేం కాదు. ఓ ఫ్రెండ్ యింటికి," అంది మామూలుగా.

"అలాగా ! అవుతే కారెక్కు. దారెటో చెప్తే ఆ ఫ్రెండింట్లో దింపుతాను నిన్ను" అన్నాడు.

"అహహా ! ఫర్వాలేదు. మీ కనవసరంగా శ్రమ దేనికి ? బస్‌లోనే వెళ్తాను" అంది.

"శ్రమా ? భలేదానివే ! నీలాటి ఆడపిల్లల్ని కార్లో త్రిప్పటం శ్రమ అనుకొనేవాడు నిజంగా ఫూల్ ! రా; ఎక్కు ! ఇటీజ్ ఎ ప్లెషర్ ఫర్ మీ" అంటూ ఎడమచేతిని చాచి ఫ్రంట్ డోర్ తెరిచాడు.

అతడి చూపులు, వాలకం మొదటినుండీ నచ్చలేదు దీపకి. ఇప్పుడిలా కారెక్కమని బలవంతపెడ్తూంటే మరింత అసహ్యం వేసింది. కానీ మామూలుగా "చాలా థాంక్స్ డాక్టర్ ! అయినా యివాళ వెళ్ళి తీరాలని లేదు నాకు. ఒంట్లో అంత బాగా లేదు. బస్ వస్తే వెళ్తాను, లేకుంటే గదికి వెళ్ళి హాయిగా రెస్ట్ తీసుకొంటాను. మీరు వెళ్ళిరండి" అంది.

తనాహ్వానించిందే కార్లోకి ఎగిరి కూరుంటుందన్న ఆశతో వున్న జయరాం కి మాటలు వినగానే మొహం మాడిపోయింది. అంతలో ఏ దేవుడో కరుణించినట్టుగా బస్ ఆగటం, దీప అందులోకి చప్పున ఎక్కెయ్యటం చకచకా జరిగిపోయాయి. దుమ్ము రేపుకుంటూ వెళ్తూన్న బస్‌వైపు జేవురించిన మొహంతో ఓ క్షణంసేపు చూసి, దభీమని డోర్‌ని క్లోజ్‌చేసి, కారు స్టార్ట్‌చేశాడు జయరాం.

* * *

"ఇవిగో పెయింటింగ్‌కి సంబంధించిన పుస్తకాలు. వీటిల్లో మీలాటివాళ్ళకి సలహాలూ, చిట్కాలూ వుంటాయి. ఒక్కసారి మీరు శ్రమనుకోకుండా యివన్నీ చదవండి. ఎంతో సహాయకారిగా వుంటాయి. పైగా నా పోర్ట్రెయిట్ కూడా అద్భుతంగా రావచ్చు ! ఏమంటారు... ?" అంటూ కొంటెగా నవ్వింది దీప, పుస్తకాలు అరవింద చేతుల్లో పెడుతూ.

తిరిగి నవ్వలేదు అరవింద. తదేకంగా దీపనే చూస్తూ "నా పెయింటింగ్ మీద అంతలేసి ఆశలు పెట్టుకోకు, దీపా; అందం మాట దేవుడెరుగు; అసలు నీ రూపం వున్నదున్నట్టు సరిగా వస్తే అంతే చాలు," అంటూ పుస్తకాలు పట్టుకుని లోపలికెళ్ళి ఓ అయిదునిమిషాల్లో తిరిగొచ్చి దీప చేతిలో ఏదో వుంచింది.

చెయ్యి విప్పిచూస్తే అది వందరూపాయల నోటు ! ఆశ్చర్యపోతూ "ఎందుకీ డబ్బు" అంది దీప.

"ఎందుకేమిటి? ఈ పుస్తకాలన్నీ వూరికే వచ్చాయా నీకు? పైగా అవన్నీ ఖరీదైనవి. చూస్తూంటే తెలియటం

లేదూ? వుంచు" అంది. "భలేవారే! ఏదో నా చిత్రం బాగుండాలన్న ఆశకొద్దీ పట్టుకొచ్చానవి; అంతే! దానికి మీరు డబ్బివ్వటం దేనికి? పైగా యింత కష్టపడి పూరికే చిత్రం గీసిపెడుతున్నందుకు నేనే మీకు ఋణపడి వుంటాను. తీసుకోండి" అంది.

"ఉహూ! నువ్వు గనుక ఈ డబ్బు తీసుకోకపోతే నేనూ ఈ పుస్తకాలు తీసుకోను. అంతే" అంది అరవింద.

ఓ నిమిషం ఆలోచించి "సరే! అలాగే కానివ్వండి. కానీ యివన్నీ మీరు నిదానంగా, శ్రద్ధగా చదవాలి. అలాగే వొదిలెయ్యకూడదు. లేనట్టయితే నేనూ ఈ డబ్బు తీసుకోను" అంది.

*　　*　　*

ఇన్ని నెలలుగా ఆస్పత్రికి జనం తిరునాళ్ళకి వచ్చినట్టుగా, గుంపులుగుంపులుగా, చుట్టుప్రక్కల పల్లెలనుండి బళ్లు కట్టుకుని వచ్చేవారు. డాక్టర్లకీ, నర్సులకీ ఊపిరి పీల్చటానికికూడా తీరిక వుండేదికాదు. "కీ" యిచ్చిన మర బొమ్మల్లాగా తిరుగుతూ పనులు చేసుకుపోతూండేవారు. పేషెంట్లవద్దనుండి పరిమితంగానే ఫీజు పుచ్చుకున్నా ఆదాయంకూడా బాగానే వుండేది. కానీ యిటీవల హఠాత్తుగా ఆదాయం తగ్గింది. జనం సగానికి సగం కూడా రావటం లేదు. కాన్పు కేసులు మినహాయిస్తే మిగతా పేషెంట్ల సంఖ్య బాగా పడిపోయింది. ఈ విషయం గ్రహించినప్పటి నుండీ డాక్టర్ కుమార్ ఆరాటాని కంతులేక ఎంత ఆలోచించినా దానికి గల కారణాలు అతడికి అంతు బట్టలేదు. చివరికిది కమిటీలోనే తేల్చుకోవాలని నిశ్చయించుకొన్నాడు.

ఆ ఆస్పత్రిలో ప్రతి మూడేసి నెలలకీ కమిటీ మీటింగ్ వుంటుంది. అందులో డాక్టర్లూ, నర్సింగ్ సూపరింటెండెంటూ, స్టోర్‌కీపరూ, ఒక నర్సూ వుంటారు. ఈ కమిటీకి అధ్యక్షత మెడికల్ సూపరింటెండెంటే వహిస్తారు. ఎవరే సలహా యిచ్చినా అది నలుగురికీ, మరి ముఖ్యంగా హాస్పిటల్‌కీ వుపయోగకరమైందనీ కమిటీ భావిస్తే దాన్ని వెంటనే అమల్లో పెడ్తారు. ఆ రోజు కమిటీ మీటింగ్ మొదలైంది. అధ్యక్షత వహించిన డాక్టర్ కుమార్ క్రితం మీటింగ్ గూర్చిన రిపోర్ట్ చదివాక, అందర్నీ వుద్దేశించి యిలా అన్నాడు గంభీర స్వరంతో-

"మై డియర్ ఫ్రెండ్స్! ఈ రోజు ఒక ముఖ్యమైన్న విషయాన్ని చర్చించటంకోసం ఈ కమిటీని సమావేశపర్చటం జరిగింది. మీరందరూ గుర్తించారో లేదో ఈ మధ్య మన హాస్పిటల్‌కి వస్తూన్న పేషెంట్ల సంఖ్య బాగా తగ్గిపోయింది. ఈ కారణంచేతే మన ఆదాయంకూడా సగానికి సగం పడీపోయింది. డబ్బును గూర్చిన విచారం నాకు లేదు. కానీ దానికన్నా విలువైన ఈ హాస్పిటల్ పేరు, ప్రతిష్ఠలు దిగజారిపోవటం నేను సహించలేను. ఇంతకీ దీనిక్కారణం ఏమిటో మనం తెలుసుకోవాలి. మన తప్పులేవైనా వున్నట్టయితే సరిదిద్దుకోవాలి. శ్రమపడి పనిచెయ్యటమే మన అందరి ధ్యేయంగా వుండాలి...ఆ! ఇంతకీ మీలో ఎవరైనా ఏమైనా చెప్పదలిస్తే నిస్సంకోచంగాచెప్పవచ్చు..."ఆగాడు డాక్టర్ కుమార్ కొద్ది నిమిషాలసేపు.

అక్కడున్నవారిలో చాలామంది ఏమీ చెప్పలేక అందుకు కారణమూ తెలీక ఒకరి మొహాలొకరు చూసుకో సాగారు. ఇలాగే ఓ అయిదు నిమిషాలు దొర్లిపోయాయి. ఎవరూ తనని చూడటం లేదనుకొన్న జయరాం మాత్రం డాక్టర్ ప్రభాకర్‌వైపు చూసి కన్ను గీటాడు! ఇది ఎవరి దృష్టి నాకర్షించకపోయినా దీప దృష్టినిమాత్రం దాటిపోలేదు! ఓ క్షణంసేపు దీపకి వీళ్ళిద్దరి సంగతేమిటో అర్థంకాలేదు. ఇదేదైనా గూడుపుఠాణీ కాదు కదా? రహస్యం లేకపోతే ఆ సైగలేమిటి యింతమంది వుండగా? వీళ్ళమీద ఒక కన్ను వేసే వుంచాలి; ఎందుకైనా మంచిది అనుకొంటూ ఆ యిద్దర్నీ మార్చి, మార్చి చూడ సాగింది.

జయరాం కనుసైగ నందుకున్న డాక్టర్ ప్రభాకర్ లేచి నుంచున్నాడు ఏదో చెప్పటానికన్నట్టు. అతడినే ప్రశ్నార్థకంగా చూస్తూ డాక్టర్ కుమార్ "యస్" అన్నాడు. ఆ స్వరంలోని తీవ్రతకి ప్రభాకర్ మొదట కాస్త చలించినా, ఆ తర్వాత సర్దుకుని, చెప్పసాగాడు :

"చేర్‌మెన్, అండ్ మై ఫ్రెండ్స్! ఇప్పుడు మనం విన్న సంగతి గూర్చి ఎవరూ ఆశ్చర్యపోనక్కర్లేదు. కొత్తలో ఈ సంస్థకెంత పేరొచ్చిందో, ఇప్పుడంతగా దిగజారిపోతున్నాయి పేరు ప్రతిష్ఠలు. ఈ విషయం గూర్చి నా మనసెంతో బాధపడుతూంది. ఇలా అందరూ చెడుగా అనుకోవటం కూడా సహించలేకపోతున్నాను. కానీ నాలాటి జూనియర్ డాక్టర్ చేసేదేమీ లేదని నాకు బాగా తెలుసు. అందుకే ఓర్చుకోవటమే తాత్కాలికంగా ఉత్తమమని భావించి యింత వరకూ వూరుకున్నాను. ఇప్పుడు సమయం, సందర్భం వచ్చాయి గనుక చెప్తున్నాను. దీనికంతా ముఖ్యకారణాలు, యిక్కడ పనిచేస్తున్న వాళ్లలో డ్యూటీ పట్లగల నిర్లక్ష్య వైఖరి, రోగులపట్ల అసహనం, దౌర్జన్యం..." ఈ మాటలంటూ దీపవైపొక విషపు నవ్వు విసరి మళ్లీ అందు

కున్నాడు. అతడినే పరీక్షగా చూస్తూ వింటూన్న డాక్టర్ కుమార్ యిది చూడగానే, అతడి ఉద్దేశమేమిటో వెంటనే గ్రహించాడు. కోపంతో అతడి మొహం జేవురించింది. అయినా చివరిదాకా మౌనంగావుండి సాంతం విన్నాక నిల దీసి అడగాలనుకొన్నాడు. "వీళ్లని పట్టుకుని శిక్షించి తీరాలి. ఏమాత్రం జాలి తల్చి వొదిలిపెట్టినా, యిక త్వర లోనే ఈ హాస్పిటల్ మూసివేయాల్సి వస్తుంది" అంటూ ముగించి కూర్చొన్నాడు.

ఆ వెనువెంటనే డాక్టర్ కుమార్ స్వరం కటువుగా ధ్వనించింది- "డాక్టర్! ఎవరా వ్యక్తులు? తెలిస్తే చెప్పండి. ఇంతకాలం యిక్కడ పనిచేస్తున్న అందిరిలో సహనం అన్నదే లేకపోతే ఈ పేరుప్రతిష్ఠ లెలా వచ్చాయి ఈ సంస్థకి? చుట్టుపట్ల పల్లెలనుండే కాకుండా, యింకా పెద్ద పెద్ద హాస్పి టల్సూ, బోలెడుమంది డాక్టర్లూ వున్న ఊళ్లనుండి కూడా వచ్చే వారే జనం? ఇదంతా ఎలా జరిగిందంటారు? ఇంత త్వరగా పరిస్థితులు తారుమారవటాని క్కారణాలు డాక్టర్ ప్రభాకర్ చెప్పిన విషయాలేనని నేననుకోను. అయినా, అందరి సందేహ నివృత్తికోసం అడుగుతున్నాను. డాక్టర్ ప్రభాకర్! ఇంతకీ ఎవరా బాధ్యతలేని వ్యక్తులు? చెప్పండి. మీ అభియోగమే నిజమైతే, ఎటువంటి ఉన్నత స్థానంలో వున్నా సరే వారిమీద కమిటీ తప్పకుండా చర్య తీసుకుంటుంది. ఈ సంస్థలో అటువంటి వాళ్లకి స్థానంలేదు..." తనని తాను సంబాళించుకోవటాని కన్నట్టు కొద్ది క్షణాలసేపు ఆగాడు. అతడి గుండెలో ఉబుకుతూన్న ఆవేశతరంగాల ఉధృ తానికి మొహం ఎర్రగా కందిపోయింది. తిరిగి చెప్ప సాగాడు- "ఈ ఆస్పత్రి ఎన్నో పవిత్ర ఆశయాలని వుద్దే శించి కట్టబడింది. ఇది ఒట్టి బిల్డింగ్ అని మాత్రమే అను కొంటున్నారేమో? కాదు... కాదు! మన అందరి ప్రాణం... మన ఆదర్శాలకీ, ఆశయాలకీ ప్రతిరూపం; మన వూపిరి... మన సర్వస్వం! ఇక్కడ పరిచర్యకీ, ఆదరణ, ఆప్యాయతలకీ తప్ప మరి దేనికీ చోటులేదు. చెప్పండి! ఐ వాంట్ టు నో, హూ దెఆర్" అన్నాడు.

ఆ కంఠంలోని తీవ్రతకి, ఆ కళ్లలోని తీక్షణతకి డాక్టర్ ప్రభాకర్‌కి ముచ్చెమటలు పోశాయి. కానీ యింతదూరం వచ్చాక యిహ తప్పించుకోటానికి వీల్లేకపోయింది. బెదురుతూ అందరివైపోసారి చూసి "సారీ! డాక్టర్; యింత మంది ఎదుట ఆ వ్యక్తుల పేర్లు బైటపెట్టటం మర్యాదగా వుండదు" అన్నాడు నంగినంగిగా.

"చెప్పటానికంత భయంగా, బెరుగ్గా వుంటే నేనూ మిమ్మల్ని వొత్తిడిచెయ్యను. కానీ అందరికీ మరోసారి హెచ్చరిక చేస్తున్నాను. ఇలాటివేవీ యిక్కడ జరగటానికి వీల్లేదు. ప్రతి ఒక్కరూ శక్తిమేరకు కష్టపడి పనిచెయ్యా ల్సిందే. రేపు దీని విషయం అందరికీ సర్క్యులర్ వస్తుంది," అంటూ ముగించాడు.

* * *

సాయంత్రం నీరెండ హాయిగా, నులివెచ్చగావుంది. ఒకరి వెనగ్గా ఒకరు దీప, అరవింద, ఆ సన్నటి కాలి బాట వెంబడి నడుస్తున్నారు. ముందుగా నడుస్తూన్న దీప ఏవేవో కబుర్లు చెబుతూ నవ్విస్తోంది అరవిందని. అలా కొంత దూరం వెళ్లాక ఎందుకో వున్నట్టుండి తిరిగిచూసింది. ఓ పది గజాల దూరంలో వున్న అరవింద క్రిందికి వొంగి దేన్నో పరీక్షగా చూస్తోంది.

"ఏమిటండీ అది; అంత దీక్షగా చూస్తున్నారు," అంటూ దగ్గరికొచ్చింది దీప.

"చూశావా దీపా ఈ పురుగుని? ఎంతందంగా వుంది కదూ! దీని శరీరం చూశావా; ఏ ఫారిన్ వెల్వెట్టూ లేనంత మెత్తగా వుంది. దీన్ని తప్పకుండా యింటికి తీసుకెళ్తాను," అంటూ దాన్ని జాగ్రత్తగా మునివ్రేళ్లతో పట్టుకుని కర్చీఫ్ మధ్యలో వుంచి, నాలుగు చివర్లూ వొదులుగా పట్టుకుంది.

"భలేవారే! ఇంకా ఏమిటోననుకున్నాను! దీన్ని ఆరుద్ర పురుగంటారండీ. ఆ ఎర్రటి రంగువల్లే దానికా పేరు. ఇంతకీ ఏం చేసుకుంటారు దాన్ని మీరు?" కుతూహలంగా అంది.

అంతవరకూ ఉత్సాహంగా వున్న అరవింద ఈ మాట విన్నదే "అవును దీపా! నిజమే; యింటికి తీసుకెళ్ళి ఏం చేసుకోను దీన్ని? పైగా తీసుకెళ్లేలోగా చచ్చిపోతుందేమో కూడాను" అంటూ కర్చీఫ్ మడతలు జాగ్రత్తగా విప్పి తిరిగి దాన్ని నేలమీద వొదిలేసింది.

"మరీ మీ మనసు యింత సున్నితమైతే ఎలాగండీ? సరే! అప్పుడప్పుడూ యిక ముందు యిక్కడికి వస్తూంటాం కదా! అలా వచ్చినప్పుడల్లా మీరు వాటిని తనివితీరా చూస్తూ కూర్చోవచ్చు" అంది సన్నగా నవ్వుతూ దీప. జవాబుగా తను కూడా నవ్వి దీప వెనకాలే నడవసాగింది అరవింద.

"ఇదుగో వచ్చేశాం! ఈ రాయి గూర్చే నేను మీకు చెప్పింది. దీనిమీద నేను కూర్చుంటాను. చుట్టూ చూశారా ఎంత బావుందో? వాసనలు వెదజల్లుతున్న అడవి పూలు, రంగురంగుల పిట్టలు ఒకదానితో వొకటి పందెం వేసు కున్నట్టు ఆకాశంలో పరుగెడుతూన్న మబ్బుతునకలు... క్రింద మెత్తటి పరుపులాంటి పచ్చగడ్డి... ఎంతందంగా

వుంది ప్రకృతి! ఇలాటి చోట మీ మనసుకి బొమ్మ గీస్తున్నంతసేపూ ఎంతో హాయిగా, ప్రశాంతంగా వుంటుంది."

ఆ ప్రకృతి సౌందర్యానికి అరవింద కళాహృదయం ఒక్కసారిగా పరవశించిపోయింది. గబగబా "కిట్" తెరిచి సామానంతా బయటికి తియ్యసాగింది.

"అరెరె! నే నన్నీ తీసిస్తాను. మీకెందుకు శ్రమ" అంటూ ఆమె చేతిలోని 'కిట్' ని లాక్కుని అన్నీ అమర్చసాగింది దీప.

ఈసెల్‌ని చూడగానే అరవింద పెదవులు చిరునవ్వుతో విచ్చుకొన్నాయి. "దీపా ఈ ఈసెల్ మా ఆయన జర్మనీ వెళ్ళినప్పుడు నాకోసం తెచ్చారు. మడతపెట్టి ఎక్కడికి పడితే అక్కడికి తీసుకువెళ్లటానికి వీలుగా వుండేటట్టు తేలికైన అల్యూమినియంతో చేశారు దీన్ని," అంది అడ్జెస్ట్ చేస్తూ అరవింద.

ఆ తర్వాత ఏ భంగిమలో దీప బావుంటుందో ఏ కోణంలో మొహంలోని భావం బాగా వ్యక్తమవుతుందోనని ఓ అరగంటసేపు దీపని అనేక భంగిమల్లో కూర్చోబెట్టి చూసి, చివరికి ఒక భంగిమ నచ్చితే, యిక అలాగే కదలకుండా తను లేవమని చెప్పేదాకా కూర్చోవాలంది. సరేనంటూ బుద్ధిగా కూర్చుంది దీప. "ఇదిగో అమ్మాయ్; యిప్పుడు కూర్చున్న తీరులోనే చిత్రం పూర్తయ్యేదాకా అన్ని సిట్టింగ్స్‌లోనూ గుర్తుపెట్టుకుని మరీ కూర్చోవాలి తెలిసిందా" అని హెచ్చరించి స్కెచ్ గియ్యటానికి పూనుకొంది.

అంతే! తననీ, కాలాన్నీ, పరిసరాల్నీ కూడా మరిచిపోయి గీయసాగింది అరవింద. అప్పుడప్పుడూ తలెత్తి దీప వైపు చూసినా ఆ కళ్లలో ఏకాగ్రత తప్పితే మరో భావం కన్పించటంలేదు. పరీక్షగా పట్టిపట్టి చూసి గీయసాగింది. గాలికి జుట్టు చెదిరి కళ్లమీద పడుతున్నా, పక్కకి తోసుకోవాలన్న ధ్యాసకూడా లేదామెకి. మరో అరగంట గడిచింది. ఇంకా అలాగే గీస్తూంది. కానీ అంతసేపు కదలకుండా కూర్చోవటమంటే దీపకి పిచ్చెక్కినట్టుగా వుంది. ఒక్కసారి గెంతి అక్కడినుండి పారిపోదామా అన్పించినా, తన కర్తవ్యం వెంటనే గుర్తుకొచ్చి, లేని ఓపిక తెచ్చుకుని అలాగే కూర్చుంది. మెల్లగా ప్రొద్దు వాటారిపోతూంది. ఇక చీకటిపడటానిక్కూడా ఆట్టే సమయంలేదు. నడిచి వెళ్లాలి చాలా దూరం.

"ఇక చాలిద్దామా యివాల్టికి ?" అంది దీప.

"ష్ ! కదలకు నే చెప్పేదాకా" అంది చిత్రంలో లీనమైపోయిన అరవింద అసహనంగా.

"సరే !" అని కాళ్లుచేతులు లాగుతున్నా మళ్లీ అలాగే కూర్చుండిపోయింది దీప, అరవింద 'చాలు' అని చెప్పేదాకా !

* * *

ఏడుపూ, మధ్య మధ్య అరుపులూ విన్పిస్తున్నాయి డాక్టర్ కుమార్ యింట్లోనుండి. సూపరింటెండెంట్ యిల్లు కావటాన ఎమర్జెన్సీ కేసులేవైనా వస్తే త్వరగా హాజరు కావటానికి వీలుగా వుంటుందని హాస్పిటల్‌కి దగ్గరగానే కట్టారు.

"ఎందుకు పెళ్లాడినట్టు నన్ను? నా బ్రతుకు నాశనం చెయ్యటానికే కదూ! మీలాటివాళ్లు పెళ్లి చేసుకోకుండా సన్యాసుల్లాగా వుంటేనే మీకూ యితర్లకీ కూడా క్షేమం. చెప్పండి; మీ జీతం ఏంచేస్తున్నారు ? ఎవరికిస్తున్నారు ? రానురాను యింత తగ్గిపోతూందేం ? ఇన్ని రోజులూ ఏదో అవసర ఖర్చులకి వాడుకుంటున్నా రనుకున్నాను కానీ ఈనెల వందరూపాయలే తీసుకొచ్చారేం? వూ; ఏమిటిదంతా?" కొరడాతో కొట్టినట్టుగా వున్నాయి అరుణ మాటలు.

ఇంత అరుస్తున్నా అవతలినుండి ఏ సమాధానమూ రాలేదు. తలవంచుకుని, నిశ్శబ్దంగా, ఒక్కోముద్దే బలవంతంగా మింగుతున్నాడు డాక్టర్ కుమార్.

ఈ మౌనం మరింత రెచ్చగొట్టింది అరుణని. మళ్లీ అరవసాగింది "సుఖంలేదు, సరదాలేదు, ఈ బ్రతుక్కి. ఆఖరుకి సంసారం గడవటానిక్కూడా డబ్బు గతిలేదు. ఏం చూసుకుని బ్రతకాలి నేను! డాక్టరంటే ఉబ్బిపోయి పెళ్ళి కొప్పుకొన్నాను గానీ, యింత దరిద్రంగా, నికృష్టంగా బ్రతకాల్సి వస్తుందని కల్లో కూడా అనుకోలేదు. కట్టుకున్న భార్యని సుఖపెట్టలేని మీరు ఊరిని వుద్ధరించాలనుకోవటం మూర్ఖత్వం కాక మరేమిటి?"

"ష్; అరుణా! ఇక చాలు ప్లీజ్! నీక్కావలసింది డబ్బేగా? తెచ్చిస్తానుండు" అని తింటూన్న పళ్లెంలోనే చెయ్యి కడిగేసుకుని వెళ్లిపోయాడు, డాక్టర్ కుమార్.

అలాగనేసి వెళ్లాడే కానీ డబ్బెవర్ని అడగాలో, ఎలా అడగాలో అతడికి తోచలేదు. ఇవ్వటమేకానీ, యింకొకరి వద్దనుండి తీసుకోవటమన్నది అతడికి తెలియని విషయం. కాబట్టే చెయ్యిచాచటాని కతడి మనసు సుతరామూ ఒప్పుకోలేదు. చాలాసేపు తిరిగి, తిరిగి, హాస్పిటల్‌లో తన గదిలో కొచ్చి కూర్చొన్నాడు ఏం చెయ్యాలో తోచక బాగా అలసిపోయి.

ఆ మధ్యాహ్నం గొడవంతా గోడ దాటి, అప్పుడే ఆ దారిన నడిచి వెళ్తూన్న జయరాం చెవిని సోకనే సోకింది!

ఒక్కసారిగా ఏదో పైశాచికానందం ముంచివేసిం దతడిని. సిగరెట్ వెలిగించుకొనే నెపంతో, యింకాసేపు అక్కడే ఆగి, అరుణ చేస్తున్న రాద్ధాంతమంతా సాంతం విన్నాడు. గబగబా అతడి బుర్ర పనిచెయ్యసాగింది. ఇంటివైపు నడుస్తూ వ్యుహాలు పన్నటం మొదలుపెట్టాడు. ఇంట్లో కడుగు పెట్టేసరికి, అతడి బుర్రలో పథకం తయారై కూర్చుంది. 'ఇంత కాలానికి డాక్టర్ కుమార్ మీద దెబ్బ తియ్యటానికి మంచి అవకాశమే దొరికింది. మనసులో కసి వున్నా అనువైన సమయంకోసం కాచుక్కూర్చోవటమే మంచిదైంది. ఇప్పుడు తెలివితేటల్ని, యుక్తుల్ని, సామర్థ్యాన్ని వినియోగించి, ఎలాగైనా డాక్టర్ కుమార్‌ని దెబ్బ తియ్యాలి. ఒక్క దెబ్బతో అతడి పేరు ప్రతిష్ఠలు మంట గలిసిపోవాలి! ఈ ఆటలో పావుగా అరుణనే వాడుకోవాలి! అతి మెళకువతో ఈ నాటకం ఆడాలి. లేకుంటే మొదటికే మోసం. తన ప్రయత్నం ఫలిస్తే, కుమార్‌ని చావు దెబ్బ కొడ్తై అప్పుడు తనికి ఎదురంటూ ఎవరూ వుండరు. అప్పుడుగానీ తన పగ చల్లారదు' అనుకోసాగాడు.

* * *

మధ్యాహ్నం పోస్టులో తండ్రివద్దనుండి వుత్తరం వచ్చింది దీపకి. విప్పి చదివాక, సంతోషంతో ఎగిరి గంతేసింది! తనకి వచ్చిన సంబంధాన్ని యశోదకి కుదర్చమని రాస్తే తల్లి ఒకరోజంతా దెబ్బలాడి అలిగి పడుకున్నా, రెండో రోజు యిక సమయం వృధాచేస్తే బంగారంలాంటి సంబంధం చెయ్యిజారిపోతుందని ఒప్పుకొందనీ, ఆ అబ్బాయి ఏదో ట్రైనింగ్‌కి వెళ్తున్న కారణంగా యిక పదిరోజుల్లో పెళ్ళి ముహూర్తం నిశ్చయించామని రాస్తూ దీపని వెంటనే సెలవు పెట్టి రమ్మనమని రాశాడాయన. అబ్బా! యిక పదిరోజులే! అరె పదేలాగ? ఉత్తరం రావటానికి అప్పుడే రెండురోజులు గడిచిపోయాయే? ఇహ ఎనిమిదిరోజులే వున్నాయి. సెలవు పెట్టి రేపు లేదా ఎల్లుండి బైలుదేరాలి అని తనకున్న పట్టు చీరల్లో రెండు మాసిపోయి వుంటంవల్ల గేటుదగ్గరేవున్న లాండ్రీవాడికిచ్చివద్దామని చీరలు పట్టుకుని బైలుదేరింది. దీప మనసు సంతోషంతో పరవళ్ళు తొక్కుతోంది. తనలో తానాలోచించుకొంటూ యధాలాపంగా ఆస్పత్రి వంక చూసింది. అంతా ఖాళీగా, నిశ్శబ్దంగావుంది. ఇంకా మధ్యాహ్నం భోజనానికి వెళ్ళిన నర్సులు రాలేదు. మలుపు తిరగబోతూ మరొక్కసారి చూసిందెందుకో. హఠాత్తుగా ఆమె కళ్ళకి డాక్టర్ కుమార్ ఆ మధ్యాహ్నంవేళ తన గదిలో, కుర్చీలో వెనక్కివాలి ఒంటరిగా, అలసటగా కూర్చుని వుండటం కన్పించింది. అయినా యశోద పెళ్ళిని గుర్చిన సంతోషంలో వుండటంవల్ల ఈ విషయం అప్పుడే మర్చిపోయింది. లాండ్రీలో చీరలుయిచ్చి, రశీదు తీసుకుని గదికి బైలుదేరింది. మళ్ళీ ఆలోచనలు చుట్టుముట్టాయి దీపని "అమ్మకో మంచి చీర కొనాలి. యశోదకేదైనా ప్రెజెంట్ కొనాలి. అన్నట్టు నాన్నకికూడా ఏదైనా పట్టుకెళ్ళాలి" అనుకొంటూ మరోసారిచూసింది హాస్పిటల్‌వైపు. మెట్లకి ప్రక్కగానున్న గదిలో యింకా అలాగే, చలనంలేకుండా దీర్ఘంగా దేన్నిగూర్చో ఆలోచిస్తున్నట్టుగా కూర్చుని ఉన్నాడతను యింకా. అతన్ని చూడా లనుకుంది దీప.

గుమ్మందాకా గబగబా నడిచివచ్చిన దీప అతని వాలకాన్ని చూడగానే చటుక్కున ఆగిపోయింది. ఆ తర్వాత శబ్దంకాకుండా అతిమెల్లగా నడుస్తూ వచ్చి అతడి పక్కన నుంచుంది. అతడి మొహంలోని నిస్సహాయత, విచారం ఆమెని కదిలించివేశాయి. ఆ తర్వాత పర్స్‌తెరిచి, కర్చీఫ్ బైటికి లాగింది. నాలుగుమడతలుగా పట్టుకున్న ఆ కర్చీఫ్ సగం ఎత్తి పట్టుకున్న ఆమె చేతిలో చాలాసేపటివరకూ అలాగే వుండిపోయింది. ఇదివరకెంతమందో ఆడ, మగ రోగులికి ఆమె అలా తుడిచి సపర్య చేసివుంది. అయినా ఈ సమయంలోమాత్రం అలా చెయ్యటానికి ఆమె అంతర్యం వెనుకాడటంతో, డాక్టర్ కుమార్ నుదుటి చెమటని అద్దటానికంటూ ఎత్తిపట్టుకున్న చెయ్యి అప్రయత్నంగా క్రిందకి వాలిపోయింది. ఆ తర్వాత ఎంత మెల్లగా నడిచివచ్చిందో అంతమెల్లగా అడుగులేస్తూ, శబ్దంకాకుండా తలుపుమూసి వెళ్ళిపోయింది.

అలా ఎవరో రావటమూ, తన ప్రక్కనే కొంచంసేపు నిలబడటమూ, ఆ తర్వాత వెళ్ళిపోవటమూ గ్రహించిన అతడు కళ్ళువిప్పిచూస్తే, అతడికప్పుడే అడుగు బైటికి పెడ్తూన్న దీప కన్పించింది. ఏదో చెప్పాలన్నట్టు ముందుకి వంగాడు. కానీ ఓ క్షణంతర్వాత మనసు మార్చుకుని, మళ్ళీ మునుపటిలాగే వెనక్కి వాలి కళ్ళుమూసుకున్నాడు. ఎన్నోవేలమందికి ఊరట, ఉపశమనం కలిగించాయాతడి చేతులు. బాధ ననుభవిస్తున్నవారికి అనునయవాక్యాలు పలికి సేదదీర్చాయతడి పెదవులు. కానీ ఈ క్లిష్ట సమయంలో అతడు ఒక్క చల్లటి మాటగానీ, మెత్తటి స్పర్శగానీ నోచుకోలేదు! మనసులోని బాధని లోపలే భరిస్తూ, ఒంటరిగా కూర్చుండిపోయాడు.

అక్కడి దృశ్యం చూశాక దీప మనసంతా వికలమైపోయింది. విచారంగా, కాళీడ్చుకొంటూ గదికొచ్చింది. అలసట, విచారం నిండిన అతడి మొహం పదే పదే గుర్తుకి రాసాగింది. భోజనం చెయ్యాలన్పించలేదు. అంత

పరకున్న ఉత్సాహమంతా పూడేసినట్టు ఎగిరిపోయింది. మంచంమీద కూర్చుని, పర్సుతెరిచి, కర్చీఫ్ బైటికిలాగి దాన్నలాగే పిచ్చిదాన్లాగా చూస్తూండిపోయింది చాలాసేపటి వరకూ. ఆ తర్వాత ఆమెకి తెలియకుండానే రెండు వెచ్చటి కన్నీటిబొట్లు, చెంపలమీదుగా జారి ఆ కర్చీఫ్‌మీద పడి యింకిపోయాయి.

*          *          *

సాయంత్రం క్లబ్‌కి వెళ్ళే ప్రయత్నంలో వుంది అరుణ. ముస్తాబు ముగించి వరండాలోకీ, లోపలికీ నాలుగైదుసార్లు తిరిగింది. ఆవేళ పబ్లిక్ ప్రాసిక్యూటర్ భార్య వచ్చి తనని పికప్‌చేసుకు వెళ్తానని చెప్పి, ఆరుగంటలవుతున్నా యింకా రాకపోవటంతో, అరుణకి మహాచిరాగ్గా, తనమీద తనకే కోపంగావుంది. తమకే ఓ కారుంటే ఎంత బావుండేది! ఇలా అందరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన ఖర్మ ఉండేది కాదుగదా ! వాళ్ళకన్నా తనెందులో తక్కువ? ఇంత పేరు మోసిన డాక్టర్ భార్యయినా కారు లేనిమూలంగా వాళ్ళ ముందు తనెందుకూ పనికిరానిదే...ఎన్నికలేనిదే ; రూపమూ చదువూలేకున్నా ఫర్వాలేదుకానీ, డబ్బుంటే ఎంత ప్రత్యేకతని, ఆకర్షణని అమర్చిపెడుతుంది మనుషులకి?? అన్నట్టు యింకా రాలేదేం ఈవిడ? ఇదో టెక్కుకాబోలు వీళ్ళకి వస్తానన్న టైంకి రాకపోవటం" అనుకొంటుండగా కాలింగ్ బెల్ మ్రోగింది.

"హమ్మయ్య ! ఆఖరుకి దయచేసింది" అనుకొంటూ, తాళంగుత్తి తీసుకుని బైటికి హడావిడిగా రాబోతూ, ఎవరో మనిషిని ఢీకొన్నంత పనిచేసింది. డోర్ కర్టెన్ పక్కకి లాగుతూ సారీ అని తలెత్తిచూసిన అరుణ నిర్ఘాంతపోయింది. అక్కడ తనూహించినట్టుగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ భార్య లేదు...డాక్టర్ జయరాం నవ్వుతూ నుంచుని వున్నాడు !

సంవత్సరానికి ఏ ఒకటి, రెండుసార్లో, అదీ డాక్టర్ కుమార్‌తో అత్యవసరమైన పనివుంటేనేగానీ రాని జయరాం వేళకానివేళలో అలా హఠాత్తుగా రావటం అరుణకి ఆశ్చర్యాన్ని కలిగించింది. అయినా పైకిమాత్రం మామూలుగా "ఓ ! మీరా ; రండి" అంటూ లోనికాహ్వానించింది.

"అబ్బే కూర్చోటానికి రాలేదండీ ; ఇలా వెళ్తూంటే మీరు గుర్తొచ్చారు. పలకరించిపోదామ నొచ్చాను" అన్నాడు వెంటనే.

"మీరు రావటమే అపురూపం. ఎటూ వచ్చారు కాబట్టి కూర్చోండి కాసేపు" అంది.

"సరే! మీకేం పనిలేకపోతే అలాగే కూర్చొంటాను" అని కూర్చుని టీపాయ్ మీదున్న మేగజైన్‌ని చేతిలోకి తీసుకుని అప్పుడే గమనించినట్టు మొహం నిండుగా ఆశ్చర్యం నింపుకుని "అరె! అదేం, అలా నీరసంగా పాలిపోయినట్లు కన్పిస్తున్నారు ? ఒంట్లో బాగులేదా ఏం?" అన్నాడు ఆదుర్దా వుట్టిపడుతూన్న స్వరంతో.

అరుణకి జయరాం పరామర్శ బీటలువారిన హృదయం మీద పన్నీరు చిలకరించినట్టయింది. అమ్మయ్య ! ఇంత కాలానికి నన్నూ, నా వునికినీ గుర్తించిన మనిషి దొరికాడు ఫర్వాలేదనుకొంది. సన్నటి నవ్వుతో పెదిమలు విచ్చుకోగా, మళ్ళీ యింకోసారి అతడి మాటలు వినాలన్పించి పరధ్యానం నటిస్తూ "ఆ ! ఏమిటన్నారూ ?" అంది.

"అదే ! ఎందుకింత నీరసించిపోయారు అకస్మాత్తుగా ? ఒంట్లో బావుంటంలేదా ; మీ ఆరోగ్యం యింత దిగజారిపోయినా డాక్టర్ కుమార్ నాతోగానీ, మరెవరితోగానీ మాటమాత్రంగానైనా అనలేదే ? అదే నాకు ఆశ్చర్యంగా వుంది" అన్నాడు సానుభూతి ఒలకబోస్తూ.

"అయ్యోరాత!నా ఆరోగ్యంసంగతి ఆయన కెందుకండీ? తన పేషెంట్ల ఆరోగ్యం బాగుంటే అంతే చాలు ఆయనకి." అంది వాపోతూ.

"హియర్ ! హియర్! ఎంత చదువుకొన్నా, ఎన్ని అందచందాలున్నా, అందరు ఆడవాళ్ళూ తమ భర్తల విషయంలో ఒక్కలాగే మాట్లాడ్తారని మీరు మరోసారి ఋజువుచేశారు" అన్నాడు గట్టిగా నవ్వుతూ.

మరోసారి అరుణ అంతరంగం సంతోషంతో ఎగిరి పడింది-తన చదువూ, అందం, తెలివితేటలు యిన్నాళ్ళకి గుర్తింపబడ్డందుకు. మళ్ళీ నవ్వేస్తూ "అబ్బే ! అలాంటిదేం లేదండీ. నాకు ఒంట్లో ఆరోగ్యంగానే వుంది" అంది కుర్చీలో సర్దుకుని కూర్చొంటూ.

"చూడండీ ; యిందాక మీరో మాట అన్నారు. డాక్టర్ గారికి వారి పేషెంట్ల బాగోగులు తప్ప యింకేమీ అక్కర్లేదని. మరి ఆయనే పట్టించుకోకపోతే యిక వాళ్ళ గతేమిటి ? ఇంత పేరుమోసిన డాక్టర్ భార్య అయిన మీరే యిలా అనటం అంత బాగాలేదు. ఇలా అంటున్నందుకు మీ మనసు బాధపడితే క్షమించండి," అన్నాడు నమ్రతగా.

అంతవరకూ సంతోషతరంగాలమీద తేలిపోతున్న అరుణకి ఒక్కసారిగా కోపం ముంచుకొచ్చింది, ఈ మాటలు విన్న తక్షణం. అయినా తమాయించుకొని "ఏం ? వాళ్ళేనా మనుషులు ? నేను కానూ ? నాకూ కోరికలూ, కష్టసుఖాలూ వుండవూ," అంది కాస్త రోషంగా.

ఏదో చెప్పాలన్నట్టు జయరాం పెదవులు కదిలాయి. అంతలో ఫోనుమోగింది. వెళ్ళి రిసీవరందుకొంది అరుణ.

అవతలినుండి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గారి భార్య కంఠం

పలికింది. 'డ్రైవర్ రానందువల్ల తానాపూట క్లబ్‌కి వెళ్ళటం లేదనీ, వస్తానని చెప్పి రానందుకు ఏమీ అనుకోవద్దని క్షమాపణ చెప్పుకొం'దావిడ.

"ఫర్వాలేదులెండి ; దానికేం" అంటూ ఫోన్ పెట్టేసిం దరుణ.

"ఏమిటి ? ఎక్కడికైనా వెళ్ళాలని ప్రోగ్రాం వేసుకొన్నారా ? నేను వచ్చి మీ ప్రోగ్రాం పాడుచెయ్యలేదుకద" అన్నాడు జయరాం.

"అబ్బే! నేనెక్కడికి వెళ్తానండీ ? వెళ్తే క్లబ్‌కి; అంతే ! పైగా ఈ వూళ్ళో నాకు స్నేహితులంటూ పెద్దగా ఎవరూ లేరు."

"చూశారా ! ఎంత యిన్సల్ట్ చేస్తున్నారో...ప్చ్" అన్నాడు జయరాం బాధపడిపోతూ.

తానన్న మాటల్లో తప్పేంవుందో అర్థంకాక "యిందులో యిన్సల్ట్ చెయ్యటం ఏంవుందండీ" అంది.

"కాకపోతే ఏమిటండీ ? మేమందరం మీ ఫ్రెండ్స్‌మి కామూ ? మీకేమాత్రం కష్టం కలిగినా సహించగలమని అనుకొంటున్నారా ?" అన్నాడు.

ఎంత మంచి రోజివాళ! ఎన్నాళ్ళ కింత ఆప్యాయత చవి చూస్తూంది తాను ! ఎదుటి వ్యక్తి అంతరంగంలోనికి తొంగి చూసి, చేయూత నివ్వగల మనిషి ఎన్నాళ్ళకి కన్పిం చాడు ? అయ్యో యింతకాలం యితడిని గుర్తించలేక పోయానే అని బాధపడింది కొంతసేపు అరుణ.

"నే నడిగిన ప్రశ్నకి జవాబు యింత దీర్ఘంగా ఆలో చిస్తున్నారేం ?" నవ్వాడు జయరాం మళ్ళీ.

"ఏంలేదండీ ; క్లబ్‌కి వెళ్దామనుకున్నాను. మిసెస్ వర్మ వచ్చి నన్ను పికప్ చేసుకొంటానంది ఆరుగంటలకి. డ్రెస్ అయి అరగంటసేపు వెయిట్ చేశాక, యిప్పుడు ఫోన్ చేసింది డ్రైవర్ రాలేదనీ, తను రావటం పడదనీ" అంది నిట్టూరుస్తూ.

"అయ్యో; యిందాకే చెప్పకపోయారా? అయినా యింకా టైంవుందిగా, ఉండండి రెండు నిమిషాల్లో నా కారు తీసుకొస్తాను" అని అరుణ వద్దంటున్నా వినకుండా లేచి వెళ్ళాడు.

చాలాసార్లు అతడి కార్లో క్లబ్‌కీ, పార్టీలకీ వెళ్ళివస్తూం దరుణ ఈ మధ్య. ఒకరోజు అతడి డ్రైవర్ రాలేదు. అందుకే స్వయంగా తనే పిలుచుకువస్తున్నాడు యింటికి అరుణని క్లబ్‌నుండి. ఎప్పుడూ గలగలా మాట్లాడే వాడల్లా ఆ రోజెందుకో ముభావంగా, డ్రైవ్‌చేస్తున్నాడు జయరాం. అరుణకూడా మౌనంగా వెనుకసీటుకి తల ఆన్చి బయటికి చూస్తూ కూర్చుంది. కొంచెందూరం పోయాక "డాక్టర్ ! మీ కనవసరంగా శ్రమకలిగిస్తున్నా న్నేను. ఇలా పదే పదే మీ కారుని వాడుకోవటం నాకు చాలా సిగ్గుగావుంది" అంది మొహమాటంగా.

తేలిగ్గా నవ్వేస్తూ "అరుణాదేవీ! మీవారు కారుకొనే వరకు ఈ శ్రమని సంతోషంగా భరిస్తాను—మీకోసం" అన్నాడు క్రీగంట ఆమె మొహంలో భావాలు కనిపెడుతూ.

"ఆ ! ఈజన్మ కిహ మేం కారు కొన్నట్టే" అంది నిరాశగా అరుణ. "ఏం ? అంత పేరు ప్రఖ్యాతులున్న డాక్టరే మీవారు?? తల్చుకోవాలేకానీ అదెంతపని ?" అన్నాడు.

"అదంతే లెండి" అంది అరుణ నిరుత్సాహంగా.

కారుని బాగా స్లోచేస్తూ కాస్త పక్కకి తిరిగి "అరుణా దేవిగారూ ; మీరెందుకో చాలా బాధపడుతున్నట్టున్నారు. స్నేహితుడిగా, మీ బాధకి గల కారణమేమిటో నేను తెలుసుకోవచ్చా ? చెప్పండి ; అందుకు నే నర్హుణ్ణి కానా?" అన్నాడు.

అడగటంలోని ఆ తీరుకి చలించిపోయింది అరుణ. గుండెలోని బాధనంతా ఈ కొత్త స్నేహితుడికి విప్పిచెప్పుకొని వూరట పొందాలనుకొంది. చెప్పసాగింది అరుణ— "కారుకొనటం కాదుగానీ, యిహ ముందు, ముందు యిల్లు గడవటంకూడా దుర్భరం కావొచ్చు. ఆయన జీతం సరిగ్గా తెచ్చివ్వటంలే దీమధ్యని ఈనెల మరీ అధ్వాన్నంగా వంద రూపాయలే తెచ్చిచ్చారు. పోయిన నెల్లా, అంతకుక్రితంనెలా సరిగ్గానే యిచ్చారనుకోండి. అయివా అప్పుడప్పుడూ యిలా ఎందుకు చెయ్యాల్సివస్తూందో చెప్పరు. రెండుమూడుసార్లు అడిగి చూశాను. ఆ తర్వాత దెబ్బలాడానుకూడా. అయినా ప్రయోజనంలేదు. నోరువిప్పి కారణం యిదని చెప్పరు. అదేమిటో నా వూహకీ అందటంలేదు," అంది రుద్ధకంఠంతో.

తిన్నగా వలలోపలికే నడిచి వస్తూంది పిట్ట ! అనుకొని మనసులోనే కసిదీరా నవ్వుకొన్నాడు జయరాం. ఆ తర్వాత లేని సీరియస్‌నెస్ తెచ్చిపెట్టుకొని "చెప్పమన్నారా అసలు సంగతేమిటో ? ఆ హా హా ! వొద్దులెండి ; మిమల్ని మరింత బాధపెట్టినవాడినవుతాను" అన్నాడు.

వెనక్కివాలి కూర్చున్నదల్లా చప్పుననిటారుగాకూర్చుంటూ "అవుతే మీకు తెలుసా ఆయన డబ్బంతా ఏంచేస్తున్న దీ? చెప్పండి దయచేసి ; లేకుంటే మిమ్మల్ని యివాళ వొదిలి పెట్టను" అంది.

భారంగా నిట్టూరుస్తూ ఒక విధంగా మీ కన్నివిషయాలూ చెప్పటమే మంచిదనిపిస్తూందినాకు. లేకుంటే వున్నవీ, లేనివీ,

వూహించుకుని మీరు మరింత అశాంతిపాలవుతారేమో..." అంటూ కారుకి బ్రేక్ వేసి రోడ్డుకి ఒకప్రక్కగా ఆపి చెప్ప సాగాడు.

"మీవారికి తెలిసినవాళ్ళూ, స్నేహితులూ వస్తూంటారు హాస్పిటల్ కి ట్రీట్ మెంట్ కి. అభిమానం వున్నప్పుడు కాస్త శ్రద్ధతోచూసి, పంపిస్తే అదే పదివేలు వాళ్ళకి. కాని మీవారు అలా కాదు. వాళ్ళ మందులకీ, మాకులకీ అయ్యే ఖర్చు వాళ్ళ వద్దనుండి పుచ్చుకోవద్దని హాస్పిటల్ వాళ్ళకి ముందుగానే చెప్పేస్తారు. వాళ్ళు మొగపెళ్ళివారిలాగా,అన్నీ అందిపుచ్చుకొని వెళ్తూ, వెళ్తూ, ఈయనకి బోలెడు చిరునవ్వులూ, శతకోటి నమస్కారాలూ, పారేసి వెళ్తారు..."

"మరి బిల్ సంగతేమిటి?" కుతూహలంగా అడిగింది అరుణ.

"ఎంత అమాయకులండీ మీరు ?? ఆ బిల్ తాలూకు డబ్బు మీవారి జీతంలో కత్తిరిస్తారు ఏ నెల కానెల !"

ఈ మాట విన్నదే అరుణ మొహం రోషంతో కంది పోయింది. "ఇదా ఆయన చేసే నిర్వాకం ? తన్ను మాలిన ధర్మం వుందా ఎక్కడైనా? ఇంట్లో పెళ్లాన్ని ఉసురుపెట్టూ, యిలా పైవాళ్లకి దానధర్మాలు చెయ్యటమేమిటి" అనుకొంటూ కసిగా పెదవి కొరుక్కుంది.

* * *

"రా; దీపా ! ఇప్పుడే నీ గూర్చి అనుకొంటున్నాను. నీ పోర్ట్రెయిట్ దాదాపు పూర్తయినట్టే" అంది అరవింద లోపలికి అప్పుడే అడుగుపెడ్తూన్న దీపని చూస్తూ.

తలంటుకొన్న ఆమె పొడుగాటి జుట్టు, పాయలుగా వీడి సిల్కులాగా జారిపోతూంది భుజాలమీదనుండి ప్రక్కలకి. మొహంలో యిదివరకున్న విషాదానికి బదులు ఒకవిధమైన ప్రసన్నత చోటుచేసుకొంది. మనిషిలో ఉత్సాహం, కళ్ళల్లో కాంతీ, చురుకుదనం కన్పిస్తున్నాయి. తదేకంగా అరవింద మొహంలోకే చూస్తూండిపోయింది దీప.

"ఏమిటలా చూస్తున్నావు ? నేను చెప్పిందేమిటో విన్నావా ?" అంది.

"అహా ! ఏం లేదండీ; నా చిత్రం పూర్తవటాని కింకా ఎన్ని రోజులు పడ్తుంది ?"

"ఏం ? అంత ఆత్రంగా వుందా తీసుకెళ్ళి నీ గదిలో వుంచుకోవాలని ?? ఇదుగో యిప్పుడే చెప్తున్నాను; ఆ పెయింటింగ్ కన్నా నువ్వే బావుంటావు. ఏదో సరదాపడి అడిగావని నా చాతనైనంత మట్టుకు గీసానంతే. కాని దాన్లో అందచందాలు వెదికావంటే మాత్రం నిరాశపడిపోతావు. తెలుసా ?" అంది అరవింద.

"అబ్బే ! అదేం కాదండీ; నాకో విషయం మిమ్మల్ని చూస్తూంటే హఠాత్తుగా గుర్తొచ్చింది. కానీ ..." అంటూ మధ్యలో ఆగిపోయింది.

"ఏమిటి దీపా చెప్పు; ఫర్వాలేదు." కుతూహలంగా అడిగింది అరవింద.

"చెప్పాలనే మొదట అనుకున్నాను. కానీ యిప్పుడనిపిస్తూంది మిమ్మల్ని అనవసరంగా శ్రమపెట్టడం దేనికని."

"చెప్పు దీపా ఏమిటది? శ్రమ అని నేనెప్పుడూ అనుకోను నీ విషయంలో." బలవంతపెట్టింది అరవింద.

అరవిందకి దగ్గరగా కూర్చుని తగ్గుస్వరంలో తనలో తనే అనుకొంటున్నట్టుగా చెప్పసాగింది దీప. "హఠాత్తుగా ఈ మధ్య హాస్పిటల్ కి వస్తూన్న పేషెంట్ల సంఖ్య తగ్గిపోయింది. వాళ్లకి మేం చార్జ్ చేస్తున్నది కూడా చాల తక్కువే. అదే యింకో చోటయితే యింతకు రెట్టింపు గుంజే వాళ్ళు. ఇప్పుడు హాస్పిటల్ ఆదాయం బాగా తగ్గిపోయింది. స్పెషల్ వార్డ్ కట్టడం యింకా పూర్తికాలేదు. ఈ యిబ్బందిలాగే వుండిపోతే అది పూర్తిగా ఆపెయ్యాల్సి వస్తుందేమో ! అందరికన్నా దీన్నిగూర్చి డాక్టర్ కుమార్ ఎక్కువగా బాధపడుతున్నారు. ఇదంతా ఏమిటో, ఎందుకిలా జరుగుతుందో, మాకెవరికీ అంతుచిక్కటంలేదు. కారణం ఏమైనా సరే; ఈ హాస్పిటల్ పేరు ప్రతిష్టలు పడిపోవటానికి వీల్లేదు. అందరూ ఎప్పటిలాగే మంచిగా, గొప్పగా చెప్పుకోవాలి. స్పెషల్ వార్డ్ పూర్తయి తీరాలి..."

దీప చేతిని గట్టిగా పట్టుకొంటూ "మీలాటి ఆదర్శమూర్తులంతా కృషిచేస్తున్న ఈ హాస్పిటల్ కోసం నాకు చాతనైంది చేస్తాను దీపా ! అదేమిటో చెప్పు."

అనునయంగా అరవింద భుజంమీద చెయ్యివేస్తూ అంది- "ప్రస్తుతం హాస్పిటల్ నడపటానికైనా డబ్బవసరం. ఇంతలో అసలు కారణం వెతికి పట్టుకొంటాం మేం. అందుకోసం మీ చిత్రప్రదర్శ నొకటి ఏర్పాటుచేస్తే, ఆ ప్రదర్శనలో వసూలైన మొత్తం మన అదృష్టంకొద్దీ చిత్రాలేవైనా మంచి ధరకి అమ్ముడుపోతే, ఆ డబ్బూ కలిపి, హాస్పిటల్ కి మీరు విరాళంగా యివ్వొచ్చు."

"అలాగే దీపా ! నేనంత బాగా గీస్తానన్న నమ్మకం నాకు లేదు. కానీ శక్తికొద్దీ ప్రయత్నిస్తాను. మనల్ని దైవం దయతలిస్తే చిత్రాలు అమ్ముడుపోయి మంచి కలెక్షనే రావచ్చు."

"చాలా థాంక్సండీ. ఈ విషయం నే నివాళే డాక్టర్ కుమార్‌తో చెప్తాను," అని లేచి నుంచుంది దీప.

బస్ దిగి హాస్పిటల్ కాంపౌండ్‌లోని కడుగుపెట్టిన దీపకి ఓ దృశ్యం కన్పించింది. గళ్ల లుంగీ, నీలం రంగు బనీనూ తొడుక్కుని భుజాలదాకా జుట్టుపెంచుకొన్న మనిషొకడు పెద్ద చింతచెట్టుక్రింద తచ్చాడుతూండటమూ, కొద్ది నిమిషాలు పోయాక డాక్టర్ జయరాం గబగబా వచ్చి, అతడిని చెట్టుచాటుకి తీసుకెళ్ళి గుసగుసలాడటమూను. అదృష్టవశాత్తు వాళ్ళిద్దరూ దీపని చూడలేదు. తలలు రెండూ దగ్గరగా చేర్చి గుసగుసలాడుకుంటున్నారు. ఇది చూడగానే దీప మెదడు చురుగ్గా పనిచెయ్యటం ప్రారంభించింది. "ఎక్కడో చూశానే వీడిని ? బాగా పరిచయంవున్న మొహంలాగే వుందే" అంటూ అక్కడే నుంచుని గుర్తుకి తెచ్చుకోవటానికి శతవిధాలా ప్రయత్నించసాగింది. కొంచెం సేపయ్యాక హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది దీపకి. వీడిని యిక్కడే ఈ హాస్పిటల్ గేటుదగ్గరా, ఒకసారి హాస్పిటల్ లోపటా, యింకోసారి చెట్లక్రిందా, మెట్లదగ్గరా ... ఒక్కోసారి ఒక్కో స్థలంలో చూసినట్టు. అయినా వీడికిక్కడేం పని ? పేషెంటవుతే మరి ఎప్పుడూ లోపలికొచ్చి మందు తీసుకోలేదేం ? బయటనే తారట్లాడాల్సిన అవసరం ఏమిటి ? అయినా రౌడీలాగా కన్పిస్తున్న వీడితో ఆ డాక్టర్ జయరాంకి గుసగుస లేమిటి ? కొంపదీసి వీళ్లిద్దరూ ఏదైనా గూడుపుఠాణి చెయ్యటంలేదు కదా ! ఏమైనాసరే వీళ్లిద్దర్నీ ఓ కంట కనిపెట్టే వుండాలి యిక మీదట అని నిశ్చయించుకుంది.

* * *

ఆ రోజు క్లబ్ వార్షికోత్సవం. ఊళ్లోని చాలామంది ప్రముఖులతోపాటు జయరాం కూడా వచ్చాడు ఫంక్షన్‌కి. అన్ని కార్యక్రమాలు ముగిసేటప్పటికి రాత్రి పదిగంటలు దాటింది. మామూలు ప్రకారం జయరాం కార్లో ఎక్కి కూర్చొంది అరుణ. ఓ అయిదు నిమిషాలు పోయాక అందరివద్దా సెలవు తీసుకుని వచ్చి, కారు స్టార్ట్ చేశాడు. ఇద్దరూ మాట్లాడకుండా నిశ్శబ్దంగా కూర్చున్నారు. నున్నటి తారురోడ్డుమీద త్రాచుపాములా జారిపోతూంది నల్లటి అంబాసిడర్. నిశ్శబ్దంగా, భయం గొల్పేదిగా వుందా రాత్రి సమయం. రోడ్ కిరువైపులావున్న చెట్లు కూడా కదలకుండా, ఆ నిశీథిసమయంలో జరిగే కార్యకలాపాల్ని పరీక్షించి చూస్తున్నట్టున్నాయి. నక్షత్రాల పల్చటి కాంతిలో ఆ చెట్ల నీడలు మరింత పొడుగ్గా సాగి, భయంకరంగా కన్పిస్తున్నాయి.

ఉన్నట్టుండి అరుణ "అదేం ? ఈ దారంట వెళ్తున్నారు" అంది ఆశ్చర్యంగా.

డ్రైవ్ చేస్తూన్న జయరాం కొద్దిగా తల పక్కకి తిప్పి ''ఎందుకో యివాళ తొందరగా యింటికి వెళ్ళాలనిపించటంలేదు. రండి 'యక్షిణి'కి వెళ్ళి భోంచేద్దాం. మీరు నా గెస్ట్ యివాళ. కాదనకండి ప్లీజ్" అన్నాడు అర్థింపుగా......................................

"ఇంకా ఆలోచిస్తున్నారా ? మరో పదినిమిషాల టైం కావలిస్తే తీసుకోండి కానీ రానని మాత్రం అనవద్దు."

"వస్తాను పదండి" అంది అరుణ వెంటనే. "గుడ్ ! అలా వుండాలి" అంటూ కారు స్పీడు హెచ్చించాడు.

బెంగుళూరు మహానగరంలో కాలాన్నీ, డబ్బునీ లెక్క చెయ్యనివాళ్ళు వందలకొద్దీ వున్నారు. వాళ్లకి కావలసిందల్లా ఆనందం. అదెంత క్షణికమైనాసరే దానికోసం ఏమైనా చేస్తారు. ఎంత డబ్బైనా వెదజల్లటానికి వాళ్ళకి అభ్యంతరం లేదు. సకల అతిథి మర్యాదలతో వాళ్ళక్కావలసిన ఆనందాన్నందించటానికిటీవల ఎన్నో హోటళ్ళు వెలిశాయి అక్కడ. అలాంటి చోటే 'యక్షిణి' కూడా. జయరాం పోర్టికోలో కారాపి, తాను దిగి, అరుణ డోర్ తెరిచి పట్టుకున్నాడు షివల్రీ కోసం—బయట రంగు రంగుల దీపాల్తో పెళ్ళికూతుర్లాగా మెరిసిపోతూంది యక్షిణి. కారు దిగి నెమ్మదిగా యిద్దరూ లోపలికి నడిచారు. బయట వెలుతురు విరజిమ్ముతున్నా లోపలంతా సైకిడెలిక్ లైటింగ్ ఏర్పాటుచేశారు. ప్రతి టేబిల్‌కీ ప్రక్కగా, గోడ కమర్చబడిన చిన్న బల్బ్ నుంచి చిక్కటి, ఎర్రటి కాంతి టేబిల్ మీదకి మాత్రం ప్రసరించేటట్టమర్చి బల్బ్ పైన ఎర్రటి షేడ్ వుంచారు. గదంతా నెత్తురుతో కడిగినట్టు ఎర్రగా వుంది. బయట వెల్తుర్లో నుండి వచ్చిన అరుణకి ఒక్కసారిగా గదిలోపల కడుగు పెట్టేసరికి, ఆ మసక వెల్తుర్లో కళ్ళు ఆనక, ముందుకి తూలింది. ఇలా జరుగుతుందని ముందే ఊహించిన జయరాం అరుణ భుజాన్ని గట్టిగా పట్టుకున్నాడు. కానీ, నుదురు కుర్చీ అంచుకి తగలటంవల్ల, చిట్టి కొద్దిగా రక్తం వచ్చింది. "నొప్పిగా వుందాండీ ? ఐయాం సారీ" అంటూ ఆమెని మెల్లిగా కూర్చోబెట్టి, వాష్ బేసిన్ దగ్గరికెళ్ళి నీళ్లతో రుమాలు తడిపి తెచ్చి గాయాన్ని సున్నితంగా అద్దాడు.

"అరుణ కుర్చీలో యిబ్బందిగా కదుల్తూ మీరు వచ్చి కూర్చోండి. నాకేం ఫర్వాలేదు" అంది.

వీళ్ళిద్దర్నీ చూసి బేరర్ వచ్చాడు.

రెండురకాల నాన్ వెజిటేరియన్ డిషెస్సూ, సూప్,

వైట్ హార్స్ ఆర్డర్ చేశాడు జయరాం. అప్పటికి నొప్పి కాస్త సర్దుకోవటంతో చుట్టూ చూసింది అరుణ. అప్పటికి ఆమె కళ్ళు ఆ మసకకాంతికి అలవాటుపడటంవల్ల చుట్టూ వున్నదంతా స్పష్టంగా కన్పించసాగింది. రాత్రి బాగా ప్రొద్దుపోయినా మనుషులు యింకా వస్తూనే వున్నారు. వాళ్లలో ఎక్కువమంది వయసులో వున్న జంటలు. రికార్డ్ ప్లేయర్‌లోంచి "పాప్ సంగీతం" విన్పిస్తూంటే ప్లేట్లలో వున్నది కొద్దికొద్దిగా నోట్లో పెట్టుకొంటూ ఒకరి కళ్ళ లోని కొంకరు చూసుకొంటూ, పరిసరాల్ని మర్చిపోయి, అతి తగ్గు స్థాయిలో మాట్లాడుకొంటున్నారు వాళ్లందరూ. గుడ్లప్పగించి వాళ్ళనే చూస్తూ తన జీవితానికీ, వాళ్ళ జీవితాలకీ గల తేడాని అంచనా వెయ్యసాగింది అరుణ మనసులో.

బేరర్ గ్లాసులు తీసుకొచ్చి బల్లమీద పెట్టాడు. ఆ చప్పుడికి ఈ లోకంలో కొచ్చింది అరుణ. సన్నగా, పొడుగ్గా ఉమ్మెత్తపువ్వుల ఆకారంలోనున్న తెల్లటి గ్లాసులు, ఆ పల్చటి కాంతిలో కూడా మెరిసిపోతున్నాయి. వాటి ప్రక్కనే సీసాలో బంగారు కరిగించి పోసినట్టున్న ద్రవం...యింకో రెండు సీసాల్లో స్పెన్సర్ సోడా...

రెండు గ్లాసుల్లోకి ఆ ద్రవాన్ని వొంపి, సోడా కలిపి, నురుగుతో నిండిన ఓ గ్లాసుని. అరుణకి అందించాడు జయరాం.

"వద్దండీ నాకు." ఎవరికీ విన్పించనంత మెల్లిగా అంది.

"కొద్దిగా తీసుకుని చూడండి. చాలా లైట్‌గా కలిపాను మీ కోసమని. ఓ నాలుగు చుక్కలు మాత్రమే ఏపిటైజర్, మిగతాదంతా సోడాయే ... కంపెనీ యివ్వాలి మరి నాకు" అన్నాడు బ్రతిమాలుతున్న ధోరణిలో.

ఏనాడూ అరుణ యిలాంటి చోటుకి రాలేదు. పైగా యిలాంటివి తీసుకునీ ఎరగదు. అంతా కొత్తగా, అయోమయంగా, బెరుగ్గా వుంది. "వొద్దంటే బావుండదు; ఏమిటి చెయ్యటం ? పైగా యితడు మనసు కష్టపెట్టుకొంటాడేమో కూడాను. వొద్దని మొండికేసి, యితడి స్నేహం వొదులు కోవటంకన్నా, ఈ ఒక్కసారికి పుచ్చుకొంటేనే మేలేమో ! పైగా అటూ, ఇటూ కూర్చొన్నవాళ్లూ, బేరర్ అంతా తమ వైపే చూస్తున్నారు. ఇప్పుడు తీసుకోకపోతే అది జయరాంని అవమానించినట్టే అవుతుంది" అని ఓ అయిదు నిమిషాలసేపు తటపటాయించి, చివరికి నెమ్మదిగా చెయ్యి చాపి గ్లాసు తీసుకొంది.

డాక్టర్ కుమార్ డ్యూటీకి వెళ్ళిన సమయాల్లో ఒంటరిగా పడుకున్నప్పుడు, వ్యర్థమైన అనుమానాల్తో, వూహల్తో


*Deepavali Greetings*
*to all our Valued Clients & Well Wishers*

**GOLDEN PRESS**

**Gowliguda, Hyderabad. Phone : 44338**

***Specialists in***

Carton Printing, Box Making, Varnishing and
Quality Letter Press & Offset Printers.

నిద్ర దూరమవగా, పక్కమీద దొర్లుతూ గడిపేది అరుణ. విశ్రాంతి లేకపోవటం మూలాన మరునాటికి బడలికగా అన్పించి దేనిమీదకీ మనసు పోయేదికాదు. కానీ ... ఈ రాత్రి మాత్రం ఏనాడూ లేనంత హాయిగా, గాఢంగా నిద్రపోయింది అరుణ. సుఖంగా నిద్రపట్టటంవల్ల కాబోలు మరుసటిరోజు ఒంట్లో తేలిగ్గా, ఉత్సాహంగా అన్పించసాగింది. చిన్నపిల్లలాగా, హుషారుగా బెడ్‌మీద నుంచి గెంతి, కూనిరాగం తీస్తూ బాత్‌రూంలోనికి నడిచింది అరుణ.

* * *

ఆఖరి పేషెంట్‌కి ప్రిస్క్రిప్షన్ రాసిచ్చి, యధాలాపంగా తలెత్తి చూశాడు డాక్టర్ కుమార్. ఎదుట నవ్వుతూ నుంచుని వుంది అరవింద ! లేత నీలం వెంకటగిరి జరీ చీర, అదే రంగు జాకెట్టూ, మెళ్ళో ముత్యాల నెక్లెస్, తల్లో సంపెంగపూలూ పెట్టుకున్న అరవిందవంక చూస్తూ కూడా తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు మునుపటిలాగా. ఆరోగ్యంగా, హుషారుగా వుంది. ఆశ్చర్యాన్ని పైకి కనిపించనివ్వకుండా "హల్లో అరవిందా ! కూర్చో. చాలా కాలానికి దయ కలిగింది మా పైన" అన్నాడు.

''ఛా; అలాంటిదేం కాదు. ఎప్పటికప్పుడు వద్దామనే అనుకొంటున్నా పనెక్కువగా వుండటంవల్ల రావటానికి వీల్లేకపోయింది. అంతే."

''ఏమిటబ్బా అంత పని ?? ఇంతకీ నువ్వు పనిచేసి అలిసిపోయినట్టు అసలు అన్పించటం లేదే ??" కొంటెగా నవ్వుతూ అన్నాడు.

"నువ్వనుకొంటున్నట్టు వంట పనీ, యింటి పనీ కాదు. ఈ మధ్య దీప ప్రోత్సాహంతో నేను కొన్ని చిత్రాలు పెయింట్ వేశాను. అవన్నీ 'వన్ మాన్ షో' లాంటిది ఏర్పాటుచేసి ఎగ్జిబిట్ చెయ్యాలనుకొంటున్నాను. టౌన్ హాల్లోనవుతే బావుంటుంది కదూ ? మంచి సెంటర్. అందరూ వచ్చి చూట్టానికి వీలుగా వుంటుంది. దీనికి పబ్లిసిటీ యివ్వటానికి నువ్వు మాకు సహాయం చెయ్యాలి కుమార్.''

ఆశ్చర్యంతో అతడి కళ్ళు విప్పారాయి. "వెరీ గుడ్ అరవిందా ! నిజంగా నాకు చాలా సంతోషంగా వుంది. పబ్లిసిటీకేం ? బ్రహ్మాండంగా యిద్దాం. ఆ విషయం గూర్చి నువ్వేం బెంగపడకు. తప్పకుండా నీ ఎగ్జిబిషన్ సక్సెస్ అవుతుంది'' అన్నాడు.

"సరే; మరిక వెళ్ళనా."


## SOUTH CENTRAL'S RELIGION

India is a secular democracy and freedom of Religion is enshrined in the constitution. The people of India have many religious beliefs and worship in different ways.

We on the South Central Railway have adopted "Service to Nation" as our religion an to us "Work is Worship".

Issued by
CHIEF PUBLIC RELATIONS OFFICER

"ఎక్కడికి అప్పుడే ? మరీ ముళ్ళమీదున్నట్టు ఉన్నావేం ??"

"మీ యింటికే ! అరుణను చూసి చాలా రోజులైంది. ఒకసారి పలకరించి పోదామనుకొంటున్నాను. ఇంకో అరగంట సేపుంటా నక్కడ. ఈలోగా నీ పని పూర్తవుతే వచ్చేసెయ్యి" అంది.

ఇంతసేపూ డాక్టరుగా అతడి కళ్ళు అరవిందిని పరీక్షిస్తూనే వున్నాయి. మానసికంగా, శారీరకంగా కూడా చాలా ఆరోగ్యంగా వుందిప్పుడామె. కళ్ళల్లో, మొహంలో, కాంతీ, ఉత్సాహం కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. ఇంత త్వరగా యిలాంటి మార్పు వస్తుందనుకోలేదు డాక్టర్ కుమార్. ఒక్కసారిగా అతడి హృదయం దీప పట్ల కృతజ్ఞతాభావంతో నిండిపోయింది. వయసులో చిన్నదైనా ఎంత నైపుణ్యం వుందామెకి ? తెలివి తేటలూ, చాతుర్యమే కాక మానవత్వం కూడా వున్న మనిషి కాబట్టి ఇంకొకరిలో చైతన్యాన్ని మేల్కొల్పగలిగింది ! దీపమే ఇంకో దీపాన్ని వెలిగిస్తుంది, చైతన్యా న్నందిస్తుంది, ప్రాణం పోస్తుంది, శక్తినిస్తుంది ... థాంక్స్ చెప్పాలి దీపకి అనుకొంటూ దీప కోసం కబురుపెట్టాడు.

చిరునవ్వుతో "పిలిచారా డాక్టర్" అంటూ లోపలి కొచ్చింది దీప.

"కూర్చోండి సిస్టర్" అని చెప్పసాగాడు.

"ఇప్పుడే అరవింద వచ్చి వెళ్ళింది. ఇంత త్వరగా ఆమె కోలుకుంటుందనుకోలేదు నేను. ఇదంతా మీ శ్రమ ఫలితం. మీరు తీసుకున్న శ్రద్ధ. మానసికంగా కూడా ఆమెకి నర్స్ చేసి మరో జన్మ ప్రసాదించారామెకి మీరు. సిస్టర్ ! థాంక్యూ వెరీ వెరీ మచ్. మీకు నేనూ, శ్రీరాం కూడా ఎప్పటికీ కృతజ్ఞులుగా వుంటాం. పైగా ఎగ్జిబిషన్ పెట్టమని ప్రోత్సాహం ఇచ్చిందీ మీరేనని చెప్పింది. నిజంగా మీరు సైకలాజికల్‌గా చాలా బాగా డీల్ చేశారామెని. పెళ్లయ్యాక అరవింద పెయింట్ చెయ్యటం ఎప్పుడూ చూడలేదు నేను. ఆమెలో నిద్రాణమైవున్న సృజనాత్మక శక్తిని మీరే తట్టి మేల్కొలిపారు..."

"ఇందులో నేను చేసిందేమీ లేదు డాక్టర్ ! ఆమెని చూడగానే శారీరకంగానే కాకుండా, మానసికంగా కూడా ఆమెకి నర్సింగ్ అవసరమన్న సంగతి గ్రహించాను. ఆమె మానసిక పరిస్థితిని క్షుణ్ణంగా అర్థంచేసుకొన్నాను. రెండు రోజులపాటు ఆలోచించి, చివరికో నిర్ణయానికొచ్చి నా కార్యక్రమం తయారుచేసుకొన్నాను. అంత పెద్ద ఇంట్లో ఆమె రోజులో చాలా భాగం ఒంటరిగా, ఖాళీగా కాలం గడిపేది. అప్పట్లో ఆలోచనలే ఆమెకి తోడు. పైగా ఆ


***With the Best Compliments from:***

# Nota Bene Enterprises & Prisma Sales

**III-S-30, Lal Bahadur Stadium,**
**HYDERABAD-500 001.**
**Tel: 37409**

## REPUTED ELECTRICAL DEALERS

**Products handled :**

1. Loadster Miniature Circuit Breakers
2. Larsen & Toubro Switch Fuses, Starters Etc.
3. Essen Deinki Control Components
4. Sumeet Mixers
5. M-Seal Epoxy Compound
6. 'Schangler' PVC corrugated tubes
7. 'Unielec' Battery chargers

ఆలోచనలు కూడా ఆరోగ్యవంతమైనవి కాకపోవటంతో, మానసికంగాఆమెపై దెబ్బతీశాయి." ఒకసారి వాచీకేసి చూసుకుని తిరిగి ప్రారంభించింది. "ఆమెకో వ్యాపకం కావాలి. అది ఆమెని ఉత్తేజపరచేదిగా వుండాలి. అందులో సర్వం మర్చిపోయి, ఆమె లీనమైపోవాలి ... పసిబిడ్డను ప్రసవించిందే చూసిన మాతృహృదయం పొంగిపోతుంది... ఎందుకు ? కొంతవరకూ ఆ సృష్టికి తనే కారణం అన్న భావనవల్ల ! మాతృత్వం ఒక్కటే సృష్టి అనిపించుకోదు డాక్టర్ ! ఏ కళ అయినా అటువంటి తృప్తినే ప్రసాదిస్తుంది. అపూర్వమైన చిత్రాన్ని గీసిన చిత్రకారుడూ, అద్భుతమైన కళాఖండాన్ని మలిచిన శిల్పి, హృదయాంతరాళాల్లోంచి ఉబికిన భావవాహినిని కావ్యంగా రూపొందించిన కవి కూడా పొందే ఆనందం, తృప్తీ, సరిగ్గా ఒకటే ! వీరిలో ఒకరికి ఏ ఒకరూ తీసిపోరు. ఈ విషయాన్ని గ్రహించిన నేను ఆమెమీద ప్రయోగించి చూశాను. నా అంచనా తప్పు కాలేదు డాక్టర్ ! ఈ రోజు నా హృదయం కూడా వీళ్ళందరికి లాగానే ఆనందాతిరేకంతో పొంగిపోతూంది ... డాక్టర్ ! ఒక విధంగా నేనే మీకు కృతజ్ఞత తెలియ జేసుకోవాలి. ఎందుకంటారేమో ? ఇంతమంది అనుభవజ్ఞులైన నర్సులుండగా ఈ పనికి నన్నే ఎన్నుకున్నందుకు..."

విస్ఫారిత నేత్రాలతో, ఆశ్చర్యంగా ఆమె చెప్పేది వింటూ చూస్తున్నాడు డాక్టర్ కుమార్. ఒక్కసారిగా అతడి హృదయం గౌరవభావంతో నిండిపోయింది. "సిస్టర్, మీకున్న కార్యదీక్ష, ప్రతిభ అసామాన్యం. ఇంత క్లిష్ట సమస్యని ఎంత సులభంగా, నేర్పుగా పరిష్కరించారు మేం ఎవ్వరమూ మిమ్మల్ని వొదులుకోలేం. మీలాటి ఆదర్శవంతుల అవసరం, ఈ హాస్పిటల్ కెంతైనా వుంది. మీరు చివరిదాకా, యిక్కడే మాతోబాటే వుండిపోవాలి. ఇది నా అభ్యర్థన." ఆవేశంతో వొణికింది అతడి గొంతు.

దీప ఆశ్చర్యంతో చూస్తుండిపోయిం దతడిని. కారణం అతడిలో గాంభీర్యాన్నే తప్ప ఆవేశాన్నెప్పుడూ చూడలేదు యింతవరకు.

మరుక్షణమే తనేం మాట్లాడుతున్నదీ తెలిసివచ్చిం దతడికి. "సిస్టర్ ? ఐ యాం సారీ; అనాలోచితంగా ఏదేదో అనేశాను-మిమ్మల్ని శాసించే అధికారం నాకు లేదన్న విషయం మర్చిపోయి" అన్నాడు.

చిరునవ్వుతో దీప మొహం ప్రఫుల్లమైంది. మృదు స్వరంలో అంది – "డాక్టర్ ? మీరు అభిమానంతో శాసిస్తే నేను మీ ఆదేశాన్ని వినమ్రంగా స్వీకరిస్తాను, ఏదైనాసరే. ఎప్పుడైనాసరే; మన దేశంలో డాక్టర్లంటే ఎంత గౌరవ భావం వుందో, నర్సులంటే అంతకు రెట్టింపు చులకన భావం


**మూడు సంవత్సరాలుగా మమ్ముల ఆదరించి అభిమానిస్తున్న**

**మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషుల కివే మా దివ్య దీపాంజలులు**

గృహోపయోగకర వస్తువుల సరఫరాకు, సేవకు అంకితమై అందరి మన్ననలు పొందుతున్న సంస్థ

# మాడరన్ మార్కెటింగ్ ఎంటర్‌ప్రైజస్

**36, అబీద్ షాపింగ్ సెంటర్,**

(హోటల్ ఎమరాల్డ్ ఎదురుగా)

**హైదరాబాద్-500 001. ఫోన్ : 38577**

*డిస్ట్రిబ్యూటర్లు, స్టాకిస్టులు :*

పోలార్ ఫాన్లు, ఆల్విన్ రిఫ్రిజిరేటర్లు, హెలికార్డు వి బెల్టులు, విజయ్-నెల్కో అప్లయన్సులు,

సుమీత్ మిక్సర్లు, వోల్టేజి స్టెబిలైజర్లు-వగైరా.

వుంది. నర్సులు చేసేది మనవారి దృష్టిలో సేవకాదు—ఊడిగం. ఆమె మనిషికాదు...ఒక విలాస వస్తువు. నర్స్‌కి ప్రాణం లేదు. హృదయం లేదు. ఆమె సుఖదుఃఖాలూ, కన్నీళ్లూ ఎవరికీ అక్కర్లేదు. కారణం వారి దృష్టిలో ఆమె ఎన్నిక లేనిది. ఇవన్నీ తెలిసే ఈ వృత్తిని ఎన్నుకొన్నాను. ఈ కోర్స్ చదివే రోజుల్లోనే ఎన్నో నిర్ణయాలు తీసుకున్నాను. నా ఆశయాలన్నింటినీ సాధిస్తాను. ఈ వృత్తిలోని ఔన్నత్యాన్ని చాటి తీరతాను. ఏ ఆకర్షణ గానీ, ప్రలోభం కానీ, ఈ మార్గంనుండి నన్ను మళ్ళించలేదు."

"ఇంత చిన్నవయసులోనే గొప్పగా ఆలోచించి, యింతటి నిర్ణయాలను తీసుకొన్న నిన్ను మనసారా అభి నందిస్తున్నాను దీపా ! నీవు కోరుకునేవన్నీ సాధించాలనీ, నీవు నడిచేబాట సుగమం కావాలనీ మనస్ఫూర్తిగా ఆశీర్వ దిస్తున్నాను" అన్నాడు. అతడి స్వరంలో మార్దవం, అభిమానం, కలిసినా గంభీరంగా వుంది.

హఠాత్తుగా అతడి నోట తన పేరు వినటంతో, ఆమె హృదయం ఆ పిలుపులోని స్నేహమాధుర్యానికి పరవశించి పోయింది ఎదురు చూడని బహుమతిని అందుకోవటంలో గల ఆనందం ఎంతటిదో ఆ క్షణాన్నే తెలిసి వచ్చింది. నెమ్మదిగా తలెత్తి అత్యంత మధురంగా నవ్వి ''యిక వెళ్తాను డాక్టర్" అని తలుపుతీసుకుని గబగబా వెళ్ళి పోయింది.

* * *

డాక్టర్ కుమార్ పని ముగించుకుని యింటికొచ్చేసరికి, వుంటానన్న అరవింద లేదు. ఎగ్జిబిషన్‌కి ఏవేవో ఏర్పాట్లు చెయ్యాలనీ, చాలా పనివుందనీ అరుణతో చెప్పి, కాసేపు కూర్చుని వెళ్ళిపోయింది. మొహం కడుక్కుని వచ్చి, హాల్లో సోఫాలో కూర్చొని, టీపాయ్‌మీద కాళ్లు పెట్టుకుని, ఆవేళటి పేపర్లు చేతిలోకి తీసుకొన్నాడు. పది నిమిషాలు గడిచాయి. పేపరు పక్కకి తప్పించి యింట్లోకి చూశాడు. "అరుణ కేమైందివాళ ? ఇలా తీరిగ్గా కూర్చుంటే పక్కన వచ్చి కూర్చుని, ఓ రెండు మూడు నిమిషాలు దెప్పిపొడిచినా ఆ తర్వాత నెమ్మదిగా కబుర్ల లోనికి దిగేది. స్వయంగా కాఫీ, టిఫినూ పట్టుకొచ్చి కొసరి కొసరి తినిపించేది, ఆ తర్వాత మారాంచేసి షికారుకంటూ తనని బయలుదేరదీసేది. చాలా రోజులైంది అరుణని బయటికి పిల్చుకువెళ్ళి. ఇవాళా, రేపూ లాల్ బాగ్‌లో ఫ్లవర్ షో వుంది. అక్కడికి యిద్దరూ వెళ్ళి తర్వాత జుయెల్‌బాక్స్‌లోనైనా లేకుంటే స్విస్ కాటేజిలోనైనా భోంచేసి, రావాలని ప్రోగ్రాం వేసుకు వచ్చాడు.


దీపావళి శుభాకాంక్షలతో



ప్రతినెలా అదనపు సొమ్మును ఆర్జించేందుకు

సెంట్రల్ బ్యాంక్

నెలసరి వడ్డీ డిపాజిట్ పథకం

| మీరు డిపాజిట్ చేయవలసినది. | నెలలు 12 | 36 | 61 | నెలవారిగా మీకయే ఈ దిగువ ఖర్చులకు | రూ. |
| --- | --- | --- | --- | --- | --- |
| | ప్రతి నెలా మేమిచ్చే మొత్తము రూ. | రూ. | రూ. | | |
| రూ. 1,000 | 6.66 | 7.50 | 8.33 | ఎలక్ట్రిక్ బిల్లు | ☐ |
| రూ. 2,000 | 13.33 | 15·00 | 16.66 | స్కూల్ ఫీజులు | ☐ |
| రూ. 3,000 | 20.00 | 22.50 | 25.00 | లాండ్రీ బిల్లులు | ☐ |
| రూ. 4,000 | 26.66 | 30.00 | 33.33 | మందుల ఖర్చులు | ☐ |
| రూ. 5,000 | 33.33 | 37.50 | 41.66 | ఇతరత్రా అయే ఖర్చులు | ☐ |

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రజలకు అందుబాటులో అనువైన చోట్లలో గల బ్యాంక్

ఇదంతా ముందుగా అరుణకి చెప్పకుండా, డ్రెస్ చేసుకు రమ్మని చెప్పి, సిటీకి తీసుకెళ్ళి, హఠాత్తుగా సర్ప్రయిజ్ చేద్దామనుకుని వుత్సాహంగా "అరుణా; ఓయ్ అరుణా" అని కేకేశాడు.

లోపలినుండి "ఓ" అంటూ జవాబు విన్పించింది.

"ఏం చేస్తున్నావోయ్ యింకా, నేను వచ్చి అరగంట దాటినా? రా త్వరగా" అన్నాడు.

"ఆ! ఆ! వస్తాను" కొద్దిగా అసహనంగా ధ్వనించింది అరుణ గొంతు. సన్నగా నవ్వుకొంటూ, వెనక్కి వాలి కళ్లు మూసుకొన్నాడు; అరుణ వచ్చి బ్రతిమాలేదాకా కళ్ళు తెరవకూడదని నిశ్చయించుకొన్నాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. అరుణ జాడే లేదు. ఒకసారి వాచీకేసి చూసి, మళ్ళీ కళ్ళు మూసుకొన్నాడు. మరో పది నిమిషాలు గడిచాయి. ఆ తర్వాత జాజిపూల పరిమళమూ, ఇన్టిమేట్ సువాసనా గబుక్కున సోకటంతో అప్రయత్నంగా కళ్ళు తెరిచి చూశాడు. ఆగిపోయిన రిస్ట్ వాచ్‌కి కీ యిస్తూ గుమ్మంలో నుంచుని వుంది, అరుణ! జరీ బుట్టా వున్న తెల్లటి వెంకటగిరి చీర, తెల్లటి సిల్క్ జాకెట్, మెడలో ముత్యాలు, పచ్చలున్న నెక్లెస్ పెట్టుకొంది. భుజంమీద వ్రేలాడేలా జాజిమాలని పిన్నుతో పెట్టుకుంది. ఆశ్చర్యంతో అతడి కళ్ళు వెడల్పైనాయి. ఆ తర్వాత మెల్లిగా అతడి పెదవులు పల్చటి నవ్వుతో విచ్చుకొన్నాయి.

"నువ్వు డ్రెస్ అయ్యేటప్పటికి ఆలస్యం అవుతుందేమో ఎలాగా అనుకొంటున్నాను యిప్పుడే; గుడ్! నా మనసులో మాట యిన్నాళ్ళకి గ్రహించావు అరుణా. ఐ యాం వెరీ గ్లాడ్! ఇలా రా! ఒక్క రెండు నిమిషాలు కూర్చో నా పక్కని. తర్వాత నేను యింకో రెండునిమిషాల్లో బట్టలు మార్చుకుని వస్తాను. ఆ తర్వాత సిటీకి వెళ్ళి, ఏకంగా భోంచేసే వద్దాం! ఓకే ?? రా యిలా" అంటూ ఆప్యాయంగా అరుణవైపు చెయ్యి జాచాడు.

అరుణ ఆ చేతిని అందిపుచ్చుకోలేదు.

ఆమె ముభావానికి కారణమేమిటో అర్థంకాలే దాతడికి. విస్తుబోయి చూశాడామెని.

అంతలో అతి నిశ్శబ్దంగా, మెల్లగా వచ్చి ఆగింది ఓ కారు యింటిముందు. విసురుగా బయటికి వెళ్తూ "ఫ్లాస్కులో కాఫీ వుంది, త్రాగండి. నేను బయటికి వెళ్తున్నాను" అని గబగబా వెళ్ళి కారులో కూర్చుంది. ఉత్సాహమంతా ఆవిరై పోగా, అలాగే కూర్చుండిపోయాడు చాలాసేపటివరకూ డాక్టర్ కుమార్.


**In the service of the Road Transport**

YOU OWN THE VEHICLE
WE ADVANCE THE MONEY
AND
*Pay as you Earn*

**THE SAHAYAK FINANCE & INVESTMENT CORPORATION LIMITED.,**

Registered Office
**3-6-284, Himayatnagar, Hyderabad-500 001. Post Box No. 132**

*B. Sreenivasa Rao*
Managing Director

రాత్రి పది గంటలు కావస్తోంది. ఇల్లంతా చీకటిగా వుంది. బెడ్‌రూంలో జీరో బల్బ్ అయినా వేసుకోకుండా మంచంమీద దిండునానుకుని కూర్చుని, కిటికీలోనుండి బైట కురుస్తూన్న వెన్నెలవంకే చూస్తున్నాడు డాక్టర్ కుమార్. రాత్రివేళ తీరిగ్గా యిలా కూర్చుని రవిశంకర్ సితార్ సంగీతం అతి మంద్రస్థాయిలో వినటం అంటే అతడికి చాలా యిష్టం. హాల్లో వున్న రికార్డ్ ప్లేయర్లోనుండి సంగీతం, స్పీకర్స్‌ద్వారా బెడ్‌రూంలో విన్పిస్తోంది. అలిసిపోయిన అతడి శరీరాన్నీ, మనసునీ కూడా, నెచ్చెలి లాగా సేద తీరుస్తోందా సంగీతం.

క్రింద మళ్ళీ కారాగిన చప్పుడు, డోర్ తీసి వేసిన శబ్దం, "గుడ్ నైట్" అన్న అరుణ గొంతు. మెట్లమీద పాదాల ధ్వని. ఇవన్నీ ఒకదాని తర్వాత ఒకటి విన్పిస్తూన్నా అతడిలో ఏ చలనమూ లేదు. తలుపు తీసుకుని లోపలికొచ్చిన అరుణ ఒక్కసారిగా బెడ్‌మీద వాలిపోయింది.

చప్పున లేచి మంచం దగ్గరగా వచ్చి, "అరుణా! ఏమైంది? బట్టలైనా మార్చుకోకుండా పడుకున్నావేం? ఒంట్లో బాగాలేదా ? ఏమిటి చెప్పు ?" అని ఆత్రతగా అడిగాడు.

"ఏంలేదు; నిద్ర ! నిద్రొస్తూంది——పడుకొంటాను" అని మాత్రం అంది.

"నిద్రా ?? భోంచేసి పడుకుందువుగాని రా. ఇంకా నేనూ తినలేదు. నీకోసం వుండిపోయాను" అన్నాడు ఆమె భుజంమీద చెయ్యేసి లాలనగా.

జవాబు రాలేదు అరుణవద్దనుండి. అప్పటికే ఆమె కళ్ళు మూతలు పడిపోయాయి. నిద్ర పట్టేసిందనటానికి నిదర్శనంగా ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు క్రమబద్ధంగా విన్పిస్తున్నాయి. కొద్ది నిమిషాలు ఆమెనే తదేకంగా చూసి, తర్వాత ఆమెకి నిద్రాభంగం కలుగకుండా మెల్లగా రగ్గుకప్పి, దోమతెర దించి, భోజనం చెయ్యటానికి క్రిందికి దిగి వెళ్ళాడు.

*　　　*　　　*

నీలంరంగు బెనారస్ పట్టుచీర కట్టుకుని తల్లో ఒత్తుగా మల్లెపూలు పెట్టుకొని, పెళ్ళిపెద్దలాగా పందిట్లో అటూ యిటూ తిరుగుతూన్న దీప కేసి అమ్మలక్కలు కొందరు అయ్యో పాపం ! అన్నట్టు జాలిగా చూశారు. ఇంకొంత మంది వాళ్ళలో వాళ్ళు గుసగుసలు పోయారు. మరి కొందరు సంపాదిస్తూ, ఆఖరికి చెల్లి పెళ్ళికూడా చేసేస్తోందేనని ఈర్ష్యగా చూశారు. కానీ వీటన్నిటినీ గమనించే


*With best compliments from :*

**SRI RAMA & CO.,**

Esamiah Bazar,
HYDERABAD-500027.
Phone : 51828

PRINTERS, PROVIDERS & DISTRIBUTORS FOR J. B. A. PRINTING INKS PVT. LTD., MADRAS-DEALERS IN PRINTING MACHINES, CUTTING MACHINES, WIRE STITCHING MACHINES AND COMPLETE ACCESSORIES OF LEAD, LEAD RULES, SPACING MATERIALS ETC.

స్థితిలో లేదు దీప. ఎక్కడా ఏ లోటూ కన్పించకూడదని ముఖ్యమైన పనులన్నీ తనమీదే వేసుకుని, జాగ్రత్తగా అన్నీ సవ్యంగా జరిగేలా చూస్తూవుంది. పెళ్ళితంతు ముగిసింది. గోపీ, దీప ద్వారాని కిరువైపులా నుంచుని, వెళ్ళిపోతున్న వారికి కొబ్బరికాయ, తాంబూలం వున్న పాకెట్, కుంకుమ యిస్తున్నారు. పాకెట్ అందుకొంటూ అమ్మలక్కలు "మరి నీ పెళ్ళెప్పుడమ్మా" అంటూ సాగదీసారు, అలా అడగటం తమ విద్యుక్త ధర్మం అయినట్టు.

"ఆ ఘడియ వచ్చినప్పుడండీ !" అని చిరునవ్వు మొహంతో, ఏమాత్రం విసుక్కోకుండా చెప్పింది అందరికీ.

ఆ రాత్రి దీప చెల్లెల్ని అలంకరిస్తుంటే దీప ప్రక్కగా గోపీ వచ్చి కూర్చుని "అక్కా, నేను నేవీకి అప్లయి చేశాను. డిగ్రీ చదవాలని లేదు నాకు. అక్కడ రెండు సంవత్సరాలు ట్రెయినింగ్ యిస్తారట. ఆ తర్వాత అపాయింట్ చేస్తారు" అన్నాడు.

"తెలివిగా ఆలోచించి నీ భవిష్యత్తుని మలుచుకుంటున్నందుకు నాకు చాలా సంతోషంగా వుందిరా! ఇక అమ్మా, నాన్న నిశ్చింతగా వుండొచ్చు. నువ్వు తప్పక పైకి వస్తావు గోపీ," అంది దీప.

మరుసటిరోజు సాయంత్రం రైలుకి బయలుదేరుతూంది దీప. ఇంత హాయిగా గడిపాక వీళ్ళందరినీ ఒక్కసారిగా వొదిలిపెట్టి వెళ్ళటమంటే బెంగగా అన్పించింది. వెంకటలక్ష్మమ్మ పచ్చళ్ళూ, మిఠాయీ సీసాల నిండుగా సర్ది వుంచింది. ప్రయాణానికి వేళవుతూంటే, "అక్కా! ఓ రెండు నిమిషాలిలా లోపలికి రా" అంటూ దీపని పిల్చింది గదిలోకి యశోద.

"నీకో చిన్న ప్రెజెంట్ యిద్దామని పిల్చాను" అం: యశోద ఎర్రటి పుల్లిపొర కాగితం చుట్టివున్న పొట్లం దీప చేతిలో పెడుతూ.

"నాకు నువ్వు ప్రెజెంటివ్వట మేమిటి? అయినా యిప్పుడెందుకూ?"

"నా పెళ్ళి నీ చేతుల్తో జరిపించావు. ఆఖరుకి నీకు కుదిరిన పెళ్ళికొడుకుని కూడా యిచ్చేశావు! పైగా నేను దూరంగా వెళ్ళిపోతున్నాను కదా. అందుకే ఈ చిన్న కానుక యిస్తున్నాను. దీన్ని నాన్న డబ్బుతో కొని యిస్తున్నాననుకోకు. ఇది నా స్వార్జితం. ట్యూషన్లు చెప్తే వచ్చిన ఫీజుతో కొన్నాను. కాదనకు, ప్లీజ్" అంటూ అందంగా మెరిసిపోతున్న ఒంటి ముత్యపురాయి వుంగరాన్ని దీప వ్రేలికి తొడిగింది.

చెల్లెలి అనురాగానికి మనసు ఆర్ద్రమవగా నెమ్మదిగా యశోద శిరసు వంచి ముద్దుపెట్టుకుంది దీప.

Grams : 'ROYAL LABS'

Phone : 42533
42063

***With best compliments from***

**ROYAL LABORATORIES**

**Manufacturers of Pharmaceuticals**

**Chandulal Baradari, Hyderabad-500002 - A.P.**

A modern laboratory with quality control
for manufacture of specialities, tablets,
injectables, galenicals etc.

అందరూ వచ్చారు స్టేషన్‌కి. రైలు కదలబోయేముందు మాధవయ్య అన్నాడు, "నేనూ, మీ అమ్మా, యిద్దరం బాధపడుతున్నదల్లా నీ గురించేనమ్మా. మేము యిక బ్రతికి నన్నాళ్ళు బ్రతకం కదా ! త్వరగా నువ్వో యింటిదానివి కావాలి. అప్పుడే మాకు నిశ్చింత. ఈ ఏడాదైనా మా ముచ్చట తీర్చాలి నువ్వు. వెళ్ళగానే ఉత్తరం రాయి. నీ ఆరోగ్యం జాగ్రత్త తల్లీ."

* * *

ఇక ఎగ్జిబిషన్‌కి నాలుగురోజుల వ్యవధి మాత్రం వుంది. అన్ని క్లబ్బులకీ, సేవాసంస్థలకీ, పురప్రముఖులకూ ఆహ్వానాలు వెళ్ళాయి. ఆ సమయంలోనే రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ వుంది బెంగుళూర్లో. ఈ కాన్ఫరెన్స్‌కి ఎన్నెన్నో వూళ్ళనుండి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఇతర రంగాల లోని ప్రముఖులు చాలామందే వస్తారు. కాన్ఫరెన్స్ బ్రేక్ వున్న సమయంలో, వాళ్ళని ఈ ఎగ్జిబిషన్‌కి పిల్చుకు వచ్చి చూపిస్తే బాగుంటుంది. పైగా అది సేవా సంస్థ కూడాను వాళ్ళలో ఎవరైనా ఈ చిత్రాలు కొనవచ్చు కూడాను, అని ఆలోచించి రోటరీ గవర్నర్‌ని కలుసుకొని ఈ మాట చెప్పాలని, దీపని వెంటనే రమ్మనమని కబురుపంపింది అరవింద.

హాస్పిటల్ వున్న ప్రాంతంలో షాపులేవీ లేవు. అందుకే సిటీ కెవరైనా వెళ్తున్నారంటే వాళ్ళచేత కావల్సినవన్నీ తెప్పించుకొంటూంటారు నర్సులూ, డాక్టర్లూ కూడా. ఆ వేళ దీప సిటీకి వెళ్తూందని తెలిసి కుసుమ డబ్బు తెచ్చి యిస్తూ, "దీపా; కమర్షియల్ స్ట్రీట్‌లో మంచి వూల్ దొరుకుతుంది. 'బ్లూ షాప్'లో గానీ 'గ్రీన్ షాప్'లో గానీ లేత నీలం కలర్‌ది గానీ, గోల్డ్ కలర్‌దిగానీ తెచ్చిపెట్టు" అని హడావిడిగా వెళ్ళిపోయింది డ్యూటీకి.

బయలుదేరబోతూ, గదికి తాళం వేస్తూన్న దీపకి హఠాత్తుగా గుర్తొచ్చింది, తాను కుసుమని ఎన్ని గ్రాముల వూల్ కావాలో అడగలేదని. సరే బస్ రావటాని కింకా టైంవుంది కాబట్టి హాస్పిటల్‌కి వెళ్ళి కుసుమని కనుక్కొని వెళ్దామని బయలుదేరింది. హాస్పిటల్లో ఎవరో చెప్పారు కుసుమ జయరాం వెంట రౌండ్స్‌కి వెళ్ళిందని.

జనరల్ వార్డ్‌లో గుమ్మం ప్రక్కగానున్న బెడ్‌పక్క నుంచుని ఆ పేషెంట్ తాలూకు చార్ట్ చూస్తున్నాడు డాక్టర్ జయరాం. అతని ప్రక్కనే కుసుమ నుంచుని ఏదో చెప్తూందతడికి. ఎలా వెళ్ళి అడగటం కుసుమని? ప్రక్కనే మరెవరో కాదు, జయరాం వున్నాడు. ఆ రోజు లిఫ్ట్ యిస్తానన్నప్పుడు తిరస్కరించినప్పటినుండీ అతను తన




మీద కోపంగానే వున్నాడు. ఇప్పుడు వెళ్తే తనని అవమానించక వొదిలిపెట్టడు యింతమంది ఎదుట. ఏం చెయ్యటమా అని రెండు మూడు నిమిషాలసేపు తటపటాయించి, గోడకానుకుని నుంచుంది. ఆ తర్వాత వాచ్ చూసుకుంది. ఇక ఆట్టే టైంలేదు బస్ రావటానికి. 'ఇటు చూస్తే నన్నా బావుండేది; నెమ్మదిగా చేత్తో సైగ చేసి పిలవొచ్చు' అనుకొంటూండగా, ఏ దేవతో కరుచినట్టు జయరాం, "సిస్టర్! గెట్ మి ఎ టంగ్ డిప్రెస్సర్" అన్నాడు కుసుమని.

కుసుమ ఇవతలికి రాగానే, "ఏయ్ కుసుమా, ఇందాకటి నుంచీ వెయిట్ చేస్తున్నాను నీకోసం. ఏ రకం కావాలి వూల్? ఎన్ని గ్రాములు కావాలి? చెప్పు" అంది.

గబగబా చెప్పేసి లోని కెళ్ళిపోయింది కుసుమ. మర్చిపోకుండా వుండటానికి పర్స్ తీసి కాగితంమీద ఆ కంపెనీ పేరూ, ఎన్ని గ్రాములు కావల్సిందీ రాసుకుంటూన్న దీపకి హఠాత్తుగా కేకలు విన్పించాయి వార్డ్‌లో! ఆఖరి బెడ్‌మీద గోడవారగా పడుకుని వున్న ఒక పాతికేళ్ళ స్త్రీ ఏదేదో గట్టిగా అరుస్తోంది. ఇలాటి ఆరుపులూ, కేకలూ, ఏడ్పులూ ఆ వాతావరణంలో కొత్తేమీ కావు. అయినా ఎవరో పట్టుకుని ఆపినట్టుగా, నుంచున్నచోటే ఆగిపోయింది దీప.

లేని ఓపికని బలవంతాన తెచ్చుకొంటూ, మంచం అంచుని గట్టిగా పట్టుకుని, అతి కష్టంమీద ఆయాసపడ్తూ మాట్లాడ్తోందా మనిషి. "దుర్మార్గుడా! నువ్వుకూడ డాక్టరువా? నన్ను నిలువునా ముంచింది చాలక, యిక్కడ వేషం మార్చుకుని యింతమంది ప్రాణాల్తో చెలగాట మాడుతున్నావా. నీచుడా ? నువ్వు ద్రోహివి ... దొంగవి. నీ ఆటలు సాగనివ్వను. నీ బ్రతుకుని బజారు కీడుస్తాను... నీ అంతు చూడందే నిద్రపోను ... కుక్కచావు చావాలి నువ్వు! నరకయాత ననుభవించి దిక్కులేని చావు చావాలి నువ్వు..." అంటూ అరుస్తూ, మధ్య మధ్యలో ఏడుస్తూ వుంది. జుట్టంతా రేగివుంది. జ్వరతీవ్రతకి ఎర్రబడ్డ కళ్ళు, కోపంతో మరింత ఎర్రగా, అగ్నిగోళాల్లాగా మెరుస్తున్నాయి. పిచ్చిగా, ఆవేశంతో వూగిపోతూ అరుస్తోందింకా.

ఆ కేకలు వినిపిస్తూన్న వైపుకి రెండడుగులు వేసి, త్రాచుపాముని చూసినట్లుగా త్రుళ్ళిపడ్డాడు జయరాం! ఒక్కసారిగా అతడి మొహం పాలిపోయింది...గుండె వేగంగా కొట్టుకోసాగింది...నిలువెల్లా చమటలు పట్టేశాయి. అయినా వెంటనే తమాయించుకున్నాడు. చిరునవ్వు మొహంనిండా పులుముకుని, అతి శాంతస్వరంతో ఆ

PROTECT VALUABLES
with

Nayastrap ®

NAYASTRAP PVT. LTD.
Manufacturers of Polyproplyne Strapping Bands
Masab Tank, Hyderabad-28
Tel: 38418

A Joint Venture With APSSIDC Ltd.

పేషెంట్ ప్రక్కన కూర్చొన్న మనిషి నుద్దేశించి, "చూడండి మామ్మగారూ! మీ అమ్మాయికి జ్వరం చాలా తీవ్రంగా వుంది. అలాంటప్పు డీ పలవరింతలు మామూలే! మీరేం గాభరాపడకండి. ఆవిడని సముదాయించి పడుకోబెట్టండి. ఈలోగా నేను మందూ, నిద్రకి యింజెక్షనూ పంపిస్తాను. వెంటనే సర్దుకుంటుంది,'' అనేసి గబగబా యింకో బెడ్ దగ్గరి కెళ్ళిపోయాడు తిరిగైనా చూడకుండా.

"అలాగే బాబూ, ఆ మందేదో త్వరగా యిచ్చి పంపించు నాయనా. ఎంత జ్వరంవచ్చి ఒళ్ళు పేలిపోతున్నా, మాటాపలుకూ లేకుండా, మంచాని కంటుకుపోయి పడు కున్నదేతప్ప ఎప్పుడూ యిలా గొడవచేసింది కాదు. ఇదేం మాయదారి జ్వరమో; యిలా పూనకం వచ్చినదాన్లా అరు స్తోంది. దాని మాటలకి నువ్వేమీ మనసు కష్టపెట్టుకోకు బాబూ; క్షమించు. జ్వరం త్వరలో తగ్గిపొయ్యేలా మందివ్వు తండ్రీ," ముసలావిడ చేతులు జోడించి, జయరాంని ప్రాధేయపడుతూంది.

వార్డ్‌లో పేషెంట్లూ, వాళ్ళ తాలూకు వాళ్లూ ఈ దృశ్యాన్ని వింతగా చూడసాగారు. రోజూ గంటసేపు పట్టే రౌండ్స్‌ని యిరవైనిమిషాల్లోనే ముగించుకుని వెళ్ళి పోయాడు హడావిడిగా జయరాం.

టంగ్ డిప్రెస్సర్ పట్టుకువచ్చిన కుసుమ యింకా దీప అక్కడే నుంచుని వుండటం చూసి, ''అరె! యింకా వెళ్ళ లేదూ నువ్వు ? అప్పుడే వెళ్ళిపోతానన్నావుగా'' అంది.

"ఉష్ మాట్లాడకు,'' అతి తగ్గు స్వరంతో అని గోడ వార పేషెంట్‌ని చూడమన్నట్టు సైగచేసింది.

ఆ యువతి పక్కనే మంచంమీద కూర్చుని, నుదుటి మీద పడ్డ జుత్తుని సవరిస్తూ, కొంగుతో చెమటని అద్దు తూంది ముసలావిడ.

ఆవిడ చేతిని గట్టిగా పట్టుకొంటూ, "అమ్మమ్మా! నన్ను వెంటనే తీసుకెళ్ళిపో యిక్కడినుండి. నాకు భయంగా వుందమ్మమ్మా. ఆ రాక్షసుడు నన్ను చంపేస్తాడు. వెంటనే వెళ్ళిపోదాం. యింకొక్క క్షణం కూడా వుండొద్దు. వాడు దొంగ అమ్మమ్మా. నీకు తెలీదు. వాడినీ, వాడి మాటల్నీ నమ్మకు. తియ్యగా మాట్లాడి నన్ను నాశనం చేశాడు...ఎలా చెప్తే మీ కందరికీ అర్థమవుతుంది; అయ్యో భగవంతుడా..." అంటూ మళ్ళీ ఏడవసాగింది.

"రత్నా ! వూరుకో తల్లీ. నీ జ్వరం తగ్గనీ. వెంటనే వెళ్ళిపోదాం. పడుకోమ్మా. గొడవ చెయ్యకు" అంటూ ఓదారుస్తోంది ఆ పిల్ల అమ్మమ్మ.

అంతవరకూ కాళ్ళూ చేతులూ విదిలిస్తూ, ఏడుస్తూ, రొప్పుతూన్న రత్నకి, నర్స్ యింజెక్షన్ యివ్వటంతో క్రమంగా మగత ఆవరించింది. కేకలు వెక్కిళ్ళుగా మారాయి. చిన్నపిల్లలాగా సన్నసన్నగా వెక్కుతూ నిద్రలోనికి జారుకొంది.

* * *

కార్తీకనే అయినా, యింటింటికి ఎండలో తిరగటంవల్ల చాలా అలసటగా వుంది దీపకి. ఆమె స్నానం చేస్తూంటే హడావుడిగా వచ్చింది కుసుమ.

"నాకేం చెయ్యాలో తెలీటంలేదు దీపా, ఏమిటో భయం భయంగా వుంది. చూశావా ఎంత మోసమో ... డాక్టర్ జయరాం..."

"ఏం చేశాడు డాక్టర్ జయరాం ?" ఆత్రంగావుంది దీప కంఠం.

"అతడు...అత డసలు డాక్టరేకాడట! యం.బి.బి.యస్. కాదుగదా, ఆఖరుకి గ్రాడ్యుయేట్ కూడా కాడట !"

"ఆ !" ఆశ్చర్యంగా అరిచింది దీప.

"భయంతో నేనొకప్రక్క ఛస్తూంటే ఏమిటా అరుపులు?? విను నెమ్మదిగా; ఇదేమాత్రం బయటికి పొక్కినా కొంప లంటుకుంటాయి" అంది కుసుమ బెదురుచూపులు చూస్తూ.

"ఎవరు చెప్పా రీ విషయం నీకు ? నిజమేనా కుసుమా ? ఎలా నమ్మటం ?"

"రత్న అనే పేషెంటు లేదూ ? మనం ప్రొద్దున చూశామే; ఆ అమ్మాయి నన్ను పిల్చి, దగ్గర కూర్చోబెట్టు కుని కథంతా చెప్పింది."

"ఆ మనిషి చెప్పిన వార్తా యిది ? డెలీరియంలో వున్న మనిషి మాటల్ని ఎలా నమ్మావు కుసుమా ?"

"డెలీరియం అని ఎవరన్నారు ? కాలుకి తగిలిన దెబ్బ సెప్టిక్ అయితే జ్వరం వచ్చిందంతే. నిన్న సాయంత్రం డ్రెస్‌చేసి పెన్సిలిన్ యివ్వటంతో జ్వరం, నొప్పి రెండూ తగ్గిపోయాయి. తేలికగా, మామూలు మనిషిలాగే మాట్లాడు తోంది. పైగా ఒకరిద్దరి పేర్లు, ఎడ్రస్‌లు యిచ్చి ఈ విషయం నిజమో కాదో కావలిస్తే కనుక్కోమంది.

హైద్రాబాద్‌లో ఒక ప్రఖ్యాత డాక్టర్ దగ్గర జయరాం డ్రైవరుగా పనిచేస్తూండేవాడట. ఆ డాక్టర్ తల్లీ దండ్రీ లేని యితడిని చేరదీసి స్కూల్ ఫైనల్‌దాకా చదువు చెప్పించా డట. చదువుకొనే రోజుల్లో, సాయంత్రాలు డిస్పెన్సరీకి వెళ్లి అక్కడ పేషెంట్లని వరుసగా కూర్చోబెట్టటం, చీటీలు తీసిచ్చి, వాళ్ళని వరుసగా లోపలికి పంపించటం యిలాటివి చేసేవాడట. ఆ తర్వాత చిన్న చిన్న గాయాల్ని కడగటం, మందులు రాసి కట్టుకట్టటం నేర్చుకున్నాడట. ఎప్పుడైనా

కాంపౌండర్ రాకపోతే, సీసాలమీద పేర్లుచూసి మందులు కూడా కలిపి యిచ్చేవాడట. ఇలాగే ఒక్కొక్కటే నేర్చుకుని యింజెక్షన్లివ్వటం కూడా మొదలుపెట్టాడట. కొద్ది రోజులకి డాక్టర్‌గారికి ప్రాక్టీస్ బాగా పెరగటంతో కారు కొన్నారు. డ్రైవర్‌గా ఎవర్నో పెట్టుకోవటం ఎందుకని జయరాంకి డ్రైవింగ్‌కూడా నేర్పించారట. అతడికి రోజులో చాలాభాగం డాక్టర్‌గారి దగ్గరే గడిచిపొయ్యేది. అసలే చురుకైన బుర్ర, యిహ యిరవైనాలుగ్గంటలూ వినటం, చూడటంతో, వైద్య విషయాలన్నీ యిట్టే గ్రహించేశాడు. ఇలా పదేళ్ళు గడిచాక, బాగా అనుభవం సంపాదించి హఠాత్తుగా పరారి అయ్యాడు జయరాం!"

"దొంగతనంలాంటి దేమైనా చేశాడా?" కుతూహలంగా అడిగింది దీప.

"రత్న డాక్టర్‌గారింట్లో పనిచేస్తుండేదిట, వాళ్ల పిల్లలకి ఆయాగా. తల్లిలేదు పాపం. తండ్రి కూడా రత్న, వీళ్ళింట్లో పనికి కుదిరిన కొన్నేళ్ళకి చనిపోయాడు. కాబట్టి రత్న రాత్రింబగళ్లు డాక్టర్‌గారింట్లోనే వుండేది. భార్యా భర్తలిద్దరూ మంచివారవటంతో రత్నని అభిమానంగా చూచుకొనేవారు. నెమ్మదిగా జయరాం, రత్నతో ప్రణయకలాపాలు మొదలుపెట్టి, పెళ్ళిచేసుకొంటానని నమ్మించాడట. అప్పటికీమెకి మూడోనెల. పారిపోటానికిక రెండ్రోజులుందనగా రత్నచేత ఏవో మాత్రలు మింగించాడు. ఆమెకి రక్తస్రావమధికమై చనిపొయ్యే స్థితికి వచ్చింది. అప్పుడు డాక్టర్‌గారే ఆమెకి చికిత్సచేసి బ్రతికించారు. ఆ తర్వాత జయరాంని బాగా చీవాట్లేసి, ఆ నెలలోనే యిద్దరికీ పెళ్ళి నిశ్చయించారట. కానీ ఆ రాత్రికి రాత్రే మన హీరో ఆ వూరు దాటేశాడు! ఇక ఏంచెయ్యాలో తెలీక నానా అవస్థలూ పడి ఓ రెండోపెళ్ళివాడిని కుదిర్చి, రత్ననిచ్చి చేశారు. పెళ్ళయిన నాలుగేళ్ళకి అతడూ పోయాడు. ఆ తర్వాత రత్న వాళ్ళ అమమ్మదగ్గరే వుంటూ, మిషన్ కుట్టుకుని జీవితం గడుపుతోంది. ఈ రోజు జయరాంని యిన్నేళ్ళతర్వాత చూడటంతో మానిపోయిన గాయం మళ్ళీ రేగింది. ఇదంతా ఇంకా వొట్టిదే అనుకుంటున్నావా యింకా? నీకు నమ్మకం కలగటంలేదూ రత్న మాటల్లో? ఎంతకైనా సమర్థుడే జయరాం. ఆ పిల్లని చూసి, ఆ కేకలు విని కూడా ఎంత అమాయకంగా, ఏమీ ఎరగనట్టే వున్నాడో చూశావా? ఇహ ఇక్కడకూడా ఎన్ని అఘాయిత్యాలు తలపెడ్తాడో??"

"ప్రస్తుతానికి ఏమీ తెలియనివాడిలాగేవున్నా లోపల్లోపల ఎన్ని పథకా లల్లుతోందీ ఎవరికి తెలుసు?" అనుమానంగా అంది దీప.

"ఇలాంటి గోముఖవ్యాఘ్రా లేమైనా చేస్తారు. ఇతడినో కంట కనిపెట్టి వుండటం మంచిది దీపా."

"ముఖ్యంగా రత్నని ... తన గుట్టు బయటపెట్టేసిందన్న కసితో ఏమైనా చేస్తాడేమో" అంది దీప ఆదుర్దాగా.

"మరి ఈ విషయం డాక్టర్ కుమార్‌కి ఎలా చెప్పాలి? తెలిసీ ఊరుకోవడం కూడా బాగుండదు. సూపరింటెండెంట్ కదా ఆయన? మరి ఆయన కిలాంటి విషయాలు తెలియకపోతే ఎలా?"

"ఇప్పుడిప్పుడే చెప్పాలంటావా: ఋజువులేంది ఏమని చెప్పగలం కుసుమా?"

"మనం ఋజువుచెయ్యగలమనే అనుకొంటున్నావా? ఈలోగా ఏమేం పథకాలల్లుతాడో? ఎన్ని ఎత్తులు వేస్తాడో?"

"ఆ పిల్లని పూర్తిగా కోలుకోనిచ్చి, ఆ తర్వాత అన్ని ఋజువులూ సేకరించి, వీడి గుట్టంతా బయటపెట్టేద్దాం. అంతవరకూ ఏమీ తెలియనట్టే నటిద్దాం మనం కూడా" అంది దీప.

* * *

"మీ అందం రోజురోజుకీ ద్విగుణీకృతమవుతోంది అరుణాదేవీ! వన్నె ఎక్కుతోంటే వయసు తరుగుతోన్నట్టనిపిస్తోంది. మిమ్మల్ని కొత్తవాళ్ళెవరైనా చూస్తే ఏ కాలేజీ అమ్మాయో అనుకుంటారే గాని, పెళ్ళయిన స్త్రీ అనుకోరు. ఏమంటారు?? మిమ్మల్ని మీరు పరీక్షగా ఎప్పుడైనా అద్దంలో చూసుకొన్నారా ఈ మధ్య?" చిలిపిగా నవ్వుతూ, అడిగాడు జయరాం.

వాళ్ళిద్దరూ తప్ప మరెవ్వరూ లేరు ఆ ఏర్‌కండిషన్డ్ రూంలో. పువ్వుల రాశిలా మెత్తగా వున్న ఫోం కుషన్ కుర్చీలో కూర్చొని ఆపిల్‌జ్యూస్ ఒక్కొక్క గుక్కే చప్పరిస్తోంది అరుణ. ఇద్దరికీ మధ్య టేబిల్‌మీద బంగారులా మెరుస్తూన్న ఇత్తడి యాష్‌ట్రే — శరీరం చుట్టగా చుట్టుకొని పడగ పైకెత్తిన నాగుపాము ఆకారంలో వుంది. దాని కళ్ళ కమర్చిన ఆకుపచ్చరాయి వుండి వుండీ మెరుస్తోంది. గది లోపలి గోడలు కన్పించకుండా లేత గులాబీరంగు సిల్కు తెరలు నాలుగువైపులా వ్రేలాడుతున్నాయి. ఫాల్స్ సీలింగ్‌కి అమర్చబడ్డ బల్బులోనుండి లేత కాంతి క్రిందకి జారుతూంది...అరుణ చేతులు జ్యూస్ వున్న గ్లాసునిసైతం పట్టుకోటానికి శక్తిలేనట్టు సన్నగా కంపిస్తున్నాయి. ఎప్పుడూ లేనంత బద్ధకంగా, నీరసంగా అన్పిస్తోంది అరుణకి. అక్కడ అంత సేపటినుండి కూర్చుని ఉన్నా ఆమె మనసుమాత్రం ఎక్కడో ఉంది. ఇదివరకూ

యిలా షికార్లకీ, రెస్టారెంట్లకీ, సినిమాలకీ తిరగటమంటే మహా ఇష్టంగా వుండేది. అంతకు మించిన జీవితపరమార్థం ఇంకేమీ లేనట్టనిపించేది. ఏదో వెర్రి ఆనందం ముంచెత్తేసేది. కానీ రానురాను ఇలాటి జీవితమంటే విసుగనిపించ సాగింది. ఇలా ఇల్లూ, భర్తా పట్టనట్టు తిరగటమంటే ఏమిటో తప్పుచేస్తున్నట్టుగా అన్పించసాగింది. రాత్రిళ్లు పడుకున్నప్పుడు గానీ, పనిలేకుండా ఖాళీగా కూర్చున్న సమయాల్లో గానీ తనమీద తనకే ఏవగింపు, కోపం వచ్చేవి. కానీ ఏదో బలహీనత — జయరాంని చూడగానే అన్నీ మర్చిపోయి మంత్రముగ్ధలాగా అతడివెంట నడిచివెళ్ళి కారులో కూర్చునేది. ఇవాళ జయరాం తనెదుటే వున్నా శూన్యంలోకి చూస్తూ, ఏదో ఆలోచిస్తూంది అరుణ. చాలాసేపటికి ఈ లోకంలోని కొచ్చి "ఆ! ఏమిటన్నారూ ?" అంది.

"చూశారా; నేనింతసేపూ మీ అందాన్నిగూర్చి మెచ్చుకొంటూంటే వినకుండా ఎటో చూస్తూ, ఏదో ఆలోచిస్తున్నారు, మీ లోకంలో మీరుండిపోయి. ఇంతకీ ఏమిటది ? తెలుసుకోవచ్చా ??"

"ఏమిటోనండీ ఎప్పుడూ లేనంత దిగులుగా, నిరాశగా అన్పిస్తూం దీమధ్య. జీవితమంటే ఇంతేనా అన్పించి ఎటైనా పారిపోదామా అన్పిస్తూంటుంది."

"ఛీ, ఛీ; మీరేనా ఇలా మాట్లాడటం ? మీ సంతోషం కోసం నేను పడుతూన్న శ్రమంతా వ్యర్థమైనట్టేనా ? ప్చ్ ! ఆ ఓటమి మీది కాదు అరుణాదేవీ ... నాది ! నేనే పారిపోవాలి ఎటైనా" అన్నాడు ఎక్కడలేని దైన్యం గొంతు నిండా నింపుకుని.

పశ్చాత్తాపం గుండెల్ని నొక్కేస్తూంటే వచ్చే నిట్టూర్పుని అణచుకొంటూ, నెమ్మదిగా తలెత్తి అతడి కళ్ళలోకి చూసింది ఒకటి రెండు నిమిషాలసేపు. ఆ కళ్ళలో కదులాడుతూన్న అమాయకత్వాన్నీ, వేదననీ ఎదుర్కోలేక తలదించుకున్నాడు, వెంటనే జయరాం.

"ఆ ! అన్నట్టు మీరిస్తున్న ఆ మందు—అదే; ఆ మాత్రల పేరేమిటండీ ?" అడిగింది అరుణ.

"ఏం ? అంత బాగా పనిచేస్తున్నాయా అవి ?" అడిగాడు కుతూహలంగా.

"ఆల్కహాల్ వాసనంటే నా కసహ్యం. అందుకే ఎంత బాధగా వున్నా ఎప్పుడూ దాని జోలికి పోలేదు. కానీ యివి తీసుకున్నాక శరీరం దూదిపింజలా తేలిగ్గా అన్పిస్తోంది. మనసులో బరువు కూడా ఆవిరైపోయి, ఎక్కడో రంగు రంగుల లోకాల్లోకి ఎగిరిపోతున్నట్టు, అనుభూతి కలుగుతూంది. ఎంత హాయి! ... ఎంత ప్రశాంతత డాక్టర్ ! పువ్వులా తేలికైపోయిన ఈ శరీరం అలా...అలా... తేలిపోయి ఆనందపు టంచుల్ని చేరుకోగానే సంగీతంలోని రాగాల్ని చూస్తున్నట్టూ, ఇంద్రధనుస్సులోని సప్తవర్ణాలని వింటూన్నట్టూ ఓ విచిత్రమైన భ్రాంతి కలుగుతుంది ! నిజాని కది అనుభవించాలే కానీ నోటితో చెప్పటం అసాధ్యం. ఆ ! ఇంతకీ వాటి పేరేమిటి డాక్టర్ ? చెప్పండి !"

"పెల్‌డోనా !" కానీ ఈ విషయం మీ వారికి తెలిసిందంటే ఈ మాత్రం సుఖశాంతులు కూడా దక్కవు మీకు. మీ మేలు కోరే చెప్తున్నాను" అన్నాడు ఎంతో ఉపకారం చేసిపెడ్తున్నవాడిలాగా.

"పెల్‌డోనా... పెల్‌డోనా !" అంది మంత్రాన్ని జపిస్తున్నట్టుగా అరుణ, అతి మెల్లగా.

* * *

రాత్రి చాలా పొద్దుపోయింది. పేషెంట్లందరూ నిద్రలో మునిగి ఉన్నారు. నల్లటి తారుముద్దలాగా వుంది చీకటి. దూరాన జొన్నచేలలో నక్కలు ఊళపెట్టటం వికృతంగా విన్పిస్తోంది. మేఘావృతమైన ఆకాశం వుండి వుండీ గర్జిస్తోంది భయంకరంగా. మూసివున్న గాజుకిటికీలను గాలి విసురుగా తాకుతూంటే ఆ చప్పుడు దయ్యం వదుల్తూన్న నిట్టూర్పులాగా వుంది. ఇలాటి సమయాల్లో కరెంటుపోయి లైట్లారిపోతాయని దీప లోపలికి వెళ్ళి కొవ్వొత్తుల పాకెట్ కోసం వెతకసాగింది. వెనకాల ఎవరో నుంచున్నట్టు అన్పించటంతో గిరుక్కున తిరిగి చూసింది. మొరటుగా, వికృతంగా వున్న మనిషొకడు దీపకి ఓ అడుగుదూరంలో నుంచుని, ఆమెనే చూస్తున్నాడు. వాడి నలా చూడగానే దీపకి భయంతో గుండె లయ తప్పింది. ఓ రెండు నిమిషాల తర్వాత తనను తాను సంబాళించుకొని ధైర్యంగా "ఎవరు నువ్వు" అంది కఠినస్వరంతో.

"డాక్టర్ జయరాం మనిషిని" అన్నాడు పొగరు మోతుగా, అదేదో పెద్ద క్వాలిఫికేషనన్నట్టు.

"ఇక్కడేం పని నీకు ?" అంది.

"డాక్టర్ జయరాం పిలుస్తున్నాడు నిన్ను" అన్నాడు తలెగరేస్తూ.

"సరే పద; వస్తున్నాను" అని వాడు వెళ్ళిపోయిన ఓ అయిదు నిమిషాలకి డాక్టర్ జయరాం గదికేసి నడిచింది.

తన గదిలో బీరువాలో ఏదో సర్దుతూ నుంచుని వున్నాడు జయరాం. ఆ బీరువాలో సర్దటానికి పెద్దగా వస్తువులంటూ ఏవీ లేవు, టానిక్ సీసాలు తప్ప. దీప

రావటం చూసి, వెనుకకు తిరిగి చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వులో పలకరింపుకన్నా, విషపు పాలే ఎక్కువగా వుంది. కూర్చోమన్నట్టు సైగచేసి, తలుపులు రెండూ దగ్గరగా లాగి గడియపెట్టాడు.

ఈ అర్ధరాత్రివేళ ఈ నాటకాలేమిటోనని ఓ ప్రక్క బిక్కు-బిక్కుమంటూనే వున్నా మొహంలో లేని గాంభీర్యం నటిస్తూ కూర్చుంది దీప. అల్మారా లోపలినుండి ఒక పాకెట్ బయటికి తీసి, నిర్లక్ష్యంగా నవ్వుతూ అందించాడు దీపకి.

ఆ నవ్వు కంపరంగా అన్పించినా చేసేదేమీలేక ఆ పాకెట్‌వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

"తీసుకో; ఇది నీకే !" అన్నాడు జయరాం.

" ఏమిటది ? నాకెందు కిస్తున్నారు ?" అంది ఆశ్చర్య పోతూ.

"ఏమిటా ? నోట్ల కట్టలు ! దొంగనోట్లేం కావులే. భయపడకు. తీసుకో ... తీసుకుని నువ్వు విన్నదంతా మర్చిపో !" ఆజ్ఞాపిస్తూన్న స్వరంతో అన్నాడు.

స్ప్రింగ్‌లాగ ఒక్క ఉదుటున లేచి నుంచుంది దీప. అసహ్యంతో చూసిందాతడివైపు.

చెప్పసాగాడు జయరాం– "రత్న ... అదే ఆ పేషెంట్ నా గూర్చి కుసుమతో ఏదేదో వాగిందట కదా ? మీరిద్దరూ ఆ సంగతులు మాట్లాడుకొంటూంటే అంతా విని లీల నా కొచ్చి చెప్పింది !" గర్వంగా అన్నాడు.

"అందుకని...?"

"భయపడక్కు ! నేను నిన్నేమీ చెయ్యను. నువ్వు నేను చెప్తున్నది విని 'ఊ' అన్నావంటే మన అందరి బ్రతుకులూ బంగారం అవుతాయి."

"అందరివా ? అంటే ?" అయోమయంగా అతడినే చూస్తూ అంది దీప.

"చెప్తాను విను. ఇంతవరకూ వచ్చాక యిక దాచటం అనవసరం. ఇదిగో యితడు నా కుడిభుజం. ఒకరకంగా ఏజెంట్ అని చెప్పుకోవచ్చు. పేషెంట్లని గేటుదగ్గరే ఆపి, వాళ్ల దగ్గర నా డిగ్రీల్ని గూర్చీ, నా హస్తవాసిని గూర్చీ పొగిడి వాళ్లని హాస్పిటల్ లోపలికి వెళ్లనివ్వకుండా, తిన్నగా మా యింటికి తీసుకువస్తాడు. నేను డ్యూటీలో వుంటే అప్పుడు డాక్టర్ ప్రభాకర్ చూస్తాడు వాళ్లని. అందరికీ ఈ పద్ధతి లాభదాయకంగానేవుంది. ఈ ఏర్పాటూ ఈ ఐడియా కూడా నాదే ! అందుకే వరదలా వచ్చిపడు తోంది డబ్బు! ఇకముందు నువ్వు కూడా మాతో సహకరిం చావంటే..."

"షటప్ జయరాం! యూ హావ్ టాక్‌డ్ యినఫ్" అని రౌద్రంగా అతడివైపు ఓ క్షణంసేపు చూసి, ఆ తర్వాత నెమ్మదిగా, ఠీవిగా, మహారాణిలాగా నడిచి వెళ్లి, గడియ తీసి మరొకసారి పాలిపోయిన జయరాం మొహంలోకి ఏవ గింపుగా చూసి వెళ్లిపోయింది దీప. నిశ్చేష్టుడై చూస్తుండి పోయా డామెనే జయరాం.

* * *

టౌన్‌హాల్ రంగుకాగితాల్తో, పువ్వుల్తో అలంకరింపబడి వుంది. లోపల విశాలమైన హాల్లో అక్కడక్కడా వెల్తురు బాగా ప్రసరిస్తున్న చోట్లలో అరవింద చిత్రాలు తగిలించ బడివున్నాయి. తైలవర్ణ చిత్రాలు, జలవర్ణ చిత్రాలు ఒక దానితో నొకటి పోటీపడుతున్నాయి. సామాన్యంగా చిత్రంయొక్క అందం, గొప్పతనం రంగుల్లో మరింత రాణిస్తాయి. కానీ అరవింద నైపుణ్యంవల్ల వాటిల్లో చాలా భాగం ఏకవర్ణ చిత్రాలే అయినా, అవి ఎంతో యింపుగా, గొప్పగా వున్నాయి.

ద్వారంవద్ద డాక్టర్ కుమార్ నుంచుని, చిరునవ్వుతో ఒక్కొక్కరినే ఆహ్వానిస్తున్నాడు. అరవింద లోపల హాల్లో విజిటర్స్‌కి, చిత్రాల్ని గూర్చి విడమర్చి చెప్తూంది. వచ్చిన వారంతా చిత్రకారిణి ప్రతిభ అపురూపం అని మెచ్చు కొంటున్నారు. మొదటిరోజుకన్నా రెండోరోజు ఎక్కువ మంది వచ్చారు ప్రదర్శనకు. ఆ రోజు చిత్రాలు బాగానే అమ్ముడుపోయాయి. ఆ రోజు సాయంత్రం హాలు చివర నుంచుని, ఏదో చిత్రాన్ని గూర్చి వివరిస్తూంది ఒక ఆంగ్లో యిండియన్ యువతికి. ఆమె వెనగ్గా ఒకతను వెయిట్ చేస్తున్నట్టుగా చేతులు కట్టుకుని నుంచున్నాడు. ఎందుకో వెనక్కి తిరిగి చూసిన అరవింద అతను తనకోసమే అక్కడ నుంచుని వున్నట్టు గ్రహించి "ప్లీజ్! ఓ అయిదు నిమిషాలు వెయిట్‌చెయ్యగలరా ? ఈ కాస్త ముగించుకుని వచ్చేస్తాను" అంది.

"అలాగే; టేక్ యువర్ ఓన్ టైం! ఎంతసేపైనా వెయిట్‌చెయ్యగలను. డోంట్ హర్రీ" అన్నాడు సన్నగా నవ్వుతూ మర్యాద వుట్టిపడుతూన్న స్వరంతో.

ఓ పదినిమిషాలు పోయాక మళ్లీ అదే స్థలాని కొచ్చింది అరవింద. చేతులు కట్టుకుని కిటికీలోనుండి బయటికి చూస్తున్నాడతను. అక్కడున్న చిత్రాలేవీ అతని దృష్టి నాకట్టుకున్నట్టులేవు. పైగా అతడి చూపులు రోడ్‌మీదే వున్నా దేన్నిగురించో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టుగా వుంది.

"సారీ! అయిదు నిమిషాలని మీతో చెప్పి, సరిగ్గా పావు గంటసేపు నిలబెట్టేశాను," అంది అరవింద అతడి వెనకాలే నుంచుని.

చప్పున యిటు తిరుగుతూ "మరేం ఫర్వాలేదు. చాలా బిజీగావున్నారు మీరు పాపం" అన్నాడు.

"చెప్పండి మీకేం కావాలో" అంది అరవింద.

ఒక నిమిషం ఆగి, ఆమెమీదనుండి చూపులు మరల్చు కొంటూ మొహమాటపడుతున్నట్టుగా అన్నాడు "మేడం; నాకో చిత్రం కావాలి ! ఎంత ఖరీదైనాసరే కొనటానికి సిద్ధంగా వున్నాను."

"అలాగే! రండి; ఏ చిత్రమది?"

కానీ అతడు మాత్రం ఆ చోటునుండి కదల్లేదు. అలాగే అరవిందని చూస్తుండిపోయాడు. అతడి వాలకం అర్థం కాక ప్రశ్నార్థకంగా చూసింది అరవింద.

ఆమె మొహంలోని భావాన్ని గ్రహించినట్టుగా "మేడం; దానిమీద "నాట్ ఫర్ సేల్" అని రాసివుంచారు. నాకు అదే కావాలి!" అన్నాడు, అభ్యర్థిస్తున్నట్టుగా.

ఒక్కసారిగా ఆశ్చర్యపోతూ "ఓ; అదా ! ఉహూ, అదమ్మటానికి వీల్లేదండీ. ఆ చిత్రం కేవలం ప్రదర్శనకి మాత్రమే వుద్దేశింపబడింది. ప్లీజ్; యింకోటేదైనా తీసు కోండి" అంది అరవింద.

"నో మేడం! కొంటే దాన్నే కొంటాను. మీరెంత చార్జ్ చేసినా సరే; దయచేసి మీ అభిప్రాయాన్ని మార్చు కోలేరా?" మరొక్కసారి ప్రాధేయపడ్డాడు.

"చూడండి మిస్టర్..."

"ఐ యాం సిద్ధార్థ" - చిరునవ్వుతో పరిచయం చేసు కొన్నాడు తనని.

''చూడండి సిద్ధార్థగారూ; ఈ ఫొటోని అమ్మటానికి నా కధికారంలేదు. ఈ విషయంలో నే నశక్తురాలిని. ఇంత కన్నా బాగా గీసినవీ, కళాత్మకంగా వున్నవీ ఈ ప్రదర్శ నలో ఎన్నో వున్నాయి. మీరు అన్నింటినీ సరిగ్గా చూడ లేదేమో ఒకసారి రండి నా వెంట, చూపిస్తాను" అంది అరవింద.

కళ్లు విప్పార్చుకుని అంతవరకూ ఆమె చెప్తూన్నది వింటూన్న అతను "వద్దు లెండి... వెళ్లిపోతాను; థాంక్స్" అన్నాడు నిరాశతో.

అతి మెల్లగా, బరువుగా, పలికిన ఆ కంఠస్వరం విన్న అరవింద ఒక్కసారిగా చలించిపోయింది. ఆరడుగుల ఎత్తు విగ్రహ మతడిది. పెదవులూ, ముక్కూ, ఎవరో అత్యంత ప్రతిభావంతుడైన శిల్పి చెక్కినట్టుగా వున్నాయి. సరిగ్గా ఎదుటిమనిషికి మాత్రం విన్పించేట్టు, అతి మంద్ర స్థాయిలో పలికే స్వరం అతడిది. మొహంలో గాంభీర్యంతో బాటు సంస్కారం కూడా వుట్టిపడుతోంది. గుమ్మంవైపు వెళ్లబోతున్న అతడిని అరవింద మాటలు ఆపాయి.

"ఎంతో వుత్సాహంతో, అతి ముఖ్యమైన ప్రయోజనా న్నుద్దేశించి ఈ ప్రదర్శన ఏర్పాటుచేశాం. మీరీ విధంగా నిరాశతో వెళ్లిపోవటం ఏదో అపశృతిలాగా అన్పిస్తోంది. ఆ చిత్రం నేను వూహామాత్రంగా గీసింది కాదండీ; ఆ మోడల్- ఆ చిత్రంలోని అమ్మాయి నా కత్యంత ఆప్తురాలు. ఆరిపోనున్న నా జీవన జ్యోతికి తిరిగి ప్రాణం పోసింది. అన్ని ఆశలూ నశించి ఎండి మోడైన నా జీవి తాన్ని మళ్లీ చిగురింపచేసింది. ఆమెతోడి స్నేహం నేనొక వరంగా భావిస్తాను. ఎటువంటి పరిస్థితుల్లోనూ దాన్ని నేను పోగొట్టుకోలేను. దానికి భంగం కలిగితే సహించలేను. ప్లీజ్ ! సిద్ధార్థగారూ; నన్నర్థంచేసుకోండి. ఈ ఫోటోని ప్రదర్శనలో వుంచటానిక్కూడా యిష్టపడ లే దా అమ్మాయి మొదట్లో. చివరికి నా బలవంతంమీద సరేనంది." ఒక నిమిషంసేపాగి అటూ యిటూ, చూసింది అరవింద, కొత్త వాళ్లెవరైనా వచ్చారేమో చూపించటానికి తీసుకెళ్లాల్సి వుంటుందని. కానీ అటువైపు ఎవరూ రాలేదు. వచ్చిన నలుగురైదుగురు యింకా గుమ్మం దగ్గరే నుంచుని అక్కడి చిత్రాలు చూస్తున్నారు. వారి వెంట డాక్టర్ కుమార్ వున్నారు. మళ్లీ చెప్పసాగింది "చాలా సంవత్సరాల తర్వాత దీప... ఈ అమ్మాయి ప్రోత్సాహంతోటే మళ్లీ పెయింటింగ్ మొదలుపెట్టాను. ఈ విడతలో నేను గీసిన మొదటిచిత్రం యిది. ఇందులో నా ప్రతిభ ఏమీలేదు; కారణం దీప సహజంగా అందమైంది. ఇది మొదటి చిత్రమైనా, ఆషామాషీగా గీసినా, ఈ పెయిం టింగ్ అద్దంలో ప్రతిబింబంలాగా, అంత సరిగ్గా ఎలా కుదిరిందోనని నాకే ఆశ్చర్యంగా వుంటుందప్పు డప్పుడూ..."

"మీరు చెప్తూన్నది కరెక్టే ! నాకూ చిత్రాలు గియ్యటం కొంతవరకూ వచ్చు. దీనికి ఉదాహరణగా ఓ సంఘటన చెప్పనా ?"

"చెప్పండి." కుతూహలంగా అంది అరవింద.

"నా మూలంగా మీరు పని పొదులుకుని చాలాసేపు యిక్కడే వుండిపోయారు. బాగా అలిసిపోయి వున్న మిమ్మల్ని యింతసేపూ నుంచోబెట్టే వున్నాను. రండి ఆ బెంచీమీద కూచుందాం," అన్నాడు అతను.

చాలాకాలం క్రితం జరిగిన సంఘటన యిది. మా బంధువుల్లో 'రూప' అని ఓ అమ్మాయుండేది. పేరుకి తగ్గట్టు కళ్లు చెదిరే అందం ఆమెది. రూపంతోబాటు తెలివి తేటల్నికూడా ప్రసాదించాడు భగవంతుడామెకి. పై చదు వులు ఇక్కడ పనికిరావని ఆక్స్‌ఫర్డ్ వెళ్లింది. ఆమెలో

మొండితనంతోబాటు అందగత్తెనన్న అహంకారం ఎక్కువగా వుండేది. ఎంత ఖర్చైనా సరే తన పోర్ట్రెయిట్ గీయించుకోవాలన్న కోరిక ఎప్పటినుంచో వుండేది రూపకి. ఇంగ్లండ్ వెళ్లాక ఓ ప్రముఖ చిత్రకారుడిని కలుసుకుని తన పోర్ట్రెయిట్ గీసిపెట్టమనీ, ఎంత డబ్బైనా యిచ్చుకో గలననీ అంది. అతడు కూడా ఆమెని చూశాక గియ్యటాని కొప్పుకున్నాడు. తీరిక వున్నప్పుడల్లా వెళ్లి సిట్టింగ్స్ యిస్తూండేది రూప. చివరికి చిత్రం పూర్తయింది. డబ్బిచ్చేసి, చిత్రం తెచ్చుకొందామని వెళ్లిన రూపకి తన పూర్తయిన పోర్ట్రెయిట్ చూసిందే పిచ్చికోపం, వుక్రోషం వచ్చాయి. ఆ పెయింటర్ని రక్కి పెట్టాలన్నంత కోపం వచ్చిందట. కారణం ఆ చిత్రం చాలా వికృతంగానూ, అసహ్యంగానూ వుంది. రూపకీ, ఆ చిత్రానికీ ఎక్కడా పోలికేలేదు !!"

"ఎందుకూ?? మరి అతడు పేరు ప్రఖ్యాతులున్న పెయింటరన్నారుగా?" ఆశ్చర్యంగా అడిగింది అరవింద.

అరచేతిని గడ్డం క్రింద ఆనించుకుని చెప్పసాగాడు మళ్లీ సిద్ధార్థతో- "ఎంతో ప్రయత్నంమీద రూపని శాంతపర్చి, విశదపర్చాడట ఆ పెయింటర్. ఫోటోగ్రాఫ్‌కీ, పోర్ట్రెయిట్‌కీ వున్న తేడా యిదే. ఫోటోలో అవుతే బాహ్య సౌందర్యం మాత్రమే కన్పిస్తుంది. కొంతమంది ఫోటోలో రెట్టింపు అందంతో కనిపిస్తారు. పైగా ఏ కాస్త లోపాన్నైనా సరిదిద్దటానికి వీలుంది. కానీ పోర్ట్రెయిట్‌లో అలా కాదు. ఇక్కడ బాహ్యసౌందర్యంతోబాటు అంతరంగ సౌందర్యం కూడా ప్రతిఫలిస్తుంది. ఇందులో నా తప్పేమీ లేదని అన్నాడట అతడు. కాబట్టి మీ చిత్రం గూర్చి చెప్తున్న దాన్లో ఆశ్చర్యపడాల్సిన సంగతేమీ లేదు..."

మాట్లాడుతూన్న అతడివంకే ఆశ్చర్యంగా చూస్తూండి పోయింది అరవింద. ఆ తర్వాత ఏదో నిశ్చయాని కొచ్చిన దానిలాగా "మీరు చూస్తానంటే దీపని పిలిపిస్తాను" అంది.

ఎటో చూస్తూ కూర్చుని వున్నతడు చటుక్కున లేచి నుంచుంటూ "యిక్కడే వుందా ఆ అమ్మాయి ? ఆమెకేమీ అభ్యంతరం లేకపోతే ఒక్కసారి పలకరించి వెళ్తాను" అన్నాడు.

"కూర్చోండి ఓ అయిదు నిమిషాలు. ఇప్పుడే పిల్చుకు వస్తాను," అని వెళ్లిన అరవింద టౌన్‌హాలంతా కలయ తిరిగినా ఎక్కడా దీప జాడ లేదు. క్వార్టర్స్‌కి వెళ్లి వుంటుందని చెప్పారెవరో.

"క్షమించండి. ఆ అమ్మాయి వెళ్ళిపోయింది. రేపు మధ్యాహ్నం,మా యింటికి ఓసారి రాగలరా? దీపని కూడా పిలిపిస్తాను. పరిచయం చేసుకోవచ్చు మీరు" అంది.

"అలాగే. మధ్యాహ్నం అవుతే నాకు వీలుంటుంది. సాయంత్రం నేను మైసూరు వెళ్లిపోవాలి. వస్తానండీ" అని అడ్రెస్ తీసుకుని వెళ్లిపోయాడు.

* * *

మధ్యాహ్నం మూడుగంటల సమయం. హాల్లో అరవింద, సిద్ధార్థ, కూర్చునివున్నారు. ఎండ తీవ్రంగా వుంది. వుక్కపోస్తూండటం మూలాన లేచి నుంచుని, కోటు విప్పి, సోఫామీద వుంచాడు సిద్ధార్థ. అది చూసి అరవింద "ఒక్క నిమిషం" అంటూ లోనికి వెళ్ళి ఫ్రిజ్‌లో వుంచిన కొబ్బరి నీళ్ల గ్లాసుతో తెచ్చియిచ్చింది. అతడు దాన్నందుకుని థాంక్స్ అన్నాడు. ఆ కాస్త డ్రింక్ త్రాగేలోగా తన వాచీ కేసి, గుమ్మంకేసి పదిసార్లు చూసాడు. అంతసేపయినా దీప రాలేదు. వెనక్కివాలి కూర్చున్నవాడల్లా నిటారుగా కూర్చుంటూ "ఇక నేను బయలుదేరాల్సి వుంటుందండీ; నాకు అతి ముఖ్యమైన మీటింగొకటి ఏడుగంటలకి వుంది. వెళ్తాను. మిమ్మల్ని చాలా శ్రమపెట్టాను యిప్పటికే" అన్నాడు.

అరవింద ఏదో చెప్పబోతున్నంతలో ఫోన్ మ్రోగింది. ఆత్రతగా వెళ్ళి రిసీవరందుకుంది.

అవతలనుండి దీప కంఠం పలికింది. ఖంగారుగా, ఆదుర్దాగా వుంది దీప స్వరం.

"సారీ అరవిందా; నేనిప్పుడు మీ యింటికి రాలేను ! ఇక్కడ పరిస్థితి చాలా ఆందోళనకరంగా వుంది. ఏమీ అనుకోకు."

"ఏం? ఏం జరిగింది? ఒక్క పదినిమిషాలసేపు వచ్చి వెళ్లలేవూ? ప్లీజ్ దీపా!" అంది అరవింద అర్థిస్తూన్నట్టు.

"వుహూ వీల్లేదు. పెట్టేస్తున్నాను ఫోను" అంది. ఇక ఒక క్షణం కూడా వృధా చెయ్యలేనంత అసహనంగా వుంది దీప స్వరం.

"వద్దు, అప్పుడే డిస్కనెక్ట్ చెయ్యకు దీపా! ఎప్పుడొస్తావో చెప్పు అదైనా? ఇంకో గంట లేదా గంటన్నర ఆగి అయినా వస్తావా ?"

"ఏమో తెలీదు అరవిందా; అరుణ... చావు బ్రతుకుల్లో వుంది...!"

కెవ్వుమంది అరవింద. "ఏమిటి దీపా? అరుణ కేమైంది? ఆక్సిడెంటా? ఏమిటి చెప్పు...చెప్పు?" అంది ఆదుర్దాగా.

"ఫోన్లో ఏమీ చెప్పలేను అరవిందా; సారీ ఏమనుకోకు అంది" దీప.

"అయితే యిప్పుడే బయలుదేరి వస్తాను" అంటూ ఫోన్ పెట్టేసింది అరవింద.

అప్పటికే గుమ్మందాటి వెళ్లి, వరండాలోవున్న "ఫిష్ పాండ్"లో వలయాలు తిరుగుతూన్న రంగు రంగు చేపల వంక చూస్తూ నుంచునివున్నాడు సిద్ధార్థ. అతడి దృష్టి వాటిమీద వున్నా మనసు మాత్రం అక్కడ లేదు. అరవింద అడుగులచప్పుడు విని యిటు తిరిగాడు. "మీరు చెప్ప బోతున్నది వూహించాను ముందుగానే" అన్నట్టు "బాధ పడకండి" అని నచ్చజెప్తున్నట్టుగా పల్చగా నవ్వాడు.

"తను రాలేదట. మిసెస్ కుమార్ అంటే వాళ్ల మెడికల్ సూపరింటెండెంట్‌గారి భార్యకి సీరియస్‌గా వుందట. మిమ్మల్ని యింత సేపు కూర్చోబెట్టి, చివరికిలా నిరాశపరుస్తున్నందుకు క్షమించండి" అంది నొచ్చుకుంటూ అరవింద.

"ఐ యాం రియల్లీ సారీ! పోనీండి. ఇంకోసారెప్పు డైనా ఈ వూరొచ్చినప్పుడు వస్తాను మీ యింటికి. మీరు తీసుకున్న శ్రమకి చాలా థాంక్స్," అని తన విజిటింగ్ కార్డ్ పర్స్‌లోంచి తీసి టీపాయ్‌మీద వుంచి, గబగబా వెళ్లి కారు స్టార్ట్ చేశాడు.

* * *

ఇన్‌టెన్సివ్ కేర్ యూనిట్‌లో, పాలిపోయి, చలనం లేకుండా, పడివుంది అరుణ. ఇంతకీ ఆమె ఏం మందు తీసుకొందో ఎవరికీ తెలీదు. అంతకు క్రితంరాత్రి అలస్యంగా వచ్చింది యింటికి. అప్పుడు డాక్టర్ కుమార్ కూడా యింట్లో లేడు. ఎమర్జెన్సీ కేసేదో వస్తే వెళ్ళి, రాత్రంతా హాస్పిటల్లోనే వుండిపోయాడు. అన్నం తినకు డా పడుకుందా రాత్రి అరుణ అప్పుడప్పుడు బయట భోంచేసి వచ్చిన సమయాల్లో తినకుండా పడుకోవటం మామూలే గనుక పనిమనిషికి అనుమానం రాలేదు. ఉదయం బాగా పొద్దెక్కింది. అయినా అరుణ లేవలేదు. రాత్రి ఎంత అలస్యంగా పడుకున్నా ఉదయం ఆరుగంటలకల్లా లేచిపోయేది ఎప్పుడూ. ఒంట్లో సుస్తీచేసింది కామోసు అని మొదట్లో అనుకొన్నా ఆ తర్వాత వెళ్ళి తలుపు కొట్టింది పనిమనిషి. ఎంతకీ జవాబు రాలేదు. అప్పుడే సరిగ్గా యింట్లో అడుగుపెట్టాడు డాక్టర్ కుమార్. హడా విడిగా పరుగెత్తుకు వెళ్ళి "అమ్మగారెంత తలుపు కొట్టినా లేవటంలేదు. నా కేమిటో భయంగా వుంది బాబూ" అంది. ఒక్క వుదుటున బెడ్‌రూం తలుపుదగ్గరికి వెళ్ళి తలుపు కొడుతూ, "అరుణా అరుణా;" అంటూ పిలిచాడు రెండు మూడుసార్లు. అయినా జవాబు రాలేదు. చివరికి పని మనిషి సాయంతో తలుపులు బ్రద్దలుకొట్టి లోనికి వెళ్ళాడు. ప్రశాంతంగా నిద్రపోతున్నట్టుంది అరుణ మొహం. జుట్టు కాస్త చెదిరి నుదుటిమీద పడుతూంది. అది మామూలు నిద్ర కాదని, ఆమె పడుకున్న తీరునీ, ఆ గురకనీ చూసిందే గ్రహించా డతడు. ఆ క్షణంలో తను డాక్టర్నన్న విషయంకూడా మర్చిపోయి "అరుణా ! అరుణా !" అంటూ ఆవేశంగా అటూ యిటూ కదిపాడు. ఆ కుదుపుకి ఆమె శరీరం అటూ యిటూ జరిగిందే తప్ప మరే చలనమూ లేదామెలో. తక్షణమే తన్ను తాను సంబాళించుకొని రెండుచేతుల్తో అరుణని ఎత్తి పట్టుకొని గబగబా హాస్పిటల్ వైపు నడిచాడు, డాక్టర్ కుమార్.

ఒక పగలూ, ఒక రాత్రీ గడిచాయి. అయినా అరుణకి స్పృహ రాలేదు. సెలైన్ ఎక్కిస్తున్నారు. ఆక్సిజన్ కూడా యిస్తూవున్నారు. అయినా పరిస్థితి అలాగే వుంది. నిద్రాహారాలు మాని ఆమె దగ్గరే దిగులుగా, బెంగగా, కళ్లలో వత్తులు వేసుకుని కూర్చొని వున్నాడు, డాక్టర్ కుమార్. ఇంకో పూట గడిచింది. అయినా అరుణ అలాగే పడివుంది. పల్స్ క్రితంరోజుకన్నా బలహీనం అయింది. అది చూశాక అందరికీ ఆదుర్దా హెచ్చింది. నిద్రలేమివల్లా, ఆందోళన మూలంగా డాక్టర్ కుమార్ కళ్ళు ఎర్రగా అగ్ని గోళాల్లా తయారయ్యాయి. అలసట కారణంగా మొహం పీక్కుపోయింది. రెండురోజుల్లోనే అతడిని దుఃఖం పీల్చి పిప్పిచేసింది. తమ కత్యంత ఆప్తుడూ, సన్ని హితుడూ అయిన వ్యక్తి కింత కష్టం, వేదన కలగటంతో హాస్పిటల్ సిబ్బంది మొత్తం కంట తడిపెట్టుకొన్నారు. ఏ ఒక్కరితోనూ పలకకుండా, దుఃఖాన్నంతా మింగి, శిలా విగ్రహంలా కూర్చుండిపోయాడు డాక్టర్ కుమార్.

నిమిషాలు గంటలుగా మారిపోతున్నాయి. మందులూ, గ్లూకోజ్ ఎక్కిస్తూనే వున్నారు అరుణకి అవిరామంగా. అరుణ తలమీద కుడిచేతిని వుంచి, వెనక్కి వాలి, కళ్లు మూసుకుని కూర్చుని వున్నాడు డాక్టర్ కుమార్. అతని మొహంలో దైన్యం గూడుకట్టుకుని వుంది. కంటికి కని పించని ఆ దైవానికి మౌనంగా తన ఆవేదనని నివేదించు కుంటున్నట్టున్నాడు. చాలా సేపు గడిచిందలాగ. ఎవరో తన సమాధికి భంగం కలిగించినట్టు హఠాత్తుగా కళ్లు తెరి చాడు. కొద్దిగా ముందుకు వంగి చెవులు రిక్కించి విన్నాడు...అంతే! ఒక్క వుదుటున లేచి నుంచుని ఓ క్షణంసేపు అరుణకేసి చూశాడు. అంత దుఃఖంలోనూ యింకెవరిదో ఆర్తనాదం అతడి హృదయపు లోతుల్ని స్పృశించింది! చటుక్కున తలుపు తీసుకుని ఆ కేకలు వినవస్తూన్న దిక్కుగా గబగబా నడిచి వెళ్లాడు.

లేబర్ రూం అది. టేబిల్‌మీద నడివయసుకురాలైన ఒక

గర్భిణీ స్త్రీ పడుకుని బాధని భరించలేక హృదయ విదారకంగా ఏడుస్తూ, మూలుగుతూ వుంది. నొప్పిని మరీ సహించలేని సమయంలో బాధ నణచుకోవటాని కన్నట్టు పంటితో క్రింది పెదవిని నొక్కిపెట్టటంవల్ల, పెదవి చిట్లి రక్తం కారుతోంది. అక్కడున్న నర్సులు ఆమెని వూరుకోబెట్టటానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఆపరేషన్ సరంజామా అంతా తీసి స్టెరిలైజర్‌లో వేస్తోంది దీప.

అంతలో తలుపులు హఠాత్తుగా తెరుచుకున్నాయి! అందరూ ఒక్కసారిగా తిరిగి చూశారు. వడిలిపోయిన మొహం, రేగిన జుట్టుతో డాక్టర్ కుమార్ గుమ్మంలో నుంచుని వున్నాడు! వాళ్ల ఆశ్చర్యంనుండి తేరుకొనేలోగా, అతడు నెమ్మదిగా వెళ్ళి టేబిల్ దగ్గర నుంచున్నాడు. డాక్టర్ కుమార్‌ని చూడగానే మంత్రించినట్టు ఒక్కసారిగా ఆ మనిషి కేకలు ఆగిపోయాయి! నెమ్మదిగా రెండు చేతులూ ఎత్తి, నమస్కరించింది.

"ఫర్వాలేదు పడుకోమ్మా; నీకేం భయంలేదు" అంటూ ఆమెని ఎంతో శ్రద్ధగా జాగ్రత్తగా పరీక్షచెయ్యసాగాడు. అతడి చేతు లామెని స్పృశించిందే, కన్నతల్లి స్పర్శలా హాయిగా సేదతీరుస్తున్నట్టనిపించిందేమో ... దీర్ఘంగా ఓ నిట్టూర్పు వదిలి కళ్ళు మూసుకొందామె.

మూడురోజులుగా నొప్పులు పడుతూం దా మనిషి. అయినా ప్రసవం కాకపోవటంతో ఆ పల్లెటూర్లో వున్న అమ్మలక్కలు తమ శాయశక్తులా ప్రయత్నించి, చివరికి పెదవి విరిచి, ఆస్పత్రికే తీసుకువెళ్ళమన్నారు. చివరికి ఆ మనిషి మొగుడూ, యింకో మనిషీ, ఎద్దుబండిమీద మోసుకొచ్చి, యిక్కడ పడేసి సినిమాకి వెళ్ళిపోయారు.

ఆ స్త్రీ చాలా పొట్టిగా, అర్భకంగా, బలహీనంగా వుంది. రక్తం లేకపోవటంవలన పెదవులూ, మొహం పాలిపోయి కన్పిస్తున్నాయి. నాటువైద్యులూ, పల్లెటూరి మంత్రసానులూ చేసిన ప్రయోగాలవలన పిండంలో చలనంలేదు. "ఫీటల్ హార్ట్" అసలు విన్పించటమే లేదు. పరీక్షచెయ్యటం పూర్తి అయ్యాక, వెనుదిరిగి "సిస్టర్! అంతా సిద్ధంచేశారా?" అనడిగాడు డాక్టర్ కుమార్.

"యస్ డాక్టర్!" అంది దీప హడావిడిగా పరికరాలన్నీ తీసి ట్రేలో అమరుస్తూ.

మరో అయిదు నిమిషాల్లో చేతులు కడుక్కుని, గ్లవ్స్ తొడుక్కుని, మాస్క్ కట్టుకున్నాడు డాక్టర్ కుమార్. ఒక్కసారిగా టేబిల్‌మీది లైట్లు వెలిగాయి! పేషెంట్‌ని సరిగా పొజిషన్‌లో పడుకోబెట్టారు. అంతే! సర్వం మర్చిపోయి ఆపరేషన్‌లో లీనమైపోయాడు అతడు.

గర్భంలోపల బిడ్డ చచ్చిపోయి వుంది. ముక్కలుగా తీశాడు బయటికి. అలసట, నీరసం, మరిచిపోయి అతడి చేతులు చకచకా పనిచేస్తూంటే దిగ్భ్రాంతితో అతడినే చూస్తూండిపోయింది దీప. ఎందుకో ఆ సమయంలో ఆమెకి తాను మొదటిసారిగా చూసిన ఆపరేషన్—అరవిందది గుర్తొచ్చింది. "అప్పటికీ, యిప్పటికీ ఎంత తేడా! ఇంత ఉదాత్తహృదయుడికి ఎంత దుఃఖం రాసిపెట్టాడు భగవంతుడు!" అని మనసులోనే నిట్టూర్చింది.

ఆపరేషన్ పూర్తయింది. స్ట్రెచర్‌మీద పేషెంట్‌ని వార్డులోకి తీసుకెళ్ళిపోయారు. వాష్ బేసిన్‌వద్దకి వచ్చి చేతులు కడుక్కోసాగాడు. అతడి కళ్ళూ, మొహం అలసటతో నిండివున్నాయి. నుదుట పట్టిన చెమటబిందువులు ఆ లైట్ల కాంతిలో వింతగా మెరుస్తున్నాయి. టవల్ తెచ్చి, అతడికిచ్చి ప్రక్కనే నుంచుంది. చేతులకున్న తడిని టవల్‌తో ఒత్తుకుని తిరిగి యిచ్చేస్తూ దీర్ఘంగా నిట్టూర్చి "సిస్టర్! ఎవ్విరీథింగ్ ఈస్ ఓవర్" అని గబగబా వెళ్ళిపోయాడు.

హతాశురాలైనట్టు అతడివంక చూసింది దీప. ఏమిటి అతడంటున్నది? ఆపరేషన్ గురించా? లేక తన భవిష్యత్తు గురించా ? అనుకొంటూ ఆ పలుకుల్లో తొణికిన అపశ్రుతి గురించి చాలాసేపు బాధపడుతూ వుండిపోయింది.

అలిసిపోయి, కాళ్ళీడ్చుకొంటూ వచ్చాడు డాక్టర్ కుమార్, అరుణ వున్న చోటుకి. అంతవరకు అరుణవద్ద కూర్చుని, ఆమెని కనిపెట్టుకునివున్న డాక్టర్ మోహన్ బెడ్ దగ్గరగా ఇంకో కుర్చీ జరిపాడు. ఆ కుర్చీలో కూర్చోకుండా అరుణ బెడ్‌మీద ఆమె ప్రక్కన కూర్చుని, మొహంమీదకి వంగి, నెమ్మదిగా తన రుమాలుతో ఆమె నుదుటిని అద్ది, మొహంమీదకి పడుతూన్న జుట్టుని సవరించాడు. అంతకు మించిన పరిచర్య ఇంకేమీ లేకపోయింది చెయ్యటానికి. అతడికీ తెలుసు ఆ దీపం ఆరిపోవటాని కిక ఆట్టే వ్యవధి లేదని. అయిన అంత గొప్ప వైద్యుడు కూడా ఆ సమయాన చెయ్యగలిగిం దేమీలేక, తన కత్యంత ప్రీతిపాత్రమైన వ్యక్తి నిష్క్రమణని బేలగా చూస్తూండిపోయాడు. నిస్సహాయతని మించిన శిక్ష మరోటి లేదేమో ప్రపంచంలో.... !

ఇహ దుఃఖాన్ని దిగమింగటం అతడి వశం కాలేదు. వేదనాభారంతో అదరుతూన్న అతడి పెదిమలు ఆమె కేదో చెప్పాలన్నట్టుగా కొద్దిగా కదిలాయి. కానీ మాటల కందనంత దూరంలో వుంది అరుణ. ఆ అగాధం క్షణక్షణానికీ ఎక్కువవుతూంది పైగా. తన రెండు చేతుల్లోటి అరుణ

చేతిని అతి సున్నితంగా పట్టుకుని, ఆ స్పర్శద్వారా తన మనసులో చెలరేగే భావాల్ని ఆమె కందజెయ్యాలన్నట్టు, అలాగే ఎంతోసేపు కళ్లుమూసుకుని మౌనంగా వుండి పోయాడు. ఒకటి... రెండు ... మూడు ... పదినిమిషాలు బరువుగా గడిచాయి. ఆమె శరీరంలో అంతకంతకూ ఎక్కువవుతూంది శైత్యం. అతడి గుండె ఎగిసిపడ సాగింది. అలసటగా ఉన్న కళ్ళని విప్పార్చుకుని మరీ చూశా డామెని. ఆ చూపుల్లో అంతులేని అనురాగం వుంది. అర్థింపు వుంది...దైన్యం, నిరాశ, నిస్పృహ వున్నాయి... కొద్ది నిమిషాలు గడిచాక అతి మెల్లగా, ఎంతో జాగ్రత్తగా, అరుణ చేతిని దించి, ఆమె రెండు చేతుల్నీ గుండెలమీద దగ్గరగా సర్దాడు. అప్పుడు అతడి గుండెల్ని చీల్చుకుని ఓ నిట్టూర్పు బయటికొచ్చింది. ఒక్కసారి డాక్టర్ కుమార్ వైపు పరీక్షగా చూసి, అరుణ మొహంవరకూ తెల్లటి దుప్పటి కప్పాడు డాక్టర్ మోహన్.

*   *   *

లీవ్ అప్లయ్‌చేసి డాక్టర్ కుమార్ తన స్వగ్రామం వెళ్ళి అప్పుడే నాలుగు నెలలవవస్తోంది. అరుణ చనిపోవటానికి రెండురోజులముందే జయరాం పరారీ అయ్యాడు! ఈ వార్త విన్నదే అందరికీ మతిపోయింది. ఆ తర్వాత ఒక్కొక్కటే జయరాం చేసిన ఘాతుకాలన్నీ బయటపడ్డాయి. ఏక్టింగ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌కి వార్నింగిచ్చి గట్టిగా చీవాట్లేశాడు పేషెంట్లనీ, తతిమ్మా డాక్టర్లనీ యిన్నిరోజులు మోసంచేసి జయరాంలాటి వాడితో చేతులు కలిపినందుకు. క్రమంగా అంతా సర్దుకుంది. ఆస్పత్రి కూడా మొదట్లో లాగానే వచ్చి పోయే పేషెంట్లతో రద్దీగా వుంటూంది. అయినా అందరి మనసుల్లో ఏదో వెలితి, అసంతృప్తి...

అరుణ చనిపోయిన మరుసటిరోజు అందింది అరవిందకి అరుణ రాసిన ఉత్తరం. యథాలాపంగా కవరు విప్పిన అరవింద లోపలి ఉత్తరాన్ని చదివి స్తంభించిపోయింది.

"మైడియర్ అరవిందా!

ఈ ఉత్తరం నీ కందేసరికి నేనీ లోకాన్ని శాశ్వతంగా వదిలిపెట్టి వుంటాను. మీ కెవరికీ ... ఆఖరికి కుమార్‌కి కూడా తెలిని అధ్యాయాలు ఎన్నో నా జీవిత గ్రంథంలో ఉన్నాయి...

నేనీ మధ్య డ్రగ్స్‌కి బాగా అలవాటుపడ్డాను అరవిందా! కుమార్‌నీ, అతడి మనసునీ, సరిగా అర్థంచేసుకోలేక పోవటమే నా దురదృష్టం. నా స్వార్థంకొద్దీ అతడిని ఇంట్లో కట్టేసుకోవాలనీ, నా వెంట త్రిప్పుకోవాలనీ, ఆశపడ్డాను కానీ, అతడొక బాధ్యతగల డాక్టరనీ, ప్రపంచాని కతడి అవసరం ఎంతైనా వుందని, అతడి ప్రతిభ మెరుగుపెట్టినకొద్దీ రాణిస్తుందనీ ఆలోచించలేక పోయాను.

పని ఒత్తిడి మూలంగా అతడింటికి ఆలస్యంగా వస్తే అలిసిపోయిన అతడిని సేదతీర్చే బదులు దెబ్బలాడేదాన్ని. తన జీతంలో కొంత తన స్నేహితుల ట్రీట్‌మెంట్‌కోసం ఖర్చుపెడితే కోపం తెచ్చుకుని రోజంతా దెప్పిపొడిచేదాన్ని. ఇలా గోరంతలు కొండంతలుచేసి అతడిని హింసించేదాన్ని మాటల్తో, చేతల్తో.

నన్ను శాంతపర్చాలని, నచ్చజెప్పాలని ప్రయత్నించేవాడు కుమార్. కానీ అతడిని చూసినకొద్దీ రెచ్చిపోయేదాన్ని. నేనో శాడిస్ట్‌గా తయారవుతున్నానని నా కప్పట్లో తెలీలేదు.

సరిగ్గా ఆ రోజుల్లోనే జయరాం నా జీవితంలోకి ప్రవేశించాడు. మంచి స్నేహితులు లభించటం కూడా ఓ గొప్ప వరం అరవిందా! దీప చెలిమి నీ జీవితాన్ని ప్రభావితం చేస్తే జయరాం సాంగత్యం నా జీవితాన్ని అధఃపాతాళానికి నొక్కేసింది. నేను నైతికంగా ఎంతగా దిగజారిపోతున్నానో నా కప్పట్లో లీలామాత్రంగానైనా తట్టలేదు. అప్పట్లో నాకున్నదల్లా కుమార్‌మీద ప్రతీకారవాంఛ... ఎంత మూర్ఖురాలిని! అదే ప్రతీకారవాంఛతోనే జయరాం కూడా నన్నో పావుగా వినియోగించుకొంటున్నాడని గ్రహించలేకపోయాను. అందుకే తిన్నగా అతడు పన్నిన వలలోనికి నా అంతట నేనే వెళ్ళి చిక్కుకుపోయాను. జయరాం గూర్చిన నిజం నిన్ననే తెలిసింది హాస్పిటల్ స్టాఫ్ కుమార్‌కి చెప్తూంటే.

ఈ డ్రగ్స్ లేకుంటే బ్రతకలేని స్థితికి వచ్చేశాను అరవిందా ... ఆకలి క్షీణించింది. ఒంట్లో పటుత్వం కూడా రోజురోజుకీ తగ్గుతోంది. ఇక నాకు ఈ ప్రపంచంతో గానీ, మరెవరితో గానీ నిమిత్తంలేదు. ఇంతగా దిగజారిపోయిన నేను కుమార్‌లాటి ఉత్తముడికి భార్యగా ఉండ తగను. అంతకన్నా నీచం ఉండదు. అతడిని వీలయినంతగా హింసించాను. ఇక ఇలా బ్రతికి, అతడిని అవమానపర్చటం భావ్యం కాదు.

అరవిందా! మిమ్మల్ని మించిన ఆప్తులు మా యిద్దరికీ ఎవరూ లేరు. అందుకోసమనే నీకు రాస్తున్నా నీ ఉత్తరం. పైకి ఎంత గంభీరంగా ఉన్నా అతడి హృదయం నాకోసం ఆక్రోశిస్తుంది. రాత్రిళ్లు ఒంటరిగా పడుకున్నప్పుడు, ఆ కళ్ళు నాకోసం కన్నీళ్ళు నింపుకుంటాయి. అందుకే అతడిని

నీ కప్పగించి మరీ వెళ్తున్నాను. మీ రిద్దరే కుమార్‌ని ఓదార్చాలి. కనిపెట్టి వుండాలి.

అవసరం అనుకుంటే ఈ ఉత్తరా న్నివ్వు కుమార్‌కి. అతడి క్షమని నేను అర్థించటంలేదు నా ఈ చివరి ఘడియల్లో. ఎందుకో తెలుసా అరవిందా ? ? అతడికి నామీద కోపంలేదు. అసహ్యం అంతకన్నా లేదు ! అందుకే ఈ క్షణంలో కోరుకోటానికూడా ఏమీ మిగల్లేదు నాకు...

ఫేర్‌వెల్ మై ఫ్రెండ్ !

అరుణ."

* * *

ఆ రోజు సాయంత్రం ట్రెయిన్‌కే వెళ్ళిపోతున్నాడు డాక్టర్ కుమార్. ఉదయంనుండీ అతడి సామాన్లు సర్దుతూనే వుంది అరవింద. మౌనంగా వరండాలో కూర్చుని, ఆమె చేస్తూన్న పనిని చూస్తున్నాడు. అంతా అయ్యాక నెమ్మదిగా అతడి వెనుకగా వచ్చి నుంచుంది. ఏదో చెప్పటానికే వచ్చిందని గ్రహించి, నెమ్మదిగా తల తిప్పి చూశా డామె వైపు. మొదట ఉత్తరంలోని విషయాలు టూకీగా చెబ్దా మనుకుంది కానీ ఆ తర్వాత మనసు మార్చుకుని "కుమార్; ఓ ఉత్తరం వుంది. యిదుగో" అని అందించింది.

ఆ ఉత్తరాన్ని విప్పి చూసిందే అతడి కళ్లు ఆశ్చర్యంతో విప్పారాయి. వణుకుతూన్న చేతుల్తో గట్టిగా పట్టుకుని ఆత్రతగా చదివాడు, చివరిదాకా ఒకటికి రెండుసార్లు. ఆ తర్వాత మడిచి తిరిగి యిచ్చేస్తూ "తీసుకో అరవిందా; ఇది నీ ఉత్తరం," అన్నాడు హీనస్వరంతో.

ఇంకా అక్కడే నుంచునివున్న అరవింద అతడిని తేరి పార జూస్తూ అంది: "జయరాం ఇంత గ్రంథం నడిపిస్తూన్నా మన కెవ్వరికీ తెలీనేలేదు. ప్చ్ ! ఏ మాత్ర మైనా మనం గ్రహించి ఉన్నట్టయితే అరుణ మనకు దక్కేది. నువ్వేగా వాడు ఉద్యోగం లేకుండా ఉన్నాడనీ, భార్యాపిల్లలు ఆకలితో అలమటిస్తున్నారనీ దొంగ ఏడుపులు ఏడిస్తే, జాలితో ఉద్యోగ మిప్పించావు ? ? ఆ విశ్వాసం కూడా లేకపోయింది కిరాతకుడికి. పాలుపోసిన చేతినే కాటు వేశాడు కృతఘ్నుడు..."

"పోన్లే అరవిందా; యిదంతా మన దురదృష్టం. జయరాం సంగతి ఆ పాపపుణ్యాల విచారణకర్తకే వదిలేద్దాం," అన్నాడు దీర్ఘంగా నిశ్వసిస్తూ.

"అలాగే; కానీ మళ్ళీ ఊరినుండి ఎప్పుడొస్తావు ? చూశావుగా అరుణ ఏం రాసిందో ఉత్తరంలో ?".

"ఇప్పుడే ఏం చెప్పలేను అరవిందా. వెళ్ళనివ్వు నన్ను ముందు. తిరిగి రావాలని మనస్ఫూర్తిగా అనిపిస్తే అప్పుడు తప్పకుండా వస్తాను. లేకపోతే ఇహ అంతే !" అన్నాడు భారంగా.

* * *

చాలారోజుల తర్వాత అరవిందని చూట్టానికి వాళ్ళింటికి వెళ్ళింది దీప. కానీ అరవింద ఇంట్లో లేదు. శ్రీరాం, అరవిందా కలిసి ఎవరింటికో భోజనానికి వెళ్ళారు. ఊరి నుండి వస్తూ మాధవయ్య పట్టుకొచ్చిన పూతరేకుల పాకెట్ బల్లమీదపెట్టి, అమ్మగారొస్తే యివ్వమని పనిమనిషితో చెప్పి వెళ్ళిపోయింది దీప.

ఆ సాయంత్రం మాధవయ్య ఊరెళ్ళిపోతున్నాడు. దీపకి కూడా ఆ పూట పనిలేదు. ఇద్దరూ వరండాలో కూర్చుని మాట్లాడుతున్నారు. అంతలో అరవింద అక్కడికి కొచ్చింది. "ఏం లేదు దీపా ! బజారుకి వెళ్తూ నిన్ను చూసిపోదామ నొచ్చాను. చాలా బావున్నాయి సుమా పూతరేకులు. అవంటే మా వారి కెంతో ఇష్టం" అంది.

"అలాగా !" అని నవ్వుతూ "వీరు మా నాన్నగారు" అంటూ తండ్రిని పరిచయంచేసింది. నమస్కరించింది అరవింద.

"చాలా సంతోషం తల్లీ నిన్ను కలుసుకోవటం. మా దీప ఎప్పుడూ మీ అందర్నీ గురించీ ఉత్తరాల్లో రాస్తూంటుంది," అన్నాడు మాధవయ్య.

దానికి జవాబుగా నవ్వుతూ "ఇంకా ఉంటారా బాబాయ్ రెండురోజులు ?" అంది.

"లేదమ్మా ఇవాళ సాయంత్రం వెళ్ళిపోవాలి. ఇంటిదగ్గర వీళ్ళమ్మ ఒక్కతే వుంది."

దీపని చూస్తూ "నాన్నగారిని ఇంటికి తీసుకురాలేదేం ? కనీసం ఆయన వచ్చారని ఫోనైనా చేసి ఉండకూడదా దీపా ?" నిష్ఠూరంగా అంది అరవింద.

"మీ యింటికి పిల్చుకు రావాలనే అనుకున్నాను అరవిందా. కానీ పని ఎక్కువగా ఉండటంతో, తీరికలేక రాలేదు, అంతే. ఏమనుకోకు."

"సరే ! పదండి బాబాయ్; మధ్యాహ్నం మా యింట్లోనే భోజనం మీకు. నాకు కొద్దిగా బజార్లో పని ఉంది. ఓ అరగంటలో ముగించుకుని వస్తాను. రెడీగా వుండండి," అని వారికి మరో మాట మాట్లాడటాని కవకాశ మివ్వకుండా లేచి వెళ్ళి గబగబా కారులో కూర్చుంది.

దీపమీద అరవిందకి గల అభిమానానికి ముగ్ధుడయ్యాడు మాధవయ్య.

"ఇక చాలునమ్మా; చాలు. ఈ వయసులో ఎక్కువ

తినటం ఆరోగ్యకరం కాదు," అంటున్నా కొసరి, కొసరి వడ్డించింది అరవింద ఆ మధ్యాహ్నం.

భోజనాలయ్యాక యిద్దరూ హాల్లో కూర్చొన్నారు. తాంబూలం పళ్ళెం పట్టుకొచ్చి స్టూలుమీద పెట్టింది అరవింద. మాధవయ్య ఈనెలు చీలుస్తూ, "తల్లీ ! ఈ వయసులో నన్ను వేధిస్తున్నది దీప భవిష్యత్తే నమ్మా. దానికి భగవంతుడు రూపంలో గానీ, తెలివితేటల్లో గానీ ఏ లోటూ చెయ్యలేదు. ఎవరైనా సరే, చూసిందే ఒప్పుకొని చేసుకొంటారు. కానీ దీప ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూంది పెళ్లి. దాని మనసులో ఏముందో మా కెవరికీ అంతు చిక్కటంలేదు. నువ్వే ఆ విషయం తెలుసుకొని ఈ బరువుని మా భుజాలమీదనుండి దింపాలమ్మా. ఒకవేళ దీప ఎవరినైనా మనస్ఫూర్తిగా యిష్టపడుతున్నట్టయితే, అతడి దే కులమైనా కానీ, యోగ్యుడైతే చాలును. మా కందరికీ సమ్మతమే. నాకు నానాటికీ ఒంట్లో ఓపిక నశిస్తూంది. మేం బ్రతికి ఉండగానే నాలుగు అక్షింతలు వేస్తే తృప్తి మాకు. దీనికి నువ్వే పూనుకోవాలమ్మా. ఎందుకంటే దీపకి నువ్వంటే ఎంతో అభిమానం; వాత్సల్యం. నీ మాట కాదంటుందని అనుకోను. ఎలాగైనా ఈ ఏడాది దీప ఓ యింటి దయ్యేటట్టు చూడమ్మా," అన్నాడు ప్రాధేయ పడుతూ.

"తప్పకుండా నేను ప్రయత్నిస్తాను బాబాయ్. ఈ విషయంలో మీరు నిశ్చింతగా వుండండి. దీపని మించిన ఆ ప్తులు నాకెవరూ లేరు. భగవంతుడు తప్పకుండా అలాటి వాళ్ళకి మేలు చేస్తాడు" అంది అరవింద. "వస్తానమ్మా" అంటూ లేచాడు మాధవయ్య.

* * *

ఎగ్జిబిషన్ ద్వారా విరాళాల రూపంగా ముప్ఫయివేల రూపాయలు వసూలయ్యాయి. డాక్టర్ కుమార్ వైద్యంతో ఎంతో క్లిష్టమైన వ్యాధులనుండి నయమైనవారు, మృత్యు ముఖంనుండి బయటపడ్డవారూ, ఆయనమీది అభిమానంతో, కృతజ్ఞతతో ధారాళంగా విరాళాలిచ్చారు. ప్రస్తుతానికి ఈ డబ్బుతోనే మూడు గదుల బ్లాక్ నన్నా కట్టాలనీ, ఉన్న కొద్దీ ధరలు హెచ్చిపోయి ఈ డబ్బెందుకూ పనికిరాకుండా పోతుందని, స్పెషల్ వార్డ్ ఈ ముప్ఫయివేలతోనే కట్టెయ్యాలనీ తీర్మానించారందరూ.

ఒకరోజు యథాలాపంగా అన్నట్టు అంది అరవింద "ప్చ ! దీపా; మంచి అవకాశం పోగొట్టుకున్నాను. లేనట్టయితే యింకో పదివేలయినా సమకూరి వుండేవి !"

"ఎలా అరవిందా ?" ఆశ్చర్యంగా అంది దీప.

"ఎగ్జిబిషన్ రెండోరోజు ఉదయం ఎవరో ఒకతను


*Hearty Diwali Greetings from*

## VENKATESH PAPER MART

**WHOLESALE DEALERS IN PAPER & BOARDS OF ALL VARIETIES ON MOST COMPETITIVE RATES**

**4-6-546, Esamiah Bazar, Hyderabad-500027.**

**Phone : 5 1 8 2 8**

వచ్చాడు. అతను కూడా పెయింటరేనట. నీ పోర్ట్రెయిట్ చూసి చాలా మెచ్చుకొన్నాడు. ఎంతో ప్రాధేయపడ్డాడు ఆ చిత్రాన్ని తన కమ్మెయ్యమని. ఎంత ఖరీదైనాసరే ఫర్వాలేదన్నాడు," అంది అరవింద దీపని నిశితంగా చూస్తూ.

"అయ్యో ! ఎంత పనిచేశావు అరవిందా ? అప్పుడే నా కెందుకు చెప్పలేదు ఈ విషయం," అంది నొచ్చుకుంటూ దీప.

"ఏం ? చెప్తే ఏం చేసేదానివి ? అమ్మేదానివా ?" అంది.

"తప్పకుండా ! మనసులో ఉన్నా అంత డబ్బు ఈ జన్మలో నే నిచ్చుకోలేను. అలాంటప్పుడు మరో విధంగా సమకూరుతూంటే అడ్డుచెప్పటం అన్యాయమే అవుతుంది. చెప్పు అరవిందా, ఎవరతను ? ఈ ఊరి మనిషేనా ?"

"ఏమో బాబూ ! నాకు భయమేసింది. ఇవాళ నీ చిత్రం కావాలంటాడు. రేపు చిత్రంలోని అమ్మాయే కావాలంటే ఏం చెయ్యను ? ఎందుకొచ్చిన గొడవలెద్దూ ?" కొంటెగా చూస్తూ అంది అరవింద.

"చాల్లే నీ ఊహాగానం ! ఇదేమన్నా పురాణ యుగ మనుకొన్నావా చిత్రాలు చూసీ, గుణగణాలు వినీ ప్రేమించటానికి ?"

"ఇది పురాణయుగం కాదనుకో; ఒకవేళ నిజంగా అలా జరిగితే ఏం చేస్తావు దీపా ? పెళ్ళికి ఒప్పుకొంటావా ?"

"ఏమైం దివాళ నీకు ? కొత్తగా ఉందే నీ ధోరణి ?"

కూర్చున్న చోటునుండి లేచి వచ్చి దీప గడ్డాన్ని తన మునివ్రేళ్ళతో పట్టుకుని ఎంతో లాలనగా అంది అరవింద- "దీపా! జీవితంలో నిన్ను మించిన ఆప్తులు నా కెవరూలేరు. నువ్వు కూడా పెళ్ళిచేసుకుని, పిల్లాపాపల్తో హాయిగా ఉండాలని మా అందరి కోరిక. ఇంకా ఎంతకాలం యిలా ఒంటరిగా ఉంటావు. చెప్పు దీపా; నీ మనసుకి నచ్చిన వ్యక్తి ఎవరైనా ఉంటే, మీ వాళ్ళని ఒప్పించి నీ పెళ్ళి జరిపిస్తాను. నా మాటల్ని కొట్టిపారెయ్యకు. మీ కుటుంబం కోసం ఉద్యోగంచేసి మీ వాళ్ళకి సాయంచేశావు ఆర్థికంగా యిన్ని సంవత్సరాలూ. ఇప్పుడు మీ చెల్లి, తమ్ముడు కూడా జీవితంలో స్థిరపడిపోయారుగా ? ఇంకా ఏమిటి నీ అభ్యంతరం ? నా బంగారు తల్లివిగా !"

అరవింద చేతిని తన కుడిచేత్తో పట్టుకుని ఫక్కుమని నవ్వేస్తూ, "అభ్యంతరమా? అలాంటిదేం లేదు నాకు. పైగా మనసులోనే ఏమిటి, కలల్లో, ఊహల్లో కూడా ఏ మానవుడూ లేడు," అంది దీప.

"మరింతకాలం పెళ్లి వాయిదావేస్తూ వచ్చావెందుకు ?" సీరియస్‌గా అడిగింది అరవింద.

"అంత సీరియస్‌గా పెళ్ళి గూర్చి ఆలోచించలేదు నేను యింతకాలం. అంతే ! కానీ యిదేమిటి యివాళ ఈ లెక్చర్ ? ఆ ! అన్నట్టు నాన్న నీకు అప్పగింతలు పెట్టి వెళ్ళాడా ఏం ?" అంది.

"అవును. నీకు లేకపోవచ్చు గానీ, నిన్ను కన్నవాళ్ళకుండదూ ఆదుర్దా ? చెప్పు దీపా ? ఈ ఏడాదైనా చేసుకుంటావా పెళ్ళి ?"

"పెళ్లి సంగతి తర్వాత గానీ, నిజంగానే నా పోర్ట్రెయిట్‌ని ఎంత ఖరీదుకి కొనటానికి సిద్ధపడ్డాడా అతను ?"

"నిజమే దీపా ! తమాషాకి చెప్తున్నాననుకోకు. నా పెయింటింగ్ గూర్చి నే నెప్పుడూ పెద్దగా అనుకోలేదు. నీవేదో సర్దాకొద్దీ అడిగితే ఆషామాషీగా గీసిపెట్టాను. మిగతావన్నీ ఎగ్జిబిషన్ కోసమని ఎంతో శ్రమించి, ఆలోచించి మరీ గీశాను. కానీ వాటిల్లో ఏదీ నచ్చలే దతడికి. ఇదే కావాలని ప్రాధేయపడ్డాడు. పైగా నువ్వా దాన్నమ్మటాని కొప్పుకోలేదుగా మొదటిరోజు ఎవరో అడిగితే ?"

"పోన్లే అరవిందా; జరిగిపోయిందేదో జరిగిపోయింది. మన చేతనైనంత మట్టుకు చేశాం కదా" అంది దీప.

* * *

ఆ మరుసటిరోజు ఉదయం డ్యూటీకి వెళ్ళటానికి సిద్ధం అవుతూంది దీప. డ్రెస్సవటం ముగించి, ప్రతి రోజులాగే ఓ కప్పు ఓవల్టిన్ కలుపుకుంటోంది. అంతలో హడావిడిగా అరవింద లోని కొచ్చింది. "రా ! రా !" అని చిరునవ్వుతో ఆహ్వానించి, ఓవల్టిన్ కప్పు అందించింది దీప.

కప్పు అందుకుంది కానీ అరవింద దాన్ని నోటి దగ్గర పెట్టుకోలేదు. అలాగే దానివంక చూస్తూండిపోయింది.

"చాలా వేడిగా వుందా ? చల్లార్చి తెస్తాను వుండు" అని కప్ అందుకోబోయింది దీప.

"ఫర్వాలేదు దీపా; అలాగే వుండనీ. నీకో విషయం చెప్పాలని వచ్చాను" అంది. ఆ గొంతులో నిరాశ, దైన్యం చూసి "ఏమిటి అరవిందా ? ఏం జరిగింది" అంది దీప ఆదుర్దాగా.

"నిన్న నే నింటికి వెళ్లేసరి కో రిజిష్టర్డ్ లెటర్ వచ్చింది. అందులో అరుణ తాలూకు యిన్స్యూరెన్స్ విరాళంగా పంపించాడు కుమార్ హాస్పిటల్‌కి. ఇదిగో చెక్" అంది.

ఈ మాట విన్నదే దీప హృదయం ఒక్కసారిగా బరువెక్కిపోయింది. "అతడికీ, ఈ ఆస్పత్రికీ వున్న అను

బంధం ఎంత గాఢమైంది ! ఎంత గొప్పది ?? ఇక్కడున్నన్నిరోజులూ, ఈ సంస్థ అభివృద్ధికోసం అహర్నిశలూ ఎంత శ్రమించాడు అతడు. ఆఖరుకి యింతటి దుఃఖ సమయంలో కూడా ఒక విధంగా అతడి దురవస్థకి కారణమైన ఈ హాస్పిల్‌ని మర్చిపోలేదు. పైగా కానుక పంపాడు ! అదీ తన ప్రియమైన భార్య యిన్స్యూరెన్స్... ఎంతటి ఔన్నత్యం !" అనుకొంటూ "పద అరవిందా; నీ చేతుల్లో నువ్వే ఏక్టింగ్ మెడికల్ సూపరింటెండెంట్ కిద్దువుగాని," అంది.

మాటాపలుకూ లేకుండా అలాగే కూర్చుంది అరవింద, ఎటో చూస్తూ.

"రా పోదాం" అంది దీప మళ్ళీ.

నిదానంగా యిటు తిరిగి, దీప మొహంలోనికి బేలగా చూస్తూ "చెక్ పంపిస్తూ ఉత్తరం కూడా రాశాడు కుమార్ మా యిద్దరికీ" అంది హీనస్వరంతో.

"ఉత్తరమా ? ఏం రాశారు అరవిందా ?" ఆత్రంగా అడిగింది దీప.

"ఇక యిక్కడికి వచ్చి, పాత స్మృతుల మధ్య జీవించటం తనవల్ల కాదనీ, ఇహ ఈ జీవితంలో డాక్టర్‌గా తన పాత్ర ముగిసిందని రాస్తూ, తన రెజిగ్నేషన్ లెటర్ ఉత్తరంతో జతచేసి పంపించాడు. వాళ్ళ ఊళ్ళోనే వాళ్ళ తాతగారి దగ్గర ఉండిపోతాడట..." చెప్పుకుపోతూంది అరవింద.

"అసంభవం అరవిందా ! నే నొప్పుకోను ఆయన యిక అస్త్రసన్యాసం చేస్తానంటే. ఇంతమందికి ధైర్యం నూరిపోసి, బ్రతుకుమీద ఆశ చిగురింపజేసిన డాక్టర్ కుమార్‌లాటి మహోన్నతుడు, యిలా అనాసక్తంగా వుండటం భగవంతుడి దృష్టిలో అపరాధమే అవుతుంది. సర్జరీలో అతడికున్న నైపుణ్యం, ఆ తెలివితేటలూ, హస్తవాసీ, భగవత్ప్రసాదితాలు కావూ ?? చెయ్యరాని పనులు చెయ్యటం ఎలా నేరమో అలాగే చెయ్యటానికి సమర్థత వుండీ చెయ్యక పోవటం, నిర్లిప్తత వహించటం నేరం. అది క్షమార్హం కాదు ఎన్నటికీ..." ఆవేశంగా అంది దీప,

"ప్చ్ ! ఎలా అతడికి నచ్చజెప్పటం ? మన మాటలు వినే స్థితిలో లేడతను దీపా" అంది అరవింద నిరాశగా.

"ప్రయత్నించాలి అరవిందా ! ఎలాగైనా ఆయన మళ్ళీ యిక్కడికే రావాలి. అతడి ప్రతిభ యింతటితో మాసిపోవటానికి వీల్లేదు." దృఢంగా అంది దీప.

* * *





INDIA
BLOCK MAKERS
GANDHINAGR_VIJAYAWADA-3
PHONE:72295

INDIA
BLOCK MAKERS
3-6-430/1 LIBERTY ROAD
HYDERABAD

క్రొత్తబ్లాక్ కట్టటం దాదాపు పూర్తయింది. అందరి మనసుల్లోనూ ఒకటే కోరిక, ఆ బిల్డింగ్ ప్రారంభోత్సవం డాక్టర్ కుమార్ స్వయంగా వచ్చిచెయ్యాలని. చివరికి ఉత్తరం రాశారు ఫలానా తేదీ ప్రారంభోత్సవం చెయ్యాలనుకొంటున్నామనీ, ఆ రోజుకి తప్పకుండా రావాలనీను.

వెంటనే జవాబు వచ్చింది ఈ వుత్తరానికి, డాక్టర్ కుమార్ నుండి. "అందరి ఆశల ప్రతిరూపమైన ఆ బిల్డింగ్ ఈనాటికి పూర్తయినందుకు చాలా సంతోషిస్తున్నాననీ, హాస్పిటల్ యిలాగే దినదిన ప్రవర్థమాన మవాలనీ, తాను మానసికంగా కోలుకోటానికింకా కొంత సమయం పట్టవచ్చు గనుక, యిప్పట్లో రాలేకపోతున్నందుకు క్షమించమనీ" వుందా వుత్తరంలో. అది చూశాక అందరికీ దిగులూ, నిరాశ కలిగాయి ఒక్కసారిగా.

ఆ మరుసటిరోజు ఏక్టింగ్ మెడికల్ సూపరింటెండెంట్ దగ్గరికి వెళ్ళి తన సెలవు చీటీ యిస్తూ, "డాక్టర్ నేను మూడు రోజులు సెలవు అప్లై చేశాను. రేపే డాక్టర్ కుమార్ వాళ్ళ వూరు వెడుతున్నాను. ఆయనకి నచ్చజెప్పి, బ్రతిమాలి, ఎలాగైనా యిక్కడికి మళ్ళీ వచ్చేలా ప్రయత్నిస్తాను." అంది దీప.

"అలాగే వెళ్ళిరామ్మా! ఐ విష్ యూ ఆల్ ద బెస్ట్" అన్నారాయన చిరునవ్వుతో.

* * *

అదొక చిన్నవూరు. పల్లెటూరికన్నా కాస్త పెద్దదే నన వచ్చు. అప్పుడే ప్రొద్దుగుంకటంవల్ల మసక చీకటిగా వుంది. కమ్ముకొంటూన్న చీకట్లని పారద్రోలాలని నక్షత్రాలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. చంద్రోదయం కావటానికింకా వ్యవధి వుంది.

ఆరుబైట ఈజీచైర్లో వెనక్కి వాలి కళ్ళు మూసుకుని కూర్చుని వున్నాడు డాక్టర్ కుమార్. చిరుగాలికి జుట్టు కాస్త చెదిరి నుదుటిమీద పడుతూంది. ప్రక్కనే రాటకి కట్టిన గేదెపాలు తీస్తున్నాడు పాలేరు. పట్నం నుండప్పుడే బళ్లలో వచ్చిన ఎరువుల్ని లోపల పెట్టిస్తున్నారు కుమార్ తాతగారు.

బండి దిగి, డబ్బిచ్చేసి, బాగ్ చేత్తో పట్టుకుని, నెమ్మదిగా నడిచి వస్తూన్న దీపని చూసి, "బాబుగారూ; ఎవరో వస్తున్నారండీ" అన్నాడు పాలేరు.

కళ్లు విప్పి చూశాడు కుమార్. దీప బాగా దగ్గరికి వచ్చేసినా, ఆనవాలు పట్టలేకపోయాడా మసక వెలుగులో.

మరో నాలుగడుగులు వేసి, అతడిని గుర్తుపట్టి అతి మెల్లని స్వరంతో "డాక్టర్"! అంది.

ఆ స్వరం, ఆ పదం విన్నదే ఒక్కసారిగా త్రుళ్ళిపడ్డాడు! ఆశ్చర్యాన్నణచుకొంటూ? "దీపా..సిస్టర్..మీరా?" అంటూ లేచి నుంచున్నాడు.

"అవును డాక్టర్ నేనే; దీపని! మీ ఉత్తరం చూసి యిలా వచ్చాను."

ఒక్కసారిగా అతడి మొహం ప్రఫుల్లమైంది. సంతోషంతో వుక్కిరిబిక్కిరవుతూ, ''రా; రామ్మా లోపలికి'' అని లోనికి తీసుకువెళ్లాడు.

మనిషి కొద్దిగా చిక్కి, నల్లబడ్డాడు. మాటల్లో, నడకలో చురుకుదనం తగ్గింది. అన్ని పనులూ యాంత్రికంగా చేస్తూన్నట్టుంది. గుండెలో దుఃఖం గూడుకట్టుకోవటం వల్లనేమో మాట భారంగా విన్పిస్తూంది. ఆ కంఠంలో తొణికిన ఆవేదన చూసి దీప హృదయం ద్రవించింది.

"అమ్మమ్మా; యిదుగో ఈ అమ్మాయి అరవింద స్నేహితురాలు; దీప. మా హాస్పిటల్ నుంచొచ్చింది," అన్నాడు పరిచయం చేస్తూ.

ముసలావిడ లేచి యివతలికి వచ్చి, "రా అమ్మా! నీ గురించి కుమార్ చాలాసార్లు చెప్పాడు. నువ్వు మా యింటికి రావటం చాలా సంతోషం. ఎలావుంది అరవింద ?" అంటూ ఆప్యాయంగా దీపచేతిని పట్టుకుని లోపలికి తీసుకు వెళ్ళింది.

ప్రయాణంలో బాగా అలిసిపోయినందుచేత భోజనం అయిందే వెళ్ళి పడుకుంది దీప. గాఢంగా నిద్ర పట్టేసింది. పెందరాళే నిద్రపోవటంవల్ల తెల్లవారుఝామునే మెలకువ వచ్చేసింది. ఓ పదినిమిషాలసేపు బద్ధకంగా అలాగే పడుకుని, ఆ తర్వాత కిటికీలోనుండి బయటికి చూసింది. మసక మసకగా వున్నా పల్లెటూరు కావటంవల్ల పనుల హడావిడి అప్పుడే ప్రారంభమైనట్టుంది. నెమ్మదిగా లేచి, తలుపుతీసి బయటికొచ్చింది. పాలేరు కాబోలు సన్నగా రాగం తీస్తూ పాలు తీస్తున్నాడు. పితుకుతూన్న పాల ధార లయబద్ధంగా చెంబులో పడుతూంటే వినటానికెంతో యింపుగా వుంది. పక్కనే రాటకి కట్టేసివున్న లేగదూడ గడ్డిపరకల్ని కొరుకుతూ, పాలు తియ్యటం ఎప్పుడు ముగుస్తుందా, తాగటానికి తన వంతు ఎప్పుడు వస్తుందా అని యింతింత కళ్లతో తల్లిని చూస్తూంది ఆశగా. అప్పుడే బయటికి వదిలిపెట్టారేమో కోడీ, దాని పిల్లలూ చిత్రంగా శబ్దం చేస్తూ, గింజలేరుకుని తింటున్నాయి. అప్పుడే నీళ్లలో మునిగి వచ్చిన పిట్టలు, ములగచెట్టుమీద కూర్చొని టపటపా రెక్కలు విదుల్చుకొంటున్నాయి. ఎంతో హాయిగా, ఆహ్లాదకరంగా వుందా ప్రభాతసమయం. ఆలోచనలతోబాటు దీప అడుగులు కూడా ముందుకి సాగాయి.

ప్రకృతిసౌందర్యా నాస్వాదిస్తూ, నెమ్మదిగా నడవ సాగిందా కాలిబాట వెంట దీప. అడవిపూల పరిమళంతో నిండిన గాలి మెత్తగా, స్నేహపూర్వకంగా తాకుతూంది శరీరాన్ని. గడ్డిమీదున్న మంచు బిందువులతో కొద్ది కొద్దిగా తడుస్తూన్నాయి కుచ్చెళ్లు. రాత్రంతా వెన్నెల వెదజల్లిన చంద్రబింబం, ఆ లేతవెలుగులో పాలిపోయి కన్పిస్తూంది. అప్పుడే గొర్లకుర్రాళ్లు పశువుల్ని తోలుకు వెడుతున్నారు మేతకి. ఆ మందలో ఒక ఆవు దీప కట్టుకున్న తెల్లచీర చూసి బెదిరి, ఆమె వైపు పరుగెట్టింది వున్నట్టుండి. ఎటో చూస్తూ, తీవ్రంగా ఆలోచిస్తూ, చేతులు కట్టుకుని నడుస్తూన్న దీప హఠాత్తుగా ఆ ఆవు తనవైపు రావటంతో కంగారుగా పరుగెత్తబోయి, ముందుకి తూలింది. అంతలో డాక్టర్ కుమార్ దృఢమైన చెయ్యి ఆమె జబ్బని పట్టుకుని పడిపోకుండా ఆపింది.

భయంతో వణికిపోతూన్న దీప, తనని తాను సంబాళించుకోవటాని కన్నట్టు ఎడంచేత్తో గుండెల్నదిమి పట్టుకొంటూ, "థాంక్స్ డాక్టర్" అంది హీనస్వరంతో.

"దీపా; భయపడిపోయావా అమ్మా! ఐ యాం సారీ" అన్నాడు ఆమె చేతిని వదిలేస్తూ ఆదరంగా అతడు.

"అవును డాక్టర్! మీరే గనుక సమయానికి రాకున్నట్టయితే ఏమైపోయేదాన్నో!" అంది యింకా భయపడుతూనే.

"నిజమే! వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పింది. ఉదయాన్నే అలా నడిచి వెళ్ళిరావటం అలవాటు చేసుకొన్నా నీ మధ్య. తిరిగి వస్తూంటే ఎవరో తెల్లచీర కట్టుకుని రావటం కన్పించింది. నువ్వే ననుకోలేదు నేను. ఏమిటో విధి; నామీద కోపాన్ని నా కత్యంత ఆప్తులైనవారి మీద తీర్చుకొంటూంది; ప్చ్!" అన్నాడు బరువుగా.

దీపనుండి ఏ సమాధానమూ రాలేదు. మౌనంగా నుంచుండిపోయింది ఎటో చూస్తూ.

అలా ఆమె నిశ్శబ్దంగా వుండిపోవటం చూసి "దీపా! యింకా భయం తగ్గలేదా! రా! కాసేపు ఈ రాయిపైన కూర్చుందాం" అన్నాడు.

తెలతెలవారుతోంది తూర్పు. భూమినీ ఆకాశాన్నీ వెలుగుతో కడుగుతూన్నట్టుం దెవరో. ప్రకృతి కళకళలాడుతూ ఎంతో స్వచ్ఛంగా వుంది. ఆ రాయిపైన సర్దుకొని కూర్చుంటూ, "డాక్టర్! నేను రేపు వెళ్ళిపోతున్నాను" అంది దీప అతి మెల్లని స్వరాన.

"ఇంత త్వరగా వెళ్ళిపోతావా? ఇంకా రెండు రోజులు లీవ్ పొడిగించకూడదూ?" అన్నాడు.

"వీల్లేదు డాక్టర్. నే నొక్కదాన్నే యిప్పుడు థియేటర్ నర్స్‌ని. సూసన్ లీవ్‌మీద వెళ్ళింది వాళ్లవూరు. లేకున్నట్టయితే యింకా రెండు రోజులేం రెండు నెలలైనా యిక్కడే వుండిపోదామన్పిస్తూంది... కానీ డాక్టర్! మిమ్మల్నోమాట అడగనా? నామీద కోపం తెచ్చుకోరుగా?" అంది అర్థింపుగా.

ఒక్కసారిగా అతడి మొహం గంభీరంగా మారిపోయింది. అయిష్టతను వ్యక్తంచేస్తున్నట్టు మొహం ప్రక్కకి తిప్పుకొని, "నాకు తెలుసు సిస్టర్ ఆ మాటేమిటో? నన్ను తిరిగి అక్కడికి రమ్మనమనేగా??" అన్నాడు.

గొంతు నిండుగా మార్దవం నింపుకుని, "ఆ! అవును డాక్టర్! అది నా ఒక్కదాని కోరిక మాత్రమేకాదు. అందరిదీను. మన్నించరూ నా మాట!'' అంది అతడినే చూస్తూ.

''లేదు దీపా! ఇక ఈ జీవితం యిలా గడిపేయ్యాలనే నా నిశ్చయం. నావృత్తిపైన ఆసక్తి నశించింది. ఇక అక్కడికి వచ్చినా నావల్ల మీకేమీ లాభం వుండదు" అన్నాడు. బరువుగా ఉందాతడి స్వరం.

"మరి మీ పేషెంట్స్, స్టాఫ్ మాటేమిటి! ఎలా వుండగలరు వాళ్లందరినీ వొదిలిపెట్టి? ఇహ వాళ్ల గతి అంతేనా?"

"నెమ్మదిగా అదే అలవాటవుతుంది దీపా; నేను లేకపోతేనేం? అక్కడ యింకా చాలామంది డాక్టర్లున్నారు, వాళ్లని చూడటానికి" అన్నాడు.

"అన్నారు; నిజమే! కానీ మీ స్థానాన్ని మరెవ్వరూ భర్తీ చెయ్యలేరన్న నిజం మీకు తెలీదేమో కానీ, మీ పేషెంట్లకి మాత్రం బాగా తెలుసు!"

"అది మీ అందరి భ్రమ! అంతే,'' అన్నాడు పేలవంగా నవ్వుతూ.

"అయితే ఓ విషయం చెప్తాను వినండి. మీ పాలమనిషి వుండేదిగా రంగమ్మ అని? ఆమె మొన్ననే కాన్సర్‌తో చచ్చిపోయింది."

హతాశుడైనట్టు చూశాడామె వైపు. విచారం ధ్వనిస్తూన్న కంఠంతో, "ప్చ్! ఎంత అన్యాయం జరిగిపోయింది దీపా; ఎవరూ డయాగ్నైజ్ చెయ్యలేదా? లేక ఆ మనిషి నిర్లక్ష్యం చేసిందా?" ఆదుర్దాగా అడిగాడు.

''చివరిదాకా ఎవరూ కనుక్కోలేకపోయారు. బాగా ముదిరాక తెలిసింది. కానీ అప్పటికే పరిస్థితి చెయ్యిదాటిపోయింది. లేకపోతే బ్రెస్ట్ కాన్సర్ వచ్చీ, సకాలంలో ఆపరేషన్ చేయించుకొని బ్రతికినవా ళ్లెంతమందిలేరు?? పాపం! రంగమ్మ అంత జబ్బులోనూ మిమ్మల్ని తల్చుకుని తెగ ఏడ్చింది. "ఆ బాబే వున్నట్టయితే నా గతి యిలా

అయ్యేదా? అతడిని చూసిందే నా జబ్బెప్పుడో పారిపోయి వుండేది. నేను బ్రతికివుండేదాన్ని," అని తల్లిని పోగొట్టుకున్న పిల్లలా చివరిదాకా మీకోసం ఆక్రోశించింది..."

మాటాపలుకూ లేక నిశ్చలంగా కూర్చుండిపోయాడు డాక్టర్ కుమార్. కళ్లు కొద్దిగా చెమర్చాయి. హృదయంలో సంచలనం రేగుతోం దనడానికి నిదర్శనంగా గుండెలు ఎగసిపడుతున్నాయి.

మళ్ళీ చెప్పసాగింది దీప. "డాక్టర్ ఒకరోజు ఏదో పనిమీద మీ గదికొచ్చాను. ఆవేళ మీరు లీవ్‌లో వున్నారు. చిందరవందరగా నున్న మీ టేబిల్ సర్దసాగాను. అప్పుడు అక్కడున్న మెడికల్ జర్నల్ ఒకటి నా కన్పించింది. ఆ పూట నాకంతగా పనిలేకపోవటంతో పట్టుకెళ్ళి, నా గదిలో కూర్చుని పేజీలు తిరగేస్తూంటే ఏదో వ్యాసం కనిపించింది. చదవసాగాను. ఎంతో ఆసక్తికరంగా వుంది. ఇప్పుడు ఆ వ్యాసం గుర్తులేదు కానీ దాని చివరనున్న వాక్యాలు మాత్రం నా హృదయానికి హత్తుకుపోయాయి..."

"ఏమిటి అది?" కుతూహలంగా అడిగాడు.

"ఆ ఆర్టికల్ రాసింది క్లార్క్ అన్న అతడు. అతడు డాక్టరో కాదో నాకు తెలీదు; గుర్తు కూడా లేదు. కానీ ఏం వ్రాశాడంటే, 'ఏ డాక్టర్ షుడ్ క్యూర్ వెన్ హి కెన్, హీల్ ఆఫన్, అండ్ కంఫర్టు ఆల్‌వేస్ '("A doctor **should cure when he can, heal often, and comfort always''**) చూశారా; ఎంత గొప్ప భావం యిమిడివుందో ఈ రెండు వ్యాకాల్లో?'' దీప అంది.

ఈ మాట లొక్కసారిగా అతడి హృదయపులోతుల్ని స్పృశించాయి. విచారగ్రస్తంగావున్న అతడి మొహం ఒక్కసారిగా ప్రసన్నంగా మారింది. ఏదో సత్యం... ఏదో మహత్తర సందేశాన్ని వింటున్నటుగా... ఏదో దివ్యమైన వెలుగుని చూస్తున్నట్టుగా, ఆశ్చర్యంగా ఆమెవైపు కొద్ది క్షణాలసేపు చూసి, హఠాత్తుగా లేచి నుంచున్నాడు. వెల్లువలాగా నూతనోత్తేజం, శక్తీ వచ్చాయాతడి శరీరంలోకి. చీకటిలాటి అతడి గతం ఆ వెలుగు వరదలో కొట్టుకుపోయింది ఒక్కసారిగా.

నెమ్మదిగా తలెత్తి అతడిని చూసింది దీప. ఆ కళ్లు నూతనోత్సాహంతో మెరుస్తున్నాయి. ఆ మొహంలో... దుఃఖితులకు చేసే పరిచర్యలో గల ఆనందం, దివ్యానుభూతి వ్యక్తమవుతున్నాయి.

"పద దీపా! రేపే బయలుదేరుదాం. ఇక ఆలస్యం చెయ్యను" అన్నాడు. స్థిరంగా వుందాతడి స్వరం.


*With best compliments of*

# SUN PAPER AGENCIES

**Paper Merchants**

6, General Bazar, Secunderabad - 500 003.

Phone : 7 2 9 9 7

Grams - Newsprint

సంతోషంతో వుక్కిరిబిక్కిరై పోతూ దీప చప్పున లేచి నుంచొని ''నిజంగా వస్తారా డాక్టర్? మళ్ళీ మనసు మార్చుకోరుగా?" అంది.

"ఉహూ లేదు దీపా; ఇక మనసు మార్చుకోవటం అంటూ వుండదు. దుఃఖానికి ఉపశమనం మరో దుఃఖి తుడికి సపర్యచెయ్యటంలోనూ, ఆసరాకోసం చెయ్యందించటంలోనూ తప్ప మరి ఎక్కడా లేదన్న సత్యాన్ని యిప్పుడే గ్రహించాను. ఇక అరుణకోసం దుఃఖించటం అవివేకమే అవుతుంది. ఎంత విచిత్రం దీపా? నిన్న సాయంత్రం నువ్వు రాకముందు ఏం తోచక ట్రాన్సిస్టర్ ఒళ్లో పెట్టుకుని యధాలాపంగా ట్యూన్ చేశాను. సిలోన్‌లో ప్రతి గురువారం సాయంత్రం వినవచ్చే పదిహేను నిమిషాల ప్రోగ్రాం, "జిమ్ రీవ్స్ కార్నర్" ప్రసారితమవుతూంది. అతడి పాటంటే నాకెంతో ప్రాణం. ఆ పాట చరణం ఏమిటనుకున్నావో తెలుసా!? 'అక్రాస్ ద గ్రేవ్ దేరీజ్ నో సారో; అక్రాస్ ద గ్రేవ్ దేరీజ్ నో మోర్ పెయిన్' అని! ఎంత అర్థం, భావం యిమిడి వున్నాయి ఈ వాక్యాల్లో అని ఆలోచిస్తూంటే అంతలోనే నువ్వొచ్చావు. నన్ను మీ కందరికీ అర్పించి మరీ వెళ్ళిపోయింది అరుణ. కాబట్టి నేను మళ్లీ అందరి మధ్యకి వెళ్లకపోవటం అరుణ ఆత్మ సహించదు. పద దీపా; యింటికి వెళ్దాం. సర్దుకోవాలి సామాను'' అన్నాడు.

* * *

కుమార్ తిరిగి ఉద్యోగానికి వెళ్తున్నాడన్న విషయం విని అతడి తాతయ్యా, అమ్మమ్మా ఒక రకంగా సంతోషించారు. అక్కడ పని వొత్తిడిలోనైనా తన దుఃఖాన్ని మర్చిపోతాడ్.

కడుపు నిండుగా భోంచేసి, ఆరుబయట వెన్నెల్లో కూర్చుని, చాలాసేపు అవీయివీ మాట్లాడి, రాత్రి బాగా ప్రొద్దుపోయాక, ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళి పడుకున్నారు. ఆ మరునాటి ఉదయం ఆరుగంటలకే ప్రయాణం కాబట్టి సామానంతా సర్దేసి బండివాడికి చెప్పివుంచారు, తెల్లవారుఝామునే రమ్మనమని.

ఊరు మాటు మణిగింది. అందరూ గాఢనిద్రలో మునిగివున్న సమయం. అంతలో ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తున్నట్టు ఎవరో యిద్దరు మనుషులు, "బాబుగారూ, తలుపు తియ్యండి బాబుగారూ," అంటూ గట్టిగా తలుపు కొట్టసాగారు.

ఒక్క ఉదుటున లేచి, బయటకొచ్చి లైటు వేశాడు డాక్టర్ కుమార్. ఆ లైటు వెలుగులో కనిపించిన దృశ్యం చూసి కొయ్యబారిపోయాడు. అరుగుమీద రక్తం మడుగులో దొర్లుతూ ఒక వ్యక్తి అమ్మా, అయ్యో అని మూలుగుతున్నాడు. అతడిని మోసుకొచ్చిన ఆ యిద్దరి బట్టలు కూడా రక్తంతో తడిసి వున్నాయి.

"ఏమిటిది? ఎవరితను? ఖూనీయా?" ఆదుర్దాగా అడిగాడు కుమార్.

"ఎవరో తెలీదు బాబుగారూ. మేం సంతకి బళ్లు కట్టుకుని వెళ్తూంటే, దారి మధ్యన యితడు పడివుండటం కన్పించింది. ఇతడు ప్రయాణంచేస్తున్న కారుని ఏ లారీయో గుద్దేసి వెళ్ళిపోయినట్టుంది. ఒంటరిగా దిక్కు లేకుండా గాయాలు తగిలి రోడ్డుమీదపడి మూలుగుతుంటే, ఏం చెయ్యాలో తెలీక మీ దగ్గరికి మోసుకొచ్చాం డాక్టర్ బాబూ" అన్నారు వాళ్లు ఎంతో వినయంగా.

ఈ అలికిడికి కుమార్‌వాళ్ళ తాతయ్యకీ, అమ్మమ్మకీ, దీపకీ కూడా మెలకువ వచ్చింది. ఏమిటి? ఏం జరిగిందంటూ అందరూ బయటకొచ్చారు. డాక్టర్ కుమార్ నెమ్మదిగా ఆ వ్యక్తి దగ్గరగా వెళ్ళి అతడి మొహంమీదికి వంగి చూశాడు. అంతే! మరుక్షణం త్రాచుపాముని చూసినట్టుగా ఉలిక్కిపడి వెనక్కి రెండడుగులువేసి, "మై గాడ్" అన్నాడు గట్టిగా.

సంగతేమిటో అర్థంకాని దీప అతడి దగ్గరగా వచ్చి నుంచుని, "ఏమిటి డాక్టర్; చచ్చిపోయాడా?" అంది.

"సిస్టర్...సిస్టర్...జయరాం...హి ఈజ్ జయరాం!" అన్నాడు తడబడుతూ

స్వార్థంతో, కపటోపాయాల్తో అందరినీ వంచించి, వాళ్ళ జీవితాలతో చెలగాట మాడుకున్నాడు జయరాం. ఎవరి జీవితాన్ని కంటకప్రాయం చేశాడో, ఎవరి పచ్చటి సంసారంలో కార్చిచ్చు రగిల్చాడో, అతడి చేతికే వెతికి పట్టుకొచ్చి, అప్పగించింది విధి పగ తీర్చుకోమన్నట్టు.

దగ్గరున్న స్తంభాన్ని ఆసరాకోసం అన్నట్టు గట్టిగా పట్టుకుని మౌనంగా కొద్ది నిమిషాలసేపు నుంచుండిపోయాడు డాక్టర్ కుమార్. ఇంకా ఆశ్చర్యంనుండి తేరుకొనని దీప బొమ్మలా నుంచుండిపోయింది. జయరాంని మోసుకొచ్చిన మనుషులు అప్పటికే వెళ్ళిపోయారు పనుందంటూ.

ఒక్కసారిగా కుమార్‌ని ఎవరో గట్టిగా కుదిపినట్టయింది. అతనిలోని వైద్యుడు హఠాత్తుగా మేల్కొన్నాడు. గబగబా జయరాం వున్నచోటుకి వెళ్ళి, అతడిని అతి జాగ్రతగా పట్టుకుని సరిగ్గా పడుకోబెట్టి ఎంతో ఆదరంగా, "జయరాం! చాలా బాధగా వుందా! ఒక్క నిమిషం వుండు, కట్టు కట్టేస్తాను" అన్నాడు అతడి మొహంమీదకి వంగి.

చిరపరిచితమైన ఆ కంఠస్వరాన్ని గుర్తుపట్టిన జయరాంకి ఎవరో కొరడాతో చెళ్ళున చరిచినట్టయింది! ఎంతో ప్రయాసతో తల త్రిప్పిచూశాడు. ఆ మొహమే! అమాయకమైన ఆ కళ్ళే! గంభీరమైన ఆ స్వరమే! సందేహం లేదు. నిశ్చయంగా యిప్పుడు తనెదుట నున్నది మరెవరో కాదు; డాక్టర్ కుమార్! ఈ నిజం గ్రహించిందే అతడి బాధ వెయ్యిరెట్లు అధికమైంది. గుండె పశ్చాత్తాపంతో దహించుకు పోసాగింది. పళ్ళబిగువున బాధని ఓర్చుకొంటూ "మీరా?! మీరేనా డాక్టర్ కుమార్? మీరేనా......యింత ఆదరంగా మాట్లాడుతూన్నది! రావలసిన చోటికే వచ్చాను చివరికి. ఐ యాం...గ్లాడ్; నో...నో...ఐ యాం సారీ...!" అంటూ రెండు చేతుల్తో మొహాన్ని కప్పుకుని వెక్కి వెక్కి ఏడవసాగాడు.

"ష్! జయరాం వూరుకో; ఎక్కువగా మాట్లాడి అలసట తెచ్చుకోకు. పడుకో, వెంటనే నీకు కట్టుకట్టి యింజెక్షనిస్తాను," అని లోపలికి వెళ్ళాడు.

ఈ మాట విన్నదే దీప లోపలికి గబగబా వెళ్ళి, తన తెల్లచీర తీసుకొచ్చి చింపి కట్టు కట్టింది గట్టిగా. అయినా రక్తం ఏకధారగా స్రవించసాగింది.

మరో రెండు నిమిషాలకి డాక్టర్ కుమార్ జయరాంకి ఇంజెక్షనిస్తూ, "సారీ జయరాం, ఈ ఒక్క యింజెక్షన్ తప్పితే యింకే మందూ లేదు నా వద్ద. ఏమీ అనుకోకు." అన్నాడు నొచ్చుకుంటూ.

బాధతో మెలికలు తిరిగిపోతూ, "కుమార్; నాకోసం విచారిస్తున్నావా?? నా స్థితి చూసి జాలిపడుతున్నావా పైగా?? మై పూర్ ఫెలో! నాకు నువ్విివాల్సింది మందు కాదు కుమార్...విషం! నామీద కరుణ చూపించి నన్నింకా బాధపెట్టకు...వొద్దు...నేనది భరించలేను. నాకు తెలిసిందల్లా పగ, ప్రతీకారం మాత్రమే. తట్టుకోలేకుండా వున్నాను నీ మంచితనం, కుమార్...నీ చేతుల్తో యింత విషం యివ్వు. సంతోషంగా స్వీకరిస్తాను. ప్లీజ్......" అంటూ పిచ్చిగా మాట్లాడసాగాడు.

"సిస్టర్! మంచినీళ్ల తెచ్చి త్రాగించండి," అని "తాతయ్యా రెడ్డిగారికి కబురుపెట్టి వారి జీప్ తెప్పించు. ఇతడిని వెంటనే పట్నం తీసుకువెళ్ళాలి, ఊ; త్వరగా!" అన్నాడు.

కానీ పట్నం వెళ్ళే అవసరం లేకపోయింది. కన్నతల్లి వొడిలాంటి కుమార్ వొడిలో తల పెట్టుకుని, కళ్ళనిండుగా నీళ్ళు నింపుకుని, రెండు చేతులూ జోడించి, మాట్లాడే శక్తి లేక మౌనంగా సెలవు తీసుకొన్నాడు జయరాం; శాశ్వతంగా వారందరి వద్దా.

* * *

డాక్టర్ కుమార్ తిరిగి చార్జ్ తీసుకొన్నాడు. కొత్త కళ ఆవరించింది హాస్పిటల్‌ని. అతడు రావటంతో కొత్త బిల్డింగ్ ప్రారంభోత్సవం తాత్కాలికంగా వాయిదా వేశారు.

ఆ వేళ సాయంత్రం డ్యూటీ ముగించుకుని క్వార్టర్స్‌కి వెళ్తూంది దీప. ఎవరో వచ్చి చెప్పారు డాక్టర్ కుమార్ పిలుస్తున్నారని. వెళ్ళింది అతడి గదికి. అక్కడ అతనితోబాటు అరవింద, శ్రీరాంకూడా కూర్చొని వున్నారు. వాళ్ళని చూస్తే ఎంతోసేపటినుండి దేన్నిగురించో తర్కించి, ఓ నిశ్చయాని కొచ్చినట్టుంది.

''కూర్చో దీపా!" అంది అరవింద నవ్వుతూ. అక్కడున్న ఖాళీ కుర్చీలో కూర్చుంటూ ఏమి టిదంతా అన్నట్టు చూసింది.

ఉన్నట్టుండి మొహం నిండుగా సీరియస్‌నెస్ తెచ్చి పెట్టుకొంటూ, ''దీపా! ఒకరోజు నువ్వేమన్నావో గుర్తుందా? నేనేం ఆజ్ఞాపిస్తే అది తప్పకుండా శిరసావహిస్తానని? మర్చిపోలేదు కదూ ?" అన్నాడు డాక్టర్ కుమార్.

సన్నగా నవ్వుతూ "లేదు డాక్టర్!" అంది దీప.

"రేపు రాత్రి అరవింద వాళ్ళింట్లో డిన్నర్ వుంది. నువ్వు రావాలి. మీ నాన్నని కూడా రమ్మని టెలిగ్రాం యిచ్చిందట అరవింద. ఇదంతా దేనికని ఆశ్చర్యపోతున్నావేమో? నీ కిదివరకే అరవింద చెప్పిందట కదూ సిద్ధార్థ గూర్చి? రేపు రాత్రి అతడుకూడా వస్తున్నాడు. నీవతడిని కలుసుకోవాలనే ఈ ఏర్పాటు చేసింది అరవింద. ఆ తర్వాత నీ యిష్టం తెలియజెయ్యి," అన్నాడు యింకా సీరియస్‌గా, తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో.

ఏ సమాధానమూ యివ్వకుండా అలాగే కూర్చుంది దీప చాలాసేపటివరకూ. ఆ తర్వాత తలెత్తి అతడినే చూస్తూ అతి మెల్లని స్వరాన అంది, "మిమ్మల్నందరినీ, ఈ హాస్పిటల్‌నీ పెళ్ళికోసం వొదిలిపెట్టి వెళ్ళాలంటే నా మనసొప్పటంలేదు డాక్టర్! నన్నిలాగే వుండనివ్వండి. నా కిక్కడే బావుంది. ఈ తృప్తి చాలు నాకు. ఇంతకు మించిన సుఖసౌఖ్యాలు నా కక్కర్లేదు," అంది.

ఒక్కసారిగా డాక్టర్ కుమార్ హృదయం ఆమెపట్ల వాత్సల్యంతో నిండిపోయింది. "దీపా; నువ్వు వెళ్ళిపోతే నీకన్నా ఎక్కువ బాధపడవల్సినవాళ్ళం మేము. మా అందరి జీవితాల్లోకి వెలుగు తీసుకొచ్చావు. అలాగే నీ

# యువ

పాఠకులకు, ప్రకటనదారులకు,

ఏజంట్లకు, శ్రేయోభిలాషులకు

## దీపావళి శుభాకాంక్షలు


జీవితంలోకికూడా వెలుగు రావాలి...నీకో తోడు కావాలి. ఇది మా అందరి కోరిక. కాదనకమ్మా" అన్నాడు ఆదరంగా.

చాలా సేపు ఏదో ఆలోచిస్తూ తల వొంచుకుని కూర్చుండి పోయింది. ఏం సమాధానం చెప్తుందోనని అందరూ ఆమె వైపే చూడసాగారు. ఆ తర్వాత మెల్లటి స్వరాన అంది "అలాగే డాక్టర్; మీ యిష్టప్రకారమే కానివ్వండి," అని.

ఈ మాట విన్నదే అరవింద మొహం సంతోషంతో వికసించింది. ఆమె నవ్వుతూ ఏదో చెప్పబోయేసరికి డాక్టర్ కుమార్ తన కుర్చీలోనుండి లేచివెళ్ళి దీప శిరస్సు మీద తన కుడిచేతిని వుంచి, "దీపా; నువ్వు సుఖ సంతోషాలతో ఎప్పుడూ కలకలలాడుతూ వుండాలి. నీ వైవాహిక జీవితం పచ్చగా, ఏ ఒడిదుడుకులు లేకుండా సాఫీగా చల్లగా, సాగిపోవాలి; ఈ ఆశీర్వాదమే నీకు నే నివ్వగలిగిన కానుక" అన్నాడు అనునయంగా.

*　　*　　*

కొత్త బ్లాక్ ఎంట్రెన్స్‌వద్ద గుమ్మానికి పైగా అరుణ ఫోటో వుంచారు. ఆ బ్లాక్‌కి అయిన మొత్తంలో ఎక్కువ భాగం అరుణ యిన్సూరెన్స్ తాలూకు డబ్బే అవటంవల్ల అరుణ పేరే పెట్టారా బ్లాక్‌కి, డాక్టర్ కుమార్ వొద్దంటూన్నా వినకుండా.

ఆహూతు లందరితోబాటు నూతన దంపతులు దీప, సిద్ధార్థ కూడా వచ్చి, డాక్టర్ కుమార్‌కి చెరో వైపున నుంచున్నారు. రిబ్బన్ కట్ చేశాడు డాక్టర్ కుమార్ అందరూ లోపలికి వెళ్ళారు. అరుణ ఫోటో క్రింద వెలుగుతూన్న దీపాలకాంతిలో, ఆ ఫోటో క్రిందవున్న తెల్లటి ఫలకంమీద బంగారు రంగులో మెరుస్తూన్న వాక్యాలు పలుకరించా యందరినీ.

**"A doctor should cure, when he can heal often, and comfort always" – Clark**

ఒక్కసారి కళ్ళెత్తి ఆ వాక్యాలవైపూ, అరుణ ఫోటో వైపూ తదేకంగా చూసి, చెమర్చిన కళ్ళతో ముందుకి సాగిపోయాడు డాక్టర్ కుమార్.


Printed and Published by A. Chandra Sekar Rao at 5-9-88, Public Garden Road, Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001.
Editor : A. SUDHAKARA RAO